అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 04-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 సంచిక : 216
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



అవి బడ్జెట్ సమావేశాలు కాదు.. బుల్డోజ్ సమావేశాలు...

ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌కు ఆస్కారమే లేకుండా చేశారు

- విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది బడ్జెట్ సమావేశాలు కాదనీ, అవి బుల్డోజ్ సమావేశాలని పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విమర్శించారు. ప్రశ్నోత్తరాలు, జీవో అవర్ లేకుండానే సభను నడిపారని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మితో కలిసి మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. డిమాండ్లపై కేవలం రెండు రోజులపాటే చర్చించటం శోచనీయమని ఆయన ఈ సందర్భంగా వాపోయారు. ఆర్ అండ్ బీ పద్దులపై మాట్లాడేందుకు తనకు అవకాశమే ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్య వినిమయ బిల్లుపై కూడా పూర్తి స్థాయిలో చర్చ జరగలేదని విమర్శించారు.

రేవంత్‌ది ప్రజా పాలన కాదనీ, అది ప్రతిపక్షాలపై పంజా విసిరే పాలనంటూ దుయ్యబట్టారు. సీఎం వికృత చేష్టలు ఏడు నెలల్లోనే బయటపడ్డాయని అన్నారు. ఆయన ఆటవిక రాజ్యం నడుపుతున్నారంటూ ఎద్దేవా చేశారు.

మధ్యమానేరు నుంచి సిద్ధిపేటకు నీరివ్వండి

- మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిద్ధిపేట జిల్లాలోని ప్రాజెక్టులు నీళ్ల లేక అడుగంటిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్‌లలో ఇదే దుస్థితి నెలకొందని తెలిపారు. సకాలంలో వర్షాలు పడకపోవటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారనీ, పంటలు వేయాలా? వద్దా? అని వారు ఆలోచిస్తున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో మధ్య మానేరు నుంచి నీటిని పంపింగ్ చేయటం ద్వారా సిద్ధిపేట రైతాంగానికి నీరిచ్చేలా చర్యలు తీసుకోవాలని హరీశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు.

ఆ ప్రభుత్వాల చొరవతోనే వర్గీకరణ తీర్పు

కాంగ్రెస్ నేత గజ్జల కాంతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పంజాబ్, తెలంగాణ ప్రభుత్వాల న్యాయపోరాటం, పట్టుదల, చొరవతోనే ఎస్సీ వర్గీకరణ తీర్పు వచ్చిందని కాంగ్రెస్ నేత గజ్జల కాంతం చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు గత 30 ఏండ్లుగా పోరాడుతున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ అంశంపై హైకోర్టు, సుప్రీం కోర్టును ఆశ్రయించిన వారికి న్యాయం జరగలేదని తెలిపారు. పంజాబ్ ప్రభుత్వం కూడా వర్గీకరణ కావాలంటూ హైకోర్టును ఆశ్రయిస్తే అక్కడి కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, పంజాబ్ ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయ పోరాటం చేయడం ద్వారానే తీర్పు వచ్చిందన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కారణం బీజేపీయే అంటూ కొంత మంది ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

అదే నిజమైతే ఆ పార్టీ పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన వర్గీకరణ జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జాబ్ క్యాలెండర్ నిరుద్యోగుల ఆశాకిరణం

- రియాజ్, చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగులకు ఆశాకిరణమని గ్రంథాలయ రాష్ట్ర చైర్మెన్ రియాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధులు చనగాని దయాకర్, డాక్టర్ లింగం యాదవ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమిళనాడు, కేరళ తరహాలో జాబ్ క్యాలెండర్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా, నిరుద్యోగుల అంశాన్ని పక్కన పెట్టిందని విమర్శించారు. చనగాని దయాకర్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులు తీవ్రమైన ఆందోళనలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలపై అన్ని విధాలుగా ఆలోచించి జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని చెప్పారు. ఉద్యోగ ఖాళీల వివరాలను టీజీపీఎస్సీ త్వరలో ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. స్కిల్ యూనివర్సిటీతో తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫారం నెం.3
(రెగ్యులేషన్ 15 (1) (ఎ))
డెట్స్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్ కోల్‌కతాలో
9, ఓల్డ్ పోస్ట్ ఆఫీసు స్ట్రీట్, 7వ అంతస్తు, కోల్‌కతా-70001
డైరీ నెం. 469 ఆఫ్ 2024
(డీఆర్‌టీ-2, హైదరాబాద్‌లోని ఓ.ఎ నెం. 18/2019 నుండి ఉత్పన్నమవుతుంది)
[illegible]
30, జూలై, 2024న నా చేత మరియు ఈయొక్క ట్రిబ్యునల్ సీల్ క్రింద ఇవ్వబడిన ఆదేశం ఇది.
సమన్లు జారీచేయు అధీకృత అధికారి సంతకం.

TERA SOFTWARE LIMITED

Regd. Office: #8-2-293/82/A/1107, Plot No 1107, Road No 55, Jubilee Hills, Hyderabad-33.
CIN: L72200TG1994PLC018391, Website: www.terasoftware.com, Tel: 040 2354 7447

STATEMENT OF STANDALONE UN-AUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED 30TH JUNE 2024

Rupees in Lakhs

PARTICULARS	Quarter Ended			For the Year Ended
	30-06-2024 Unaudited	31-03-2024 Audited	30-06-2023 Unaudited	31-03-2024 Audited
Total Income from operations	2,579.28	2,419.41	2,052.47	8,841.13
Net Profit / (Loss) for the period (before tax, Exceptional and Extraordinary items)	367.20	215.66	190.86	752.69
Net Profit / (Loss) for the period (before tax after Exceptional and Extraordinary items)	402.20	215.66	190.86	613.22
Net Profit / (Loss) for the period after tax (after Exceptional and Extraordinary items)	274.38	171.90	79.21	344.65
Total Comprehensive income for the period (Comprising Profit/(Loss) for the period (after Tax) and other comprehensive income (aftertax))	35.78	24.55	115.09	117.60
Equity Share Capital	1,251.19	1,251.19	1,251.19	1,251.19
Reserves (excluding Revaluation Reserve as shown in the Audited Balance Sheet of current year)				9,997.91
Earning Per Share (of Rs 10/- each) (for continuing and discontinued operations)				
Basic	2.19	1.37	0.63	2.75
Diluted	2.19	1.37	0.63	2.75

STATEMENT OF CONSOLIDATED UN-AUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED 30TH JUNE 2024

Rupees in Lakhs

PARTICULARS	Quarter Ended		For the Year Ended
	30-06-2024 Unaudited	31-03-2024 Audited	31-03-2024 Audited
Total Income from operations	2,579.28	2,419.41	8,841.13
Net Profit / (Loss) for the period (before tax, Exceptional and Extraordinary items)	367.18	215.66	752.20
Net Profit / (Loss) for the period (before tax after Exceptional and Extraordinary items)	402.18	215.66	612.73
Net Profit / (Loss) for the period after tax (after Exceptional and Extraordinary items)	274.36	171.90	344.16
Total Comprehensive income for the period (Comprising Profit/(Loss) for the period (after Tax) and other comprehensive income (aftertax))	35.78	24.55	117.60
Equity Share Capital	1,251.19	1,251.19	1,251.19
Reserves (excluding Revaluation Reserve as shown in the Audited Balance Sheet of current year)			9,997.42
Earning Per Share (of Rs 10/- each) (for continuing and discontinued operations)			
Basic	2.19	1.37	2.75
Diluted	2.19	1.37	2.75

Notes:

1. The above financial results for the Quarter ended 30th June, 2024 have been reviewed by the Audit Committee and were approved by the Board of Directors of the Company at their respective meetings held on 3rd August, 2024
2. This statement is as per regulation 33 of the SEBI (Listing obligations and disclosure Requirements) Regulations, 2015. These financial results of the Company were prepared in accordance with the Indian Accounting Standards prescribed under section 133 of the Companies Act, 2013 ("the act") read with relevant rules issued there under ("Ind AS") and other accounting principles generally accepted in India and guidelines issued by the Securities and Exchange Boardof India ("SEBI").
3. Fixed Assets of the company with gross block value of Rs.838.69 Lakhs have been subjected to an Ad-Interim attachment by the sessions court, Vijayawada on the application by the Govt. of. AP. The court has ordered the company prohibiting the transfer or alienating the listed properties till further orders.
4. Corresponding quarter/Year figures have been re-grouped /re-classified wherever necessary to confirm to the classification of the current period.

Place: Hyderabad
Date: 03-08-2024

For Tera Software Limited
T. Gopichand
Chairman & Managing Director
DIN: 00107886

GAYATRI BIOORGANICS LIMITED

Registered office: B3, Third floor, 6-3-1090, TSR Towers, Raj Bhavan Road, Somajiguda, Hyderabad - 500 082. Website: www.gayatribioorganics.com, CIN: L24110TG1991PLC013512

30 జూన్, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం

(మొత్తం రూ.లక్షల్లో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 30-06-2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30-06-2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 31-03-2024 ఆడిట్‌చేసినవి	ముగిసిన సంవత్సరం 31-03-2024 ఆడిట్‌చేసినవి
1	ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం (నికర)	-	-	-	-
2	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	(21.33)	(19.50)	(22.96)	(68.12)
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల &/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	(21.33)	(19.50)	(22.96)	(68.12)
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు /లేదా అసాధారణ ఐటంల తరువాత)	(21.33)	(19.50)	(22.96)	(68.12)
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	(21.33)	(19.50)	(22.96)	(68.12)
6	ఈక్విటీ వాటా మూలధనం	7,878.81	7,878.81	7,878.81	7,878.81
7	ఇతర ఈక్విటీ				(11,395.48)
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొప్పున) -బేసిక్ మరియు డైల్యూటెడ్	(0.03)	(0.02)	(0.03)	(0.09)

గమనిక:

1) సెబీ (లిస్టింగ్ ఓబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీతో దాఖలు చేయబడిన 30 జూన్, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు సారాంశం పై విధంగా ఉన్నవి మరియు ఆడిట్‌చేయని ఫైనాన్షియల్ సిద్ధం చేయబడినవి. సదరు త్రైమాసికం ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్లు (www.bseindia.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.gayatribioorganics.com పై అందుబాటులో ఉన్నవి.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 03-08-2024

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఉత్తర్వుల మేరకు
సం/-
చైర్మన్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, [illegible] ముంబయి-400710.

డిమాండ్ నోటీసు

[illegible]

క్ర.సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/హామీదారుల పేరు	ఎన్‌పిఎ తేదీ	డిమాండ్ నోటీసు తేదీ
1	షేక్ నజీమా బేగం, భర్త షేక్ ఖాసిం, వయస్సు సుమారు 37 సంవత్సరాలు, [illegible]	09-12-2023	23-07-2024
		రుణ మొత్తం Rs. 20,00,000/-	బాకీపడిన మొత్తం Rs.36,00,950/-

AMRPTTF2304260002: [illegible]

తేది: 03-08-2024, ప్రదేశం: [illegible] సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, [illegible] ముంబయి-400710.

డిమాండ్ నోటీసు

[illegible]

క్ర.సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/హామీదారుల పేరు	ఎన్‌పిఎ తేదీ	డిమాండ్ నోటీసు తేదీ
1	[illegible]	08-11-2023	23-07-2024
		రుణ మొత్తం Rs. 25,00,000/-	బాకీపడిన మొత్తం Rs.29,90,515/-

BLNGRTF2110310001: [illegible]

తేది: 03-08-2024, ప్రదేశం: [illegible] సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, [illegible] ముంబయి-400710.

డిమాండ్ నోటీసు

[illegible]

క్ర.సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/హామీదారుల పేరు	ఎన్‌పిఎ తేదీ	డిమాండ్ నోటీసు తేదీ
1	[illegible]	09-04-2024	24-07-2024
		రుణ మొత్తం Rs. 20,00,000/-	బాకీపడిన మొత్తం Rs.32,53,142/-

MIYPRTF2304260001: [illegible]

తేది: 03-08-2024, ప్రదేశం: [illegible] సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

CanFinHomes Ltd (Sponsor CANARA BANK) HOME LOANS + DEPOSITS Translating Dreams into Reality

ఎల్‌బి నగర్ బ్రాంచ్, చిరునామా: 3-11-114, ప్లాట్ నెం.2, 1వ అంతస్థు, శ్రీ నిలయం, ఆర్టీసీ కాలనీ, ఎల్‌బి నగర్, హైదరాబాద్-500074.
ఫోన్: 040-49501072/7625079163
Email : lbnagar@canfinhomes.com
(CIN No.: L85110KA1987PLC008699)

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు (నెం.54 ఆఫ్ 2002)

దిగువ వారికి,

శ్రీ ఇప్పలపల్లి రవీందర్ రెడ్డి, తండ్రి: శ్రీ ఇప్పలపల్లి అంజిరెడ్డి, నివాసం ఇంటి నెం.2-45, కొల్లపడ్కల్, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-509325

మీతో కలిసి లేటు శ్రీ ఇప్పలపల్లి వినీత్ రెడ్డి, తండ్రి: శ్రీ ఇప్పలపల్లి రవీందర్ రెడ్డి ఇరువురికి చెందిన ఈ దిగువ ఉదహరించిన ఆస్తులను తనఖా ఉంచి మా బ్రాంచి నుండి హౌసింగ్ లోన్ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు ఋణఖాతాలో తేది.01.08.2024 నాటికి రూ.36,96,445/- (అక్షరాల ముప్పై ఆరు లక్షల తొంభై ఆరు వేల నాలుగు వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీతో మరియు సదరు బకాయి మొత్తంపై అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ + [illegible]

[illegible]

తేది: 02.08.2024, ప్రదేశం: ఎల్‌బి నగర్ సం/- అధీకృత అధికారి, కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

తెలంగాణ ప్రభుత్వము
పురపాలక సంఘం కార్యాలయం :: ఆదిబట్ల రంగారెడ్డి :: జిల్లా

[illegible]

క్ర.సం.	వివరణ	యూనిట్	ప్రతిపాదించిన రేటు
1	[illegible]	%	
2	సిసి రోడ్లకు కోర్ కటింగ్ చార్జీలు	ఒక్కో కోర్ కటింగ్‌కు	

గమనిక :- 1. ఫర్మ్‌లు/ఏజెన్సీలు సీల్డ్ కొటేషన్లు సమర్పించాలి., అనగా కవర్-ఎ మరియు కవర్-బి ఒకే సీల్డ్ ఎన్వెలప్‌లో మరియు అది 08.08.2024 సా.3.30 గం.కు లేదా ముందుగా కార్యాలయానికి చేరాలి.
2. క్రింద సంతకం చేసినవారి చేత సీల్డ్ కొటేషన్లు 09.08.2024న తెరువబడును.

DIPR. R.O.No.2465-PP/CL/ADVT/1/2024-25, Dt. 03-08-2024

సం/- కమిషనర్, ఆదిబట్ల మున్సిపాలిటీ.

రీజినల్ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్‌వారి సమక్షంలో
కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 13(4) మరియు కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 30(6) (ఎ) విషయంలో
మరియు
అపెకో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ విషయంలో
(CIN: U45400TG2012PTC084987)
దీని రిజిష్టర్డు ఆఫీసు: ఇంటి నెం. 8-3-1062, ఫ్లాట్ నెం.5, ఫ్లాట్ నెం.401,జ్యోతి ప్యాలెస్, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా, 500034 .....పిటిషనర్

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి ప్రకటన ఇవ్వడమేమనగా, "తెలంగాణ రాష్ట్రం" నుండి "న్యూ ఢిల్లీ రాష్ట్రానికి" కంపెనీ రిజిష్టర్డు ఆఫీసును మార్పు ఉద్దేశ్యంతో శుక్రవారం, ఆగస్టు 2, 2024న నిర్వహించబడిన అసాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన ప్రత్యేక తీర్మానపు నియమాలలో కంపెనీ యొక్క మెమోరాండం ఆఫ్ అసోసియేషన్‌లో మార్పు నిర్ధారణ కోరుతూ.. కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్13 క్రింద రీజినల్ డైరెక్టర్, సౌతర్న్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్, తెలంగాణ వారికి పైన పేర్కొన్న కంపెనీ దరఖాస్తు చేయుటకు ప్రతిపాదిస్తున్నది.

కంపెనీ యొక్క రిజిష్టర్డు ఆఫీసు ప్రతిపాదిత మార్పుకు సంబంధించి ప్రభావితం అయ్యే అవకాశంఉన్న ఎవరైనా వ్యక్తి, అతడు/ఆమె యొక్క ఆసక్తి మరియు అభ్యంతరాలకుగల కారణాలు చూపుతూ అఫిడవిట్ [illegible]

[illegible]

అపెకో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కొరకు

డిన్: 00007934 | డిన్: 08063806

ప్రదేశం : హైదరాబాద్
తేది : 05-08-2024

హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (ఇంజనీరు) వారికార్యాలయం, ఓ.& ఎం సర్కిల్ నెం.1, గోషామహల్, హైదరాబాద్-12.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నోటీసు నెం.DB-D3/CGM(E)/O&MC.I/2024-25 తేది: 02.08.2024

ఐటెమ్ నెం.	టెండరు ఐడి	పని పేరు	మొత్తం
97 (ఎక్సైజు ధరకు చెల్లించబడినవి)	533144	లంగర్ హౌస్ సెక్షన్, ఓ.&ఎం డివిజన్-3 యొక్క సబ్ డివిజన్-2 పరిధిలోని రాందేవ్‌గూడ వద్ద మటేర్ నుండి ఇ.నెం. 9-5-115/23/2/49 వరకు 200 ఎంఎం దయా ఎస్‌డబ్ల్యూ సీవర్ లైన్‌లో 150 ఎంఎం దయా ఎస్‌డబ్ల్యూ సీవర్ లైన్ యొక్క రీమోడలింగ్.	రూ. 10.72 లక్షలు
98	533151	[illegible]	రూ. 36.33 లక్షలు

[illegible]

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (ఇంజనీర్), ఓ.&ఎం సర్కిల్ నెం-1, గోషామహల్, హైదరాబాద్-012.

Customer Care Center - Dial 155313

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 04-08-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 10 సంచిక: 216 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల: 8.00

నవ దృక్పథం



9వ వార్షికోత్సవం

వార్తను చేరవేయడంతో పాటు ఆ వార్తలో ఉన్న బాధితుల పక్షాన నిలబడటం జర్నలిజం ప్రధాన కర్తవ్యం. ఆ బాధితులు అణగారిన వర్గాలైనప్పుడు పత్రికే వాళ్ల ప్రధాన గొంతుక. పత్రికలకు ఈ విషయంలో భిన్నమైన వైఖరులుంటాయి. బాధితుల పక్షాన నిలబడాల్సి వస్తుందని కొన్ని సార్లు అసలు వార్తనే మార్చేసే పత్రికలున్న రోజుల్లో మనం ఉన్నాం. అలాంటప్పుడు బాధితులు సమాజం దృష్టిలో నిందితులుగా చిత్రీకరిం చబడతారు. మైనారిటీలు, గిరిజనుల పట్ల కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వ వైఖరి వల్ల కొన్ని మీడియా సంస్థలు బాధితులపక్షాన కాకుండా ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించేలా వార్తలు రాస్తుంటాయి. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలకు సంబంధించి కూడా పత్రికల్లో ఈ వైఖరిని ప్రధానంగా గమనిస్తుంటాము. ఇలాంటి వాతావరణంలో బాధితుల పక్షాన నిలబడే పత్రికగా నేను నవతెలంగాణను చూస్తాను. జాతీయ, అంతర్జాతీయ వార్తల విషయంలోగానీ, రాష్ట్రాల వార్తాంశాలను కవర్ చెయ్యడంలోగానీ నవతెలంగాణ, ప్రజాశక్తి పత్రికలు ప్రజల గొంతుకకు అద్దం పడుతున్న ధోరణినే నేను ఎక్కువగా గమనిస్తున్నాను. ప్రజల్లో ప్రశ్నించే తత్వం, సైంటిఫిక్ టెంపర్ పెంచే అత్యంత విలువైన వ్యాసాలకు ఎడిటోరియల్ పేజీలో చాలా ఎక్కువ స్థలం కేటాయించడం నాకు చాలా నచ్చిన అంశం. నవ తెలంగాణ పత్రిక విద్యార్థులకు దగ్గరయ్యేలా ఎక్కువ ప్రయత్నాలు చెయ్యాలని కోరుకుంటూ వార్షికోత్సవ శుభాకాంక్షలు

- తులసి చందు, జర్నలిస్ట్

శ్రీశైలంలో కృష్ణమ్మ పరవళ్లు..



ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి

ఘాట్ రోడ్డులో వాహనాల రద్దీ



నవతెలంగాణ- అచ్చంపేట

శ్రీశైలం గేట్లు తెరుచుకోవడంతో ఆ అందాలను చూసేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కృష్ణానది పరిధిలో ఉన్న ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయి. ఆల్మట్టి డ్యామ్, జూరాల ప్రాజెక్టు నుంచి గేట్లు తెరిచి శ్రీశైలానికి నీరు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిండటంతో ..6లో

మాఫీ కాని చిక్కులు

రుణమాఫీ పథకంలో అడుగడుగునా ప్రతిబంధకాలు

రుణమాఫీ పథకంలో రకరకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిలో కొన్ని బ్యాంకర్ల నుంచి తలెత్తుతుండగా, మరికొన్ని నియమ నిబంధనల కారణంగా పుట్టుకొస్తున్నాయి. సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ అధికారులు, కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ డెస్క్‌లు, బ్యాంకుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా అనేక సమస్యలకు పరిష్కారం లభించడం లేదని ఆరోపిస్తున్నారు.

- బ్యాంకర్ల కిరికిరి..
- గడువు తేదీలతో రైతుల్లో గందరగోళం
- రేషన్‌కార్డే కాకుండా ఇతరత్రా అనేక సమస్యలు
- ప్రభుత్వం దృష్టి సారించాలి



నవతెలంగాణ ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రుణమాఫీ సాఫీగా సాగేలా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2018 డిసెంబర్ 12, 2023 డిసెంబర్ 9 గడువు తేదీన రిలీజ్ చేసిన పంట రుణాలకే ఈ స్కీమ్ వర్తిస్తుందనే నిబంధన ఉండటంతో కొందరు అర్హత కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. కొన్ని బ్యాంకులు రెన్యూవల్ చేసినప్పుడు లోన్ అకౌంట్ నంబర్ మారుస్తుండగా కొన్ని మాత్రం యథాతథంగా ఉంచుతున్నాయి. ఫలితంగా అనేక మంది రైతులు అర్హతున్నా అనర్హులుగా పరిగణించబడ్డారు. ఇలాంటి రైతులు ఆన్‌లైన్ స్టేటస్ (రుణమాఫీ స్థితి) చెక్ చేస్తే 'రుణం మంజూరైన తేదీ నిబంధన ప్రకారం లేదు' అని చూపిస్తోంది. అదే రైతుకు మరో బ్యాంకులో అకౌంట్ ఉంటే దాని స్థితి తీసుకుంటే 'టూ బీ ప్రాసెస్డ్' అని వస్తోంది. ఒకే రైతు ఒకే సమయంలో రెండు వేర్వేరు బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుంటే ఒక్కో దాంట్లో ఒక్కో స్టేటస్ చూపిస్తుండటంతో రేషన్‌కార్డు ఉన్నా పంట రుణమాఫీ పథకానికి చాలా మంది రైతులు అర్హత కోల్పోతున్నారు.

ఈ చిక్కు తీర్చేదెవరు..?

ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం పంచాయతీకి చెందిన శాబాదు నారాయణరెడ్డి 2017 జనవరిలో ఖమ్మంలోని ఐడీబీఐ బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నారు. అదే సమయంలో డీసీసీబీ, ఖమ్మం రూరల్ బ్రాంచి నుంచి కూడా రుణం పొందారు. ప్రతి సంవత్సరం అసలు + వడ్డీ చెల్లించి రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. 2023లోనూ రెన్యువల్ చేశారు. కానీ డీసీసీబీలో ఫ్రెష్‌లోన్ తీసుకున్నట్టుగా చూపుతుండగా.. ఎప్పటికప్పుడు రెన్యువల్ చేస్తున్నా ఐడీబీఐలో మాత్రం 2017లోనే లోన్ తీసుకున్నట్టుగా ఫైల్ పంపడంతో రుణమాఫీ స్టేటస్‌లో "రుణం మంజూరు అయిన తేదీ నిబంధనల ప్రకారం లేదు" అని వస్తోంది. ఇప్పుడు నారాయణరెడ్డికి రుణమాఫీ స్కీమ్ వర్తిస్తుందా? లేదా? అని ఆ కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రెన్యూవల్ చేసినా పాత తేదీతోనే..

కొన్ని బ్యాంకుల్లో రెన్యువల్ చేసినా పాత మంజూరు తేదీనే రుణమాఫీ ...15లో

మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి

నిబంధనల ప్రకారమే భూముల క్రమబద్ధీకరణ

- నాలుగు దశల్లో పరిశీలించిన తర్వాతే ఆమోదం
- ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్/ భూపాలపల్లి

లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)ను మూడు నెలల్లో పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై శనివారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఈ ప్రక్రియను నిర్దేశిత గుడువులోగా పూర్తి చేయడం వల్ల రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ..15లో

చివరి ఆయకట్టుకూ సాగు నీరందిస్తాం

మాది రైతు పక్షపాత ప్రభుత్వం

ధరణి స్థానంలో అందరికీ ఆమోదయోగ్యమైన పథకం తెస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 15లో..



బొగ్గు బ్లాక్‌లను

సింగరేణికే కేటాయించాలి

దాని రక్షణ కోసమే ప్రజా ఉద్యమాలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- 2015 బొగ్గు గనుల చట్టాన్ని మార్చాలి : సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు
- మణుగూరులో సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర
- సమస్యలను వివరించిన కార్మికులు

6లో..

మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు

8 మంది అధికారులకు స్థానచలనం

ఉత్తర్వులు జారీచేసిన సీఎస్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 8 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనలో బాగంగానే ఈ బదిలీ చేశామని చెప్పారు.వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే ...15లో

ఫీజు కడితేనే సీటు!

ప్రభుత్వ, ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల ఇష్టారాజ్యం

- ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు తప్పని తిప్పలు
- అలాట్‌మెంట్ ఆర్డర్‌లో 'సున్నా' ఫీజు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని చెప్పినా వినని యాజమాన్యాలు
- మొత్తం ట్యూషన్ ఫీజు కట్టాల్సిందేనని హుకుం
- ఆందోళనలో విద్యార్థులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. గతనెల 31న రెండో విడత సీట్లను సాంకేతిక విద్యాశాఖ కేటాయించింది. మొదటి, రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి రూ.5,100 ఫీజు చెల్లించారు. అలాట్‌మెంట్ ఆర్డర్‌ను తీసుకున్నారు. రిపోర్టు చేసేందుకు కేటాయించిన కాలేజీలకు తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు వెళ్తున్నారు. అయితే ప్రభుత్వ, ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థులను ట్యూషన్ ఫీజు చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తున్నాయి. అలాట్‌మెంట్ ఆర్డర్‌లో ట్యూషన్ ఫీజు సున్నా అని ఉన్నా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్నా మొత్తం ఫీజు చెల్లించాలని హుకుం జారీ చేస్తున్నాయి. ప్రభుత్వ కాలేజీలు కూడా ఫీజు చెల్లించాలని అడగడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు చదువు పూర్తయిన విద్యార్థులను ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ కాలేజీ యాజమాన్యాలు వేధింపులకు గురిచేశాయి. తాజాగా ఫీజు కడితేనే సీటు ఇస్తామంటూ చెప్తుండడం విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నది. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 86,509 సీట్లున్నాయి. రెండో విడతలో 81,490 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ఇంకా 5,019 సీట్లు మిగిలాయి.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఆందోళన

మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ ఎస్సీ విద్యార్థినికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన సంగారెడ్డి జిల్లా కందిలో ఉన్న అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కాలేజీలో అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కోర్సులో సీటు వచ్చింది. ఆమె ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి రూ.5,100 ఫీజు చెల్లించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉండడంతో అలాట్‌మెంట్ ఆర్డర్‌లో ట్యూషన్ ఫీజు రూ.సున్నా అని వచ్చింది. దీంతో ఆమె తన తండ్రితో కలిసి రిపోర్టు చేసేందుకు ఆ కాలేజీకి వెళ్లారు. మొదటి సెమిస్టర్ ట్యూషన్ ఫీజు ..15లో

కేరళకి రూ.కోటి విరాళం

ఎఐకెఎస్ కేంద్ర కమిటీ నిర్ణయం

- ఆగస్టు 10న దేశవ్యాప్త నిధుల సమీకరణకు పిలుపు
- రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఏఐకేఎస్ కేంద్ర కమిటీ భేటీ ప్రారంభం

6లో..

మా భూమి మాకిప్పించండి

గద్వాల నుంచి అసెంబ్లీకి ఓ కుటుంబం పాదయాత్ర

అడ్డుకున్న పోలీసులు .. న్యాయం కోసం మీడియాను ఆశ్రయించిన బాధితులు

వివరాలు 15లో



దోస్తీ...

స్నేహమంటే ఒక నులివెచ్చటి స్పర్శ. భాషకందని కమ్మటి భావన. చుట్టూ అల్లుకున్న మానవ సంబంధాల పొదరింట్లో విరిసిన అందమైన గులాబీ. జీవితంలో మరిచిపోలేని ఒక మధుర జ్ఞాపకం. ఎప్పుడో చిన్నప్పుడు బుడిబుడి అడుగుల బాల్యంలోనే అల్లుకునే స్నేహ బంధాలు కొన్నయితే, పరవళ్లు తొక్కే యవ్వనంలో పెనవేసుకునే అనుబంధాలు మరికొన్ని. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఏ కాలేజీలోనో, లైబ్రరీలోనో, కలిసి నడిచే కారిడార్‌లోనో, తరగతి గదిలోని ఒకే బెంచిపై, మాస్టారు బోధించే పాఠాల్లోని సందేహాల్లో ఊపిరి పోసుకొనే స్నేహం..ఒక మహావృక్షంలా ఎదుగుతుంది. జీవితంతో మమేకమవుతుంది. ఒక విడదీయరాని అనుబంధమై పోతుంది. అసలు కళాశాల అంటేనే స్నేహితుల కలల కాణచి. సహ విద్యార్థిగా రూపుదిద్దుకొనే పరిచయం..స్నేహమై ఎలా ఎదుగుతుందో, జీవితంలో ఒక తీపి గుర్తుగా ఎలా మిగిలిపోతుందో ఏ డైరీని అడిగినా చెబుతాయి. మదిలో

> **చరిత్రలో చూసుకుంటే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్నేహం, స్వాతంత్య్రం కోసం చేసిన సమరంలో సాగిన స్నేహం. ఇక మానవాళి విముక్తి కోసం జీవితాలను అర్పించిన మార్క్స్, ఎంగెల్స్‌ల స్నేహం ఇప్పటికీ ఆదర్శవంతమైనది. 'మానవళి చరిత్రలో స్నేహానికి దర్పణం పట్టే అన్ని ఉదాహరణలను అధిగమించే స్నేహితుల ద్వయం' అని మార్క్స్, ఎంగెల్స్ స్నేహం గురించి లెనిన్ వ్యాఖ్యానిస్తాడు. వారి స్నేహం ఎంత బలమైనదో, వారు దర్శించిన విప్లవక్రమం అంత నిర్మాణాత్మకమైనదని వీరి స్నేహం రుజువు చేస్తుంది. ప్రపంచమానవాళిని మానవీయంగా తయారు చేయడానికి చేసిన కృషిలో వీరి మైత్రి వెలుగొందింది.**

నిక్షిప్తమైన భావాలను, అనుభవాలను, అనుభూతులను పంచుకోవడం తప్ప ఏ స్వార్థం లేని జీవన బంధం స్నేహం. జీవితంలో ఎవరున్నా, లేకున్నా మంచి నేస్తం ఒకరు తోడుంటే చాలు.

'దోస్త్ మేర దోస్త్..తు హై మేరీ జాన్..వాస్తవం ర దోస్త్..నువ్వే నా ప్రాణం.. బ్రతుకు తీపి పాటలో మధుర స్వరాలం మనం స్నేహ మనే మాటలో చెరో అక్షరం మనం' అని సినీ కవి అన్నట్టు తారతమ్యాలు లేని అరమరికలు లేని స్నేహం అంతస్తులు మరిచి అంతరంగాలను పంచుకుంటుంది. స్నేహానికి కులం లేదు. మతం అడ్డురాదు. అది చంద్రుని వెన్నెల లాంటిది. వీచే చిరుగాలి వంటిది. జలజలా రాలే సెలయేటి లాంటిది. అవును..అన్ని మతాలకు దోస్తీ సమ్మతమే.

ఓ నిముషం కోపంగా మరునిముషం నవ్వులతో.. మరి కాసేపు ఈర్ష్యతో.. ఇంకాసేపు అనురాగంతో.. జీవితంలో కురిసే రసాలన్నిటినీ రుచిచూపించేదే స్నేహం.అది భవిష్యత్తును కలలు కంటుంది. వర్తమానంలో కలహించుకుంటుంది. గతాన్ని గుర్తుచేసుకొని కంటతడి పెడుతుంది. స్నేహానికి ఉన్న విలువను కాపాడుకొని.. అసూయలను పాతరేసి.. ఈర్ష్యలను వదిలేసి.. కమ్మనైన కలలుకనే మంచి దోస్తు ప్రతి ఒక్కరికి దొరుకుతారు. ఆ సోపతిని జీవితాంతం నిలుపుకోవాలి. అదే స్నేహానికి పరమార్థం. స్నేహానికున్న విలువ వెలకట్టలేనిది. ఈ లోకంలో స్నేహితుడు/ స్నేహితురాలు లేకుండా ఏ వ్యక్తి వుండరు.

ఎన్ని వర్గాలుగా విభజించినా స్నేహితుడు ఎప్పుడు హితుడే. 'స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం, స్నేహమే నాకున్నదీ, స్నేహమేరా పెన్నిధీ!' అన్నాడో సినీకవి. జగత్తులో ఎన్ని బంధాలు, అనుబంధాలు ఉన్నా స్నేహబంధం అనేది మాత్రం మనిషి జీవితంలో చాలా ప్రత్యేకమైనది. మిగిలిన అన్ని బంధాలు ఏదో రూపంలో మన ప్రమేయం లేకుండానే మన జీవితంలో ప్రవేశిస్తాయి. కానీ స్నేహబంధం మాత్రం పూర్తిగా మన ఇష్టంతో, మనకు నచ్చిన వారితోనే ఏర్పడుతుంది. స్నేహితుల పట్ల విజ్ఞతతో వ్యవహరించడం చాలా అవసరం. సమయ సందర్భాలను బట్టి మాత్రమే స్పందించాలి. స్నేహితుని లోపాలను ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా, అతని మేలుకోరి సున్నితంగా తెలియజెప్పాలి. నేడు స్నేహం కూడా కృత్రిమమై పోయింది. మొహమాటపు స్నేహాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మనసు లోతుల నుంచి పెల్లుబికే స్నేహ సంబంధాలు చాలా అరుదు. స్నేహం ముసుగులో మోసం, దగా, వంచన కొనసాగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. అలాంటి స్నేహాలను నిజమైన స్నేహాలుగా చెప్పుకోలేము. అవి మంచి స్నేహాలుగా నిలువజాలవు కూడా. పరిచయాలు, అవసరాల మేరకు ఏర్పడ్డ మిత్రుత్వాన్ని నిజమైన స్నేహంతో పోల్చలేము. రెండు భిన్నమైన, వైరుధ్య పూరితమైన భావాలు గలవారి మధ్య స్నేహం చిగురించడం కష్టం. భిన్న అభిప్రాయాలు ఉండవచ్చు. కానీ విరుద్ధ దృక్పథాలు స్నేహం చేయలేవు. చేసిన దాఖలాలూ లేవు.

చరిత్రలో చూసుకుంటే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్నేహం, స్వాతంత్య్రం కోసం చేసిన సమరంలో సాగిన స్నేహం. ఇక మానవాళి విముక్తి కోసం జీవితాలను అర్పించిన మార్క్స్, ఎంగెల్స్‌ల స్నేహం ఇప్పటికీ ఆదర్శవంతమైనది. 'మానవళి చరిత్రలో స్నేహానికి దర్పణం పట్టే అన్ని ఉదాహరణలను అధిగమించే స్నేహితుల ద్వయం' అని మార్క్స్, ఎంగెల్స్ స్నేహం గురించి లెనిన్ వ్యాఖ్యానిస్తాడు. వారి స్నేహం ఎంత బలమైనదో, వారు దర్శించిన విప్లవక్రమం అంత నిర్మాణాత్మకమైనదని వీరి స్నేహం రుజువు చేస్తుంది. ప్రపంచ మానవాళిని మానవీయంగా తయారు చేయడానికి చేసిన కృషిలో వీరి మైత్రి వెలుగొందింది. అదే విధంగా ఒక దేశంలో విప్లవ సాధనలో ఏర్పడిన మైత్రి ఫిడెల్‌కాస్ట్రో, చేగువేరాలది. ఇలా ఆశయాలదారుల్లో పరిమళించిన స్నేహాలు మనకెంతో స్ఫూర్తినీ, చైతన్యాన్ని కలిగిస్తాయి. చిరస్మరణీయంగా నిలుస్తాయి. అలాంటి ఆశయాలకు బాటలో సాగే స్నేహం చిరస్మరణీయం.

సంపాదకీయం

పార్లమెంటు ప్రమాణాలపై బీజేపీ వేటు


తెలకపల్లి రవి

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ప్రధాని నరేంద్ర మోడీ ఆయన మంత్రులు, బీజేపీ నేతల అసహనం అడుగడుగునా తాండవించడం ఆశ్చర్యం కలిగించలేదు. మూడు ఎన్నికల్లో తొలిసారిగా బీజేపీ ఆధిక్యత కోల్పోయి, ఎన్డీయేలోని ఇతర భాగస్వాములపై ఆధారపడాల్సి రావడం భరించలేనిదిగా వున్నట్టు స్పష్టమైంది. గత రెండు పర్యాయాలకు భిన్నంగా ఈసారి కాంగ్రెస్ బలం పెంచుకుని అధికారిక ప్రతిపక్షంగా ఆవిర్భవించడం, రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేత హోదా పొందడం మరింత దుర్భరంగా తయారైంది బీజేపీకి.ఆయన కూడా ఇందుకు తగినట్టే నిశిత విమర్శలు, విసుర్లతో బీజేపీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. హిందూత్వ రాజకీయాలపై తొలిసారి లోతైన చర్చకు దారితీసిన తీరు గతంలో ఈ శీర్షికలో చెప్పుకున్నాం. అయితే రాజకీయ ప్రమాణాలతో రాజ్యాంగ నిబంధనలతో నిమిత్తం లేని ఉక్రోశంతో రెచ్చిపోయిన బీజేపీ సభ్యులు, మంత్రులు ప్రతిపక్షాలపై, రాహుల్‌గాంధీపై రాష్ట్ర ప్రభుత్వాలపై ఇష్టానుసారం దాడి చేశారు. ఈ దాడి అనేక సందర్భాల్లో వికృతంగా తయారైంది. జుగుప్సగొల్పే భాష, చవకబారు ప్రయోగాలు, చులకన చేసే మాటలూ సభ గౌరవానికి మచ్చ తెచ్చేస్థాయికి చేరాయి. ఎన్డీయే భాగస్వాములలో ఒకరిద్దరు తప్ప ఇతరులు ఈ వ్యవహారంలో పాల్గొనలేదు గాని వద్దని చెప్పే ప్రయత్నం కూడా చేసింది లేదు. పైగా వీలుచిక్కితే కేంద్రాన్ని, మోడీని పొగిడే ప్రయత్నం చేశారు.ఏతావాతా లోక్‌సభ సమావేశాలు మొత్తం రసాభాసగా మారాయి. దీనికి తగినట్టే చివరిరోజుల్లో నూతన పార్లమెంటు భవనం లీకవడం, మరోరోజు నిజంగానే బురదనీరు కూడా ఆసక్తి కలిగించే పరిణామం. ఆర్భాటంగా కట్టిన నూతన భవనంలో ఇదెలా జరిగిందనే సమీక్ష లేకపోగా కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన విషాదాన్ని కూడా రాజకీయ వివాదంగా మార్చి విషంకక్కే ప్రయత్నం వెగటు పుట్టించింది. తన విమర్శలు తట్టుకోలేక ఈడితో దాడులు చేయించాలని పథకాలు వేస్తున్నట్టు తెలిసిందని రాహుల్‌గాంధీ చివరిరోజున వెల్లడించడంతో ఇది కక్షసాధింపు పర్వంలోకి ప్రవేశించింది.

చక్రవ్యూహం వర్సెస్ వక్రవ్యూహం

మోడీ పాలనలో దేశం చక్రవ్యూహం (పద్మవ్యూహం)లో చిక్కుకుందని, మధ్యతరగతి ఆశలను నిర్మలా సీతారామన్ వమ్ముచేశారని రాహుల్ సోదాహరణంగా ప్రసంగించారు. మోడీ, అమిత్‌షా, మోహన్ భగవత్, అజిత్‌దోవల్, అంబానీ, అదానీ ఈ ఆరుగురు మాత్రమే దేశాన్ని ఏలుతున్నారని ఆయన పేర్కొన్నారు.అంబానీ, అదానీల పేరు ప్రస్తావించడంపై స్పీకర్ అభ్యంతరం పెట్టగా ఎ1, ఎ2 అంటానని రాహుల్ చమత్కారం చేశారు! బడ్జెట్ ప్రక్రియ మొదలైన రోజున హల్వా చేయడం పరిపాటి. కాగా ఈ కార్యక్రమంలో దిగువకులాల వారెవరూ లేరని కూడా ఆయన ఆరోపించారు. స్పీకర్‌తో సహ అనేక అభ్యంతరాలు చెబుతున్నా, అడ్డు తగులుతున్నా రాహుల్ వెనక్కు తగ్గకుండా ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ చక్రవ్యూహం అనే మాట,ఆయన లేవనెత్తిన ఇతర అంశాలు ప్రజలను విస్తారంగా ఆకర్షించాయి. సరిగ్గా ఈకారణం వల్లనే అవి పాలకపక్షానికి కంటగింపుగానూ మారాయి. నిజానికి ఆయన మాట్లాడుతున్నప్పుడే ఆర్థికమంత్రి రెండు చేతులతో మొహాన్ని కప్పుకోవడం ద్వారా తన వ్యతిరేకతను, అవహేళన స్యాన్ని ప్రదర్శించారు.రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సహపలువురు మధ్యలో అభ్యంతరాలు చెప్పే ప్రయత్నం చేశారు. వీటన్నిటినీ తట్టుకుంటూనే ఆయన అనుకున్న విధంగా ప్రసంగాన్ని కొనసాగించగలిగారు. దాంతో ఆ తర్వాత తమ వంతు వచ్చినప్పుడు బీజేపీ సభ్యులు కనీస విలువలు పాటించకుండా దండయాత్ర చేశారు.రాజకీయంగా సభలో గతంలో ఎవరూ ఉపయోగించని మాటలదాడి చేశారు.

రాహుల్ వెనకబడిన కులాల గురించి,జనగణనకు నిరాకరించడం ద్వారా వారికి అన్యాయం చేయడం గురించి మాట్లాడారు. కేంద్రమంత్రిగా వుండి నోటి జాడ్యంతో ఈసారి మాజీగా మిగిలిన అనురాగ్‌ఠాకూర్ అధినేత మెప్పుకోసం దీన్ని దాడికి లక్ష్యంగా చేసుకున్నారు.ఆ క్రమంలో తనను తానే మర్చిపోయి ఇష్టానుసారం నోరుపారేసుకున్నారు. 'రాహుల్ గాంధీలు ప్రమాదవశాత్తూ హిందువులయ్యారు. ఆయనకు మహాభారతం గురించి ఎంత మాత్రం అవగాహన లేదు. అభిమన్యుడిని భారతంలో ఏడుగురు మహారథులు చంపేశారు.అమెరికా అంకుల్ శామ్, అంకుల్ సొరేస్ వంటివారి ప్రభావంతో ఆయన ప్రసంగాలు అలా తయారై వుండొచ్చు.తమ పార్టీ చిహ్నామైన కమలాన్ని, పద్మాన్ని చక్రవ్యూహంతో ముడిపెట్టి మాట్లాడుతున్నారు. కానీ పద్మాన్ని అవమానించడ మంటే శివున్ని బుద్ధున్ని తిలక్‌ను అవమానించడమే' అంటూ తిట్టిపోశారు. 'అసలు తన జాతి ఏమిటో తెలియని వ్యక్తి కులగణన గురించి మాట్లాడుతున్నారు' అంటూ 'రాహుల్‌గాంధీ కులమేంటని' బాహాటంగా ప్రశ్నించారు. తన కులమే తెలియని వారు హిందువులా అంటూ ఆక్షేపించారు. రాహుల్ తాత ఫిరోజ్‌గాంధీ నానమ్మ ఇందిరాగాంధీ, తల్లి సోనియాల నేపథ్యాలనూ ప్రశ్నించారు. దీంతో సభలో తీవ్ర నిరసన వ్యక్తమైంది. 'మీరు కులం పేరుతో నన్ను అవమానించవచ్చు.కానీ నేను కిందివర్గాల కోసం పోరాడుతూనే వుంటానని' రాహుల్ బదులిచ్చారు. అయినా తర్వాత ఇతరు బీజేపీ నేతలు కూడా అనురాగ్‌ఠాకూర్‌కు వంతపాడారు.సంబిత్ పాత్ర మాట్లాడుతూ మీరు కులం లెక్కలు అడుగుతున్నారు. మిమ్మల్ని సభలో అడిగితే తప్పు బయట ఎవరిని అడిగినా తప్పు కాదా? అని వితండ వాదన లేవనెత్తారు. సంబిత్ పాత్ర ప్రసంగం మొత్తం కులం పైనే సాగింది.ఇక పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్‌రిజిజు కూడా ఇదే వాదన చేస్తూ కులగణన చేయాలనేవారిని కులం అడిగితే తప్పు ఏముందన్నారు. కాంగ్రెస్ కులం పేరుతో దేశాన్ని విభజించాలని కుట్ర పన్నుతున్నదనీ, అఖిలేష్‌యాదవ్ కూడా వత్తాసునిచ్చారని ఆరోపించారు.వీధుల్లోంచి పార్లమెంటులోకి హింసను తీసుకొచ్చే పథకం పన్నారన్నారు,(సభ బయట కూడా యూపీ ఎమ్మెల్యే నందకిశోర్ గుజ్జార్ మాట్లాడుతూ ఫిరోజ్ ఖాన్ మనవడి కులం ఏమవుతుందని ఎదురు ప్రశ్న వేశారు).ఇదే కోవలో ఇంకా చాలామంది మంత్రులు, ఎంపీలు సభలోనూ, బయట వ్యాఖ్యలలోనూ కూడా కులాల గురించి మాట్లాడితే తప్పేంటని ఎదురు దాడిచేశారు, గాంధీ కుటుంబంలో వారి పేర్లు బంధుత్వాలు తీసుకొచ్చి వారికి జాతి లేదని అపహాస్యం చేశారు. ఇక్కడ సమస్య ఒక కుటుంబం గురించో వ్యక్తి గురించో కాదు. మత రాజకీయాలతో దేశంలో అసహన వాతావరణం సృష్టించిన పాలక పార్టీ కులగణనను వ్యతిరేకించడం కోసం కులం రచ్చ చేయడమే ఇక్కడ విపరీతం.

మోడీ వత్తాసు, కంగనా పైత్యం

దీనిపై మీడియాలోనూ రాజకీయ వర్గాలలోనూ తీవ్ర నిరసన విమర్శలు వచ్చాక కూడా కండ్లు తెరవకపోగా బీజేపీ అగ్రనాయకత్వమే అనురాగ్‌ఠాకూర్‌కు అండగా నిలిచింది.స్వయంగా ప్రధాని మోడీ ఆయన ప్రసంగాన్ని ఆకాశానికెత్తారు. ప్రత్యర్థుల వాదనలను తిప్పికొట్టడం కోసం ఎలా మాట్లాడాలో తెలియాలంటే అనురాగ్ ప్రసంగాన్ని పూర్తిగా ఆలకించాలని ఆదేశించారు. ఇక్కడో కొసమెరుపు. సభా ప్రమాణాలకు విరుద్ధంగా వుందని అనురాగ్‌ఠాకూర్ ప్రసంగంలో వ్యాఖ్యలను స్పీకర్ ఓం బిర్లా తొలగించారు. కానీ మోడీ 'ఎక్స్'లో ఆయన పూర్తి ప్రసంగాన్ని పొందుపరుస్తూ దాన్ని చదవాలని సలహా ఇచ్చారు.గతంలో వచ్చిన రూలింగ్‌లు, తీర్పుల ప్రకారం ఒకసారి సభ రికార్డుల నుంచి తొలగించిన భాగాలను ప్రచురించడం ప్రసారం చేయడం తప్పు.శిక్షార్హం, అందుకే ప్రతిపక్షాలు ప్రధానిపై సభా హక్కుల నోటీసు ఇవ్వాల్సి వచ్చింది. నిజానికి గతంలోనూ స్మృతి ఇరానీ వంటివారి విషయంలో దుబారా మాటలను అడ్డుకోకపోగా మరింత రెచ్చగొట్టడం చూశాం, ఆ కోవకే చెందిన నటి, నూతన సభ్యురాలు కంగనా రనౌత్ మరో అడుగుముందుకేసి రాహుల్‌పై వ్యక్తిగత దాడికి దిగారు.ఆయన మానసిక స్థితి సరిగ్గా వుండదని, ఏం మాట్లాడతారో తనకే తెలియదని తిట్టిపోశారు. 'ఎప్పుడూ తాగినట్టు వుంటారు. మాదకద్రవ్యాలు(డ్రగ్స్) తీసుకుంటారనుకుంటా, తనకు డ్రగ్స్ పరీక్ష చేయించాలి' అంటూ ఇష్టానుసారం ట్వీట్ చేశారు.



> **మోడీ పాలనలో దేశం చక్రవ్యూహం(పద్మవ్యూహం)లో చిక్కుకుందని, మధ్యతరగతి ఆశలను నిర్మలా సీతారామన్ వమ్ముచేశారని రాహుల్ సోదాహరణంగా ప్రసంగించారు. మోడీ, అమిత్‌షా, మోహన్ భగవత్, అజిత్‌దోవల్, అంబానీ, అదానీ ఈ ఆరుగురు మాత్రమే దేశాన్ని ఏలుతున్నారని ఆయన పేర్కొన్నారు.అంబానీ, అదానీల పేరు ప్రస్తావించడంపై స్పీకర్ అభ్యంతరం పెట్టగా ఎ1, ఎ2 అంటానని రాహుల్ చమత్కారం చేశారు! బడ్జెట్ ప్రక్రియ మొదలైన రోజున హల్వా చేయడం పరిపాటి. కాగా ఈ కార్యక్రమంలో దిగువకులాల వారెవరూ లేరని కూడా ఆయన ఆరోపించారు. స్పీకర్‌తో సహా అనేక అభ్యంతరాలు చెబుతున్నా, అడ్డు తగులుతున్నా రాహుల్ వెనక్కు తగ్గకుండా ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ చక్రవ్యూహం అనే మాట,ఆయన లేవనెత్తిన ఇతర అంశాలు ప్రజలను విస్తారంగా ఆకర్షించాయి.**

కేరళపై దాడి

రాష్ట్రాలలో ప్రకృతి వైపరీత్యాల మీద కూడా ఇదే విధంగా దిగజారి మాట్లాడటంలో బీజేపీ కొత్త రికార్డు సృష్టించింది. కేరళలోని వైనాడ్‌లో భయంకర స్థాయిలో కొండచరియలు విరిగిపడి మూడు వందల మంది దాకా మరణిస్తే బీజేపీ సర్కారు నెంబర్2 హోంమంత్రి అమిత్‌షాకు అక్కడ రాజకీయమే ముఖ్యమైంది. కొద్దిమాటలు సంతాపంతో మాట్లాడి ఆ వెంటనే పినరయి విజయన్ ప్రభుత్వంపై దాడి ప్రారంభించారు.కేంద్రం ముందస్తు అనేక హెచ్చరికలు పంపినా రాష్ట్రం స్పందించలేదని నిందవేశారు. తాము ప్రకృతి ఉత్పాతాల రక్షణ దళాలను పంపించామన్నారు.వీటిని ఎంత నమ్మకంగా చెప్పారంటే విన్నవారికి కేరళ ఎంత బాధ్యతారహితంగా వ్యవహరించిందని సందేహం వస్తుంది. కానీ అవతలివైపున మాట్లాడిన ముఖ్యమంత్రి విజయన్ ఇవన్నీ అవాస్తవాలని సోదాహరణంగా తేల్చేశారు. సాదాసీదా హెచ్చరికలు తప్ప అసాధారణ నష్టం జరగబోతుందన్న స్థాయిలో ఒక్కటి కూడా రాలేదన్నారు. కొండచరియలు విరిగి ముప్పు వాటిల్లాకే తీవ్ర హెచ్చరిక సంకేతాలు వచ్చాయని వాటి వివరాలను కూడా పొందుపర్చారు.(ఆ వివరాలు మీడియాలో వచ్చాయి) దళాలను కూడా తమ అభ్యర్థనపై పంపారే గానీ కేంద్రం చొరవతో కాదని వెల్లడించారు.అయితే ఈ సమయంలో సహాయక చర్యలు ముఖ్యం తప్ప రాజకీయ వివాదాలు సాగించాలనుకోవడం లేదని విజయన్ హుందాగా ప్రకటించారు.కోవిడ్ సమయంలో కేరళ ఆదర్శంగా స్పందించదని మోడీతో సహా దేశమంతా అభినందించడం ఇక్కడ గుర్తుకు వస్తుంది. ఈ కాలంలో పరిస్థితి ఎలా మారిందో ఈ ఒక్క ఉదాహరణతో స్పష్టమవుతుంది.

హక్కుల తీర్మానాలు

పార్లమెంటు నూతన భవనం లీకేజీ ఘటనలో ఇందుకు పూర్తి భిన్నంగా కేంద్రం వ్యవహరించడం ఆసక్తికరం. న్యూవీస్టా పేరిట హడావుడిగా ఏకపక్షంగా నూతన పార్లమెంటు భవనాలు నిర్మించి మోడీనే వ్యక్తిగతంగా ప్రారంభించడం, రాష్ట్రపతిని కూడా ఆహ్వానించక పోవడం తీవ్ర విమర్శకు కారణమైంది. ఇంతలోనే ఆ భవనాలు లీకేజీ కావడం ఎవరైనా ఊహించగలరా? అదేం సమస్య కానట్టు డోమ్ గ్లాసులు అతుకుపెట్టడానికి వాడిన పదార్థంవల్ల లీకేజీ జరిగిందని సరిపెడుతున్నారు. ఏదైనా ముందుగా పసిగట్టలేదు కదా? తగు జాగ్రత్తలు తీసుకోలేదు కదా? దీన్ని సమర్థించుకోలేక సతమతమవుతుండగానే పార్లమెంటు ప్రాంగణంలోకి వర్షపునీరు భారీ ఎత్తున పారడం మొదలెట్టింది. కేరళ చాలా చిన్న రాష్ట్రం. జనసాంద్రత అత్యధికం. భిన్న ప్రకృతి నేపథ్యాలు పర్యావరణ పరిస్థితులు.పేదరికం.అలాంటి చోట అనూహ్యమైన స్థాయిలో వర్షం కుంభవృష్టితో కొండచరియలు విరిగిపడితే రాష్ట్ర ప్రభుత్వ మహాపరాధమట.

దేశ రాజధానిలో పూర్తిగా తమ కనుసన్నల్లో నిన్న,మొన్నకట్టిన పార్లమెంటు సౌధంలో నీళ్లు పారితే బాధ్యత లేదట. ద్వంద్వ ప్రమాణాలకు ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది? బాధిత రాష్ట్రాన్ని ఆదుకునే బదులు మరో రెండు బండలు వేసే మోడీత్వ వ్యూహాలను ఏమంటాం? లోక్‌సభతో పాటు రాజ్యసభలోనూ ఇదే విధమైన విడ్డూరాలు చాలా జరిగాయి. స్వయంగా చైర్మన్‌గా దాన్ని నిర్వహించే ఉప రాష్ట్రపతి జగదీష్ దన్‌కర్ ఆరెస్సెస్ దేశభక్తి కీర్తనలు ఆలపించడం, అయినదానికి కాని దానికి ప్రతిపక్షాలపై దాడి చేయడం అందులో భాగమే. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కేరళ ప్రమాదంపై సభను తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చినందుకు వామపక్ష ఎంపీలు రాజ్యసభ చైర్మన్‌కు హక్కుల నోటీసు ఇచ్చారు. ఎల్ 1 మోడీకి ఎల్2 అమిత్‌షాకు కూడా హక్కుల నోటీసు ఇవ్వవలసిన పరిస్థితి గమనిస్తే పార్లమెంటు తీరు ఒక్క దెబ్బతో తెలిసిపోతుంది. తెలుగు ఎంపీలు మాత్రం వీటిని పెద్దగా పట్టించుకోకుండా ప్రాంతీయ పార్టీలుగా తమ వివాదాల్లోనే మునిగితేలడం కొసమెరుపు. ■

చరిత్రకెక్కని సాక్ష్యాలు


వాట్సాప్‌లో వస్తున్న మేసెజెస్ చదవకుండా, అవగాహన చేసుకోకుండానే చాలామందికి షేర్ చేస్తూనే ఉంటాం. సోషల్ మీడియాలో అటువంటి విషయాలు వైరల్ అవుతాయి. కొన్నిసార్లు తప్పుడు సమాచారం షేర్ చేసినందుకు ఇబ్బందుల్లో పడతాం. ఇది సహజంగా వాట్సాప్ ఉపయోగిస్తున్న వారికి ఏదో ఒక సందర్భంలో జరుగు తూనే ఉంటుంది. ఇది వాట్సాప్ ఆస్తిపరుల ఆతృత. కొన్నిసార్లు ముఖ్యమైన మేసేజెస్ చదవం, కనీసం చూడం. దీంతో వాటి చరిత్ర తెలియదు. అటువంటి సాక్ష్యాలెన్నో చరిత్రకెక్కకుండా మిగిలిపోతాయి. ప్రస్తుత రాజకీయాల్లో రెక్కలు విప్పిన వలసపక్షులు ఎక్కడ వాలుతాయో తెలియదు. కానీ అటువంటి నాయకులనుద్దేశించి సాధారణంగా 'ఆయారామ్... గయారామ్' అంటూ సంబోదిస్తుం టారు. అవి హిందీ పదాలు. 'రామ్ పార్టీలోకి వచ్చాడు, పార్టీ నుంచి రామ్ పోయాడు' అని అర్థం. హర్యానా రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే హరిరామ్ గురించి ఈ వ్యాఖ్యలు. ఆయన ఒకే రోజు మూడు పార్టీలు తిగిరి సాయంత్రానికి మళ్లీ సొంత గూటికి చేరుకున్నారట. ఈ వార్త ఆనాడు మీడియాకు పచ్చి మేతైంది. హరిరామ్ పార్టీ మారిన అంశంపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు అక్కడి ప్రతిపక్ష నేత చెప్పిన సాక్ష్యమిది. రామ్ ఆయా...రామ్ గయా అని ఒకే మాట చెప్పి లేచి వెళ్లిపోయాడట. అది కాస్త ఆయారామ్, గయారామ్‌గా మారిపోయిందంటూ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు చెప్పారు. చాలాకాలం తర్వాత ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎదురయ్యారు. కుశల ప్రశ్నల తర్వాత ఆనాటి తెలంగాణ ఉద్యమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మరోమాట కూడా చెప్పారు. రాజకీయాల్లో హత్యలుండవ్, ఆత్మహత్యలే ఉంటాయనేది మనం తరచుగా వింటుంటాం. ఆ వ్యాఖ్యను ఏపీలోని విశాఖపట్నం జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత యూపీ.రాజు ఉపయోగించారని చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో కాలం కలిసిరాకపోతే హత్యలు ఉండవుగానీ ఆత్మహత్యలు ఉంటాయని చెప్పారాయన.

- గుడిగ రఘు


వైకల్యం ఎవరిది?

బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండే బ్యూరోకాట్లు, ప్రజా ప్రతినిధులు, సెలబ్రెటీలు పబ్లిక్ డొమైన్‌లో తమ భావాలను వ్యక్తీకరించేటప్పుడు రాజ్యాంగానికి లోబడి మానవీయ కోణాన్ని ఆవిష్కరించాలి. వ్యక్తిగతంగా ఎలాంటి అభిప్రాయాలున్నా అది ప్రజా బాహుళ్యంలోకి వేళ్లే సందర్భంలో చట్టాలను, బాధ్యతలను పరిగణనలోకి తీసుకోవాలి. అలా కాకుండా ఇష్టారీతిన మాట్లాడుతా మంటే చట్టం ఒప్పుకోదు... సమాజం అస్సలొప్పుకోదు. "స్మితా సబర్వాల్" ఏడాది క్రితం వరకు తెలంగాణ గడ్డమీద ఒక వెలుగు వెలిగిన ఐఏఎస్. ఆధునిక భావాలు గల మహిళా అధికారిణి. స్త్రీలు, వారి హక్కుల విషయంలో నిక్కచ్చిగా మాట్లాడుతారు. ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా వెంటనే స్పందిస్తారు. 'ఎక్స్'లో ఆమెను చాలా మంది ఫాలో అవుతారు. ప్రభుత్వం మారిన తర్వాత ఆమె ప్రభ తగ్గిందనుకోండి! అది వేరే విషయం. అయితే ఇటీవల ఆమె వికలాంగులపై చేసిన వ్యాఖ్యలు పెను దూమారం లేపాయి. వికలాంగుల కోటాలో సివిల్ సర్వెంట్‌గా ఉద్యోగం పొందిన ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ వ్యవహారాన్ని దృష్టిలో పెట్టుకుని చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. స్మితా సబర్వాల్‌పై చర్య తీసుకోవాలనే డిమాండ్ రాష్ట్రంలోనూ బలంగా వినిపించింది. వైకల్యం ఎవరిదంటూ? చాలామంది ఆమెను నెట్టింట్లో నిలదీశారు. ఏకంగా తెలంగాణ శాసన మండలిని కూడా ఈ ప్రకంపనలు తాకాయి. "ప్రివెన్షన్ ఆఫ్ డిసెబుల్ యాక్ట్" ప్రకారం ఆమెపై చర్యలు తీసుకోవాలని అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశాల్లో డిమాండ్ చేశారు. అత్యున్నత హోదాలో ఉన్న వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా ఉండాలి. ఎందుకంటే సమాజం వారిని అనుసరిస్తుంది. వారి అడుగుల్లో అడుగులేస్తుంది. వారు తప్పటడుగేస్తే సమాజంపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. వ్యక్తిగత జీవితంలో ఎలాంటి అభిప్రాయాలున్నా, వృత్తి జీవితంలో రాజ్యాం గానికి లోబడి, నిబద్ధతగా పని చేయాల్సిన అవసరముంది.

- ఊరగొండ మల్లేశం



దైవాంశ..!



పెద్దాయన నిద్రలేచాడు. అప్పటికి ఎనిమిది గంటలు కావస్తోంది. మూడవసారి పీఠమెక్కాక నిద్ర కరువైంది. ఒక బాబు తర్వాత మరొక బాబు మాకు అది కావాలీ! ఇది కావాలి అంటూ పోరుపెడుతున్నారు! ఒక్కోసారీ ఇద్దరూ ఒకేసారి ఆ చెవిలో ఒకరు, ఈ చెవిలో మరొకరు ఏదేదో ఊదుతున్నారు! ఒకరిగాలి మరొకరికి తగులుతున్నా సరే పట్టించుకునే స్థితిలో వారులేరు! తాను అసలేలేడు! అందుకే మానసిక ప్రశాంతత కోసం యోగా చేయాలను కున్నాడు! అటూ ఇటూ చూశాడు! ఒక్క కెమెరా కూడా లేదు! యోగా చేయాలంటే కెమెరాలు ఉండాలి కదా! చప్పట్లు కొట్టాడు! కార్యాలయ ప్రముఖ్ వచ్చాడు! ఆ ప్రముఖ్‌కి పెద్దాయన మనసులో ఏముందో తెలుసుకోగల అతీతశక్తి ఉంది! అందుకే ఆయన్ను గుజరాత్ నుండి రప్పించుకున్నాడు పెద్దాయన.

ప్రముఖ్ వచ్చి రావటంతోనే పెద్దాయన మొఖంలోకి చూసి విషయం అర్థం చేసుకున్నాడు. వెంటనే ఏర్పాట్లు చేశాడు. డజను స్టిల్ కెమెరామెన్లు, మరో డజను వీడియోగ్రాఫర్లు వచ్చారు! అప్పటికే పెద్దాయన ట్రాక్‌సూట్ లోకి మారిపోయాడు! షూటింగ్ మొదలు పెట్టారు! ఒక ఫొటోగ్రాఫర్, ప్రముఖ్ చెవిలో ఏదో చెప్పాడు! దాంతో ప్రముఖ్ షూటింగ్ ఆపించాడు. పెద్దాయనకు తీవ్రమైన ఆగ్రహం కలిగింది. అయితే ప్రముఖ్ వెళ్లి గోడ గడియారాన్ని కిందికి దించి టైము నాలుగు గంటలుగా మార్చాడు. పెద్దాయన ప్రముఖ్‌ను ప్రశంసాపూర్వకంగా చూశాడు. ప్రముఖ్ ఆనందానికి అవధులు లేవు. ఆ ప్రశంస భారతరత్నతో సమానం!

ప్రముఖ్ పెద్దాయన వేస్తున్న ఆసనాలను శ్రద్ధగా పరిశీలిస్తున్నాడు. పెద్దాయన వేయవద్దని కోరుకుంటున్న ఆసనాలు రెండున్నాయి. అవి వజ్రాసనం, శీర్షాసనం! మూడవసారి పీఠమెక్కాక ఈ రెండు ఆసనాలు రోజంతా ఏదోవిధంగా వేస్తూనే ఉన్నాడు! అందువల్ల మళ్లీ యోగాలో కూడా ప్రత్యేకంగా వేయటమెందుకని ప్రముఖ్ ఆలోచన! పెద్దాయన కూడా ఆ ఆసనాలు వేయకుండానే యోగా ముగించి, ప్రముఖ్ వంక చూశారు! అంతే గ్రాఫర్లందర్నీ పంపించి ఒక్క ఫొటోగ్రాఫర్, ఒక్క వీడియో గ్రాఫర్‌ను ఉంచారు! ఇప్పుడిక ఇంటర్వ్యూ!

ప్రఖ్యాత స్టంట్ కం కామెడీ హీరో క్షయకుమార్ వచ్చాడు. ఆయనకీ ఈ మధ్య సినిమాలేం లేవు! ప్రముఖ్, ఒక చీటీని క్షయకుమార్ చేతిలో పెట్టినాడు! పెద్దాయన్ను ఇంటర్వ్యూ చేయటానికి క్షయకుమార్ సిద్ధమయ్యాడు.ఎప్పుడొచ్చాడో తెలియదు కాని పెద్దాయన కలర్‌ఫుల్ సూట్ వేసుకుని వచ్చి కెమెరాముందు కూర్చున్నాడు. ఇంటర్వ్యూ ప్రారంభమైంది!

"మూడవసారి పీఠమెక్కిన సందర్భంలో మీకు శుభాకాంక్షలు!" అంటూ క్షయకుమార్ పెద్ద గులాబీల గుత్తిని పెద్దాయన కందించాడు! పెద్దాయన దాన్ని అందుకుంటూ "ధన్యవాదాలు" అన్నారు!

"ఢిల్లీలో వరదలు వచ్చి అల్లకల్లోలంగా ఉంది! సర్!" అన్నాడు క్షయకుమార్ "అవును! స్కూళ్లు కూడా బందు" చేశారు! పిల్లల చదువులు పాడవుతాయని తెలిసి స్కూళ్లు బంద్ చేయటం ఎంత బాధాకరం! అక్కడి రాష్ట్ర ప్రభుత్వం పిల్లల భవిష్యత్‌ను బురదపాలే కాక వరదపాలు చేస్తున్నది! ఇది ఎంతో బాధాకరం!" అని అంటుంటే పెద్దాయన గొంతు పూడుకు పోయింది! క్లోజప్ షాట్‌లో ఖరీదైన కండ్లద్దాల వెనక వేలుపెట్టి కంటి నుండి ఉబికి వస్తున్న నీటి చుక్కను పెద్దాయన సుతారంగా తుడుచుకున్నాడు!

ప్రఖ్యాత నటుడైన క్షయకుమార్ పెద్దాయన్ను చూసి షాక్ తిన్నాడు! ఆ తర్వాత తాను కూడా వలవలా ఏడ్చాడు! తర్వాత తేరుకున్నాడు. ఇంటర్వ్యూ కొనసాగించటానికి తలెత్తి చూశాడు! పెద్దాయన అప్పటికే డ్రెస్ మార్చుకుని లాన్‌లో కెమెరా ముందు నిలబడి ఉన్నాడు! పాపం క్షయకుమార్ పరుగెత్తాడు.

"ఉత్తరప్రదేశ్‌లోని ఒక పాఠశాల విద్యార్థుల ఆనందహేల గురించి పంచుకోవాలనుకుంటున్నాను సర్! క్లాస్ రూములో పిల్లలు ఈత కొడుతూ ఎంత ఉల్లాసంగా, ఎంత ఉత్సాహంగా ఉన్నారో!" అంటూ క్షయకుమార్ ఒక వీడియో పెద్దాయనకు చూపించాడు!

ఆ వీడియో చూసి పెద్దాయన చిన్న పిల్లాడిలా ఆనందపడ్డాడు! ఆ క్షణం పెద్దాయన కూడా ఈత కొట్టేలా కనిపించాడు! అంతగా ఉల్లాసపడ్డాడు!

"ఉత్తరప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కదా! అందుకే పిల్లలకు కూడా రెండు ప్రయోజనాలు అందిస్తున్నాం! వర్షం లేనపుడు అది తరగతి గది! వర్షం పడితే అది స్విమ్మింగ్ పూల్! పైసా ఖర్చు లేకుండా స్విమ్మింగ్ నేర్చుకుంటున్నారు! దీనివల్ల భవిష్యత్‌లో కూడా రెండు ప్రయోజనాలు కలుగుతాయి! వరదలు వచ్చినపుడు బ్రిడ్జిలు కూలిపోయినా ఈదుకుంటూ నదులు దాటేయవచ్చు! రెండవదేమిటంటే ఇందులో ఈత నేర్చుకున్న చిన్నారులు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించవచ్చు అందుకోసం భగవద్గీతను కూడా గురువులతో చెప్పిస్తాం! ఇలా ప్రతి దాంట్లో రెండు ప్రయోజనాలు ఉంటాయి. అందుకే దేశమంతా డబుల్ ఇంజన్ సర్కారు రావాలి!" అన్నారు పెద్దాయన.

పెద్దాయన దూరదృష్టికి క్షయకుమార్ కండ్లు బైర్లు కమ్మాయి! తేరుకుని చూసేసరికి పెద్దాయన సూటు మార్చుకుని కెమెరా ముందు రెడీగా ఉన్నాడు.

"ఒలింపిక్స్‌లో మనుబాకర్ కాంస్య పతకం సాధించినందుకు మీరు ఫోన్‌చేసి అభినందించినందుకు దేశంలోని 140 కోట్ల మంది భారతీయుల హృదయాలు ఆనందంతో ఉప్పొంగిపోతున్నాయి! బేటీలపై మీ ప్రేమ చాలా గొప్పది సర్!" అన్నాడు క్షయకుమార్ చేతులు జోడించి తన్మయత్వంతో.

"మా సర్కార్ ఆటలని, ముఖ్యంగా మహిళా క్రీడాకారులకు ఎంతో సపోర్టు చేస్తుంది! ఆ సపోర్టే తనకి కాంస్య పతకం తెప్పించిందని మను నాతో ఫోన్లో చెప్పింది! ఆమెకి నా అభినందనలు!" అన్నాడు పెద్దాయన.

"భగవద్గీత కూడా తనకు స్ఫూర్తినిచ్చిందని అందుకే కాంస్య పతకం గెలిచానని చెప్పినట్లు మీడియాలో వచ్చింది! మను భగవద్గీత చదవటానికి మీరే స్ఫూర్తి అనుకుంటున్నాను! మరో విషయం కూడా నాకర్థమైంది సర్! బంగారం, వెండి పతకాలు సాధించిన వాళ్లు కూడా భగవద్గీతను ఇంగ్లీషులో చదివి ఉంటారు! బయటకు చెప్తే తమ విజయ రహస్యం అందరికీ తెలిసిపోతుందని చెప్పలేదనుకుంటాను సర్!" అన్నాడు క్షయకుమార్.

క్షయకుమార్‌వంక అభినందనపూర్వకంగా చూశాడు పెద్దాయన. ఆస్కార్ వచ్చినంత ఆనందపడ్డాడు క్షయకుమార్.

క్షయకుమార్ తన ప్రశ్నను సంధించబోయాడు. ప్రముఖ్ ఒక చీటీని క్షయకుమార్‌కి అందించాడు.

"సర్! మీరు కొత్తగా కట్టించిన పార్లమెంటులో ఆకాశం నుండి నీటి ప్రవాహం కిందికి జాలువారుతోందని! దీన్ని ప్రతిపక్షాలు లీకేజీ అంటున్నారని ఇప్పుడే అందిన వార్త! దీన్ని ఎలా చూస్తారు సర్!" అన్నాడు క్షయకుమార్.

ప్రశ్న పూర్తికాకుండానే పెద్దాయన ముఖంలో రంగులు మారాయి. మొఖం కాంతివంతమయ్యింది! పెద్దాయన సంభ్రమాశ్చర్యాలతో ముందుకు కదిలాడు! ఆకాశంలోకి చూస్తూ చేతులు జోడించాడు! అలాగే ముందుకు సాగాడు! వెంటనే విదేశీ రేంజ్ రోవర్ కారు వచ్చింది! పెద్దాయన్ను ఎక్కించుకుని పార్లమెంటులోకి ప్రవేశించింది! క్షయకుమార్, ప్రముఖ్ ఫాలో అయ్యారు.

పెద్దాయన జోడించిన చేతులతోనే పార్లమెంటులోకి నడిచాడు! నేరుగా ఆకాశంలో నుండి పడుతున్న నీటిధార వైపు సాగారు! ఆ నీటిధార కింద ఎవరో పామరుడు ఒక బకెట్ పెట్టి ఉంచాడు! వెనక నుండి వచ్చిన ప్రముఖ్ బకెట్ తీసి ఆవతలకి విసిరేశాడు! పెద్దాయన ఆ నీటిధార ముందు మోకరిల్లాడు! ఆ నీటిని కండ్లకద్దుకుని తలపై చల్లుకున్నాడు! ఆ తర్వాత నీటిధారకి సాష్టాంగ నమస్కారం చేశారు! ఈలోగా కొత్త పార్లమెంటులో ప్రతిష్ఠించిన రాజదండం "సెంగోల్"ను ప్రముఖ్ తీసుకొచ్చాడు. పైనుండి పడుతున్న నీటిధారలో నుండి కొన్ని బిందువులు తీసుకుని సెంగోల్ పై చిలకరించి, ఆ తర్వాత పెద్దాయన సెంగోల్‌ను కూడా కండ్లకద్దుకున్నారు!

ఆ ప్రాంతానికి ఎప్పుడో చేరుకున్న మీడియా ఈ అపురూప దృశ్యాన్ని లైవ్‌లో ప్రపంచానికి చూపుతోంది!

పెద్దాయన మాట్లాడటం మొదలుపెట్టారు! "నేను వారణాసిలో గెలిచాను! కానీ విశ్వనాథుడు నన్ను ఆశీర్వదించి, నాకు, ఈ పదవిని చేపట్టమని బాధ్యత పురమాయించాడు! అప్పుడే నాకు అన్పించింది! నేను అందరి లాంటి మనిషిని కానని! అందరిలా పుట్టలేదని! ఈ మాట ఇంతకు ముందు కూడా చెప్పాను! కాని కొందరు నాస్తికులు దైవద్రోహులు నమ్మలేదు! అందుకే, నేను కట్టించిన ఈ పార్లమెంటులోకి ఆకాశం నుండి నేరుగా గంగామాత ప్రవహించి నేను మానవాతీ తుడనని, దైవాంశసంభూతుడనని మరోసారి నిరూపించింది!" అంటూ పారవశ్యంతో కండ్లు మూసుకున్నారు.

- ఉషాకిరణ్

విద్యారంగం పట్ల నిర్లక్ష్యం

బడ్జెట్‌లో తగిన కేటాయింపుల్లేని వైనం

- ఇది ఎన్‌ఈపీ లక్ష్యాలకు అడ్డంకి
- కేంద్రం తీరుపై విద్యావేత్తలు, మేధావులు, నిపుణుల ఆందోళన



దేశంలో కీలకమైన రంగాల్లో విద్య ఒకటి. ఒక దేశం భవిష్యత్తును నిర్ణయించే అంశాల్లో ఇది చాలా కీలకం. అలాంటి రంగం పట్ల మోడీ సర్కారు నిర్లక్ష్యపూరిత వైఖరిని అవలంబిస్తున్నది. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో జరిపిన పేలవ కేటాయింపులే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని విద్యావేత్తలు, మేధావులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

న్యూఢిల్లీ : వాస్తవానికి విద్య అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధుల్లో ఉండే ఒక ఉమ్మడి అంశం. ఎన్‌ఈపీ-2020 ప్రకారం జీడీపీలో ఆరు శాతం విద్యకు కేటాయించాలి. అయితే ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ జీడీపీలో మూడు శాతం కంటే తక్కువ మాత్రమే ఖర్చు చేస్తున్నాయి. ఇలాంటి పేలవ కేటాయింపులతో విద్యా రంగం తీవ్రంగా నష్టపోతున్నదని మేధావులు వాపోతున్నారు. ముఖ్యంగా, ఇది పేద, మధ్యతరగతి పిల్లల భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని అంటున్నారు. పేదల పిల్లలకు విద్యను అందించటానికి భారత్ ఎందుకు తన వంతు కృషి చేయటంలేదని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్ ముఖ్యంగా నాలుగు కీలక సమూహాలైన యువత, మహిళలు, రైతులు, పేదలను హైలెట్ చేస్తుంది. అలాగే, విద్యా బడ్జెట్ విశ్లేషణను చేర్చటం చాలా కీలకమని నిపుణులు చెప్తున్నారు. 2024-25కి విద్య కోసం అంచనా బడ్జెట్ రూ.1,25,638 కోట్లు. 2024-25లో భారతదేశ నామమాత్రపు స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) రూ.326.4 లక్షల కోట్లకు చేరుతున్నదని ఆర్థిక మంత్రి అంచనా వేశారు. అయితే, జీడీపీలో కేవలం 0.38 శాతం మాత్రమే కేంద్రం విద్యకు కేటాయిస్తుందని బడ్జెట్ సూచిస్తున్నది.

భారత రాజ్యాంగం ప్రకారం విద్య కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితా కిందకు వస్తుంది. విద్యా విధానాలను రూపొందించటం, అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బాధ్యత వహించటం ఉంటుంది. ప్రభుత్వ విద్య వ్యయం దీర్ఘకాలిక జాతీయ ఆర్థిక వృద్ధి, సామాజిక స్థిరత్వానికి కీలకమైనదని విద్యావేత్తలు, నిపుణులు చెప్తున్నారు. 1990 హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్ట్ (హెచ్‌డీఆర్) విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వటానికి వనరులను తిరిగి కేటాయించటాన్ని తెలుపుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు మానవ అభివృద్ధి, సామాజిక శ్రేయస్సును పెంపొందించటానికి ఈ ముఖ్యమైన రంగాల కోసం తమ బడ్జెట్‌లను విస్తరించాలని నొక్కి చెప్పింది.

ఎన్‌ఈపీ-2020 డాక్యుమెంట్ కూడా జీడీపీలో 6 శాతం విద్యకు కేటాయించే ప్రాముఖ్యతను నొక్కి చెప్తున్నది. కొఠారీ కమిషన్ కూడా సిఫారసు చేసింది. అయితే, ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై జీడీపీలో 3 శాతం కంటే తక్కువ ఖర్చు చేస్తున్నాయి. ఇప్పటివరకు గమనించిన విద్యా వ్యయంలో చెప్పుకోదగ్గ పెరుగుదల లేదని మేధావులు, నిపుణులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

ఈ బడ్జెట్‌లో, ఉన్నత విద్యా శాఖకు రూ.47,619.77 కోట్ల కేటాయింపులు అందాయి. ఇది మునుపటి సంవత్సరం బడ్జెట్ అంచనాతో పోలిస్తే రూ.3,525.15 కోట్లు అంటే 7.99 శాతం పెరుగుదల అన్నమాట. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) అంచనా వేసిన 4.5 శాతం ద్రవ్యోల్బణం రేటుతో.. వాస్తవ వృద్ధి రేటు 3.49 శాతం మాత్రమే. ఈ కేటాయింపు 2023-24కి రూ.57,244.48 కోట్ల సవరించిన అంచనా కంటే 16.81 శాతం తక్కువ. మూలధన వ్యయం రూ.12.52 కోట్ల నుండి రూ.11.06 కోట్లకు క్షీణించింది.

అదేవిధంగా, పాఠశాల విద్య కోసం బడ్జెట్ గణనీయమైన పెరుగుదలను చూపలేదు. 2024-25 కోసం రూ.73,008.10 కోట్ల కేటాయింపులు జరిగాయి. 2023-24 బడ్జెట్ అంచనా నుంచి 6.11 శాతం పెరుగుదల (లేదా వాస్తవ పరంగా 1.61 శాతం) ఉన్నది. 2023-24 సవరించిన అంచనాతో పోలిస్తే కేవలం 0.8 శాతం వృద్ధిని సూచిస్తున్నది. విద్యా మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపు 2024-25లో రూ.1.20 లక్షల కోట్లు. ఇది 2023-24 సవరించిన అంచనాతో పోలిస్తే 7.6 శాతం తగ్గింపును ప్రతిబింబిస్తున్నదని నిపుణులు చెప్తున్నారు.

సమగ్రశిక్ష (ఎస్ఎస్) కిందకు వచ్చే.. సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ), ఉపాధ్యాయ విద్య (టీఈ)లకు 2023-24 బడ్జెట్ అంచనాతో పోలిస్తే దీని కోసం కేటాయింపు కేవలం రూ.146.53 కోట్లు పెరిగింది. అంతేకాకుండా, 2023-24లో ఎస్ఎస్ సవరించిన అంచనా దాదాపు రూ.4,450 కోట్లు క్షీణించటం గమనార్హం. దేశ యువతకు సన్నద్ధత, నైపుణ్యాభివృద్ధి, విమర్శనాత్మక ఆలోచన వంటి లక్ష్యాలను సాకారం చేయటానికి, విద్యా రంగానికి గణనీయమైన పెట్టుబడికి కట్టుబడి ఉండాలని విద్యావేత్తలు అంటున్నారు. తగినంత ఆర్థిక వనరులు లేకుండా.. ఈ క్లిష్టమైన లక్ష్యాలు నెరవేరవనీ, నైపుణ్యం, సమానత్వం, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించే ప్రయత్నాలను బలహీనపరుస్తాయని వారు చెప్తున్నారు.



ఆర్థిక సర్వే 2023-24 ప్రకారం.. జీడీపీలో సామాజిక వ్యయం వాటా 2017-18లో 6.7 శాతం నుంచి 2023-24(బడ్జెట్ అంచనా)లో 7.8 శాతానికి పెరిగింది. అయినప్పటికీ, విద్య వ్యయం(ఈఈ) నుంచి జీడీపీ నిష్పత్తిలో మార్పు లేకుండా 2.8 శాతం నుంచి 2.7 శాతానికి తగ్గింది. మొత్తం వ్యయంలో ఈ వాటా 2017-18లో 10.7 శాతం నుంచి 2023-24లో 9.2 శాతానికి పడిపోయింది. అదేవిధంగా, సామాజిక వ్యయంలో దాని వాటా 42.4 శాతం నుంచి 35.3 శాతానికి తగ్గింది.

పారిస్ పర్యటన కోసం... పంజాబ్ సీఎంకు

రాజకీయ అనుమతి నిరాకరణ



కేంద్రంపై మండిపడిన ఆప్

చండీఘర్ : ఒలింపిక్ క్రీడల్లో భారత హాకీ జట్టుకు మద్దతు ఇచ్చేందుకు పారిస్ వెళ్లాలనుకున్న పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. పారిస్ పర్యటనకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయనకు రాజకీయ అనుమతి నిరాకరిం చింది. అధికార వర్గాలు శనివారం ఈ విషయాన్ని తెలియ జేశాయి. ఇదిలావుండగా ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకూ అమెరికాలో జరిగే స్పీకర్ల సదస్సులో పాల్గొనేందుకు తనకు కూడా కేంద్రం రాజకీయ అనుమతి నిరాకరించిందని పంజాబ్ శాసనసభ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్ తెలిపారు.

ముఖ్యమంత్రి మాన్‌కు దౌత్యపరమైన పాస్‌పోర్ట్ ఉంది. ఆయన ఈ నెల 3 నుండి 9వ తేదీ వరకూ పారిస్‌లో పర్యటించాలని భావించారు. ఆదివారం నాడు భారత హాకీ జట్టు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. దానికి హాజరయ్యేందుకు మాన్ రాజకీయ అనుమతి కోరారు. అయితే కేంద్రం అందుకు నిరాకరించింది. మాన్‌కు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్నదని, ఇంత తక్కువ వ్యవధిలో ఆయనకు ఆ తరహా రక్షణ కల్పించడం సాధ్యం కాదని కేంద్రం చెబుతోందని పంజాబ్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్రం తన నిర్ణయాన్ని శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియజేసింది. సీనియర్ నేతలు విదేశాలకు వెళ్లాలంటే విదేశాంగ శాఖ రాజకీయ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

కాగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, కేరళ శాసనసభల స్పీకర్లకు కూడా అమెరికా వెళ్లేందుకు కేంద్రం రాజకీయ అనుమతి ఇవ్వలేదని స్పీకర్ సంధ్వాన్ తెలిపారు. అయితే మేఘాలయ స్పీకర్‌కు అనుమతి ఇచ్చారని చెప్పారు. ఇదిలావుండగా ముఖ్యమంత్రి మాన్ భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌కు ఫోన్ చేశారు. ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం సాధించినందుకు అభినందనలు తెలియజేశారు. హాకీ జట్టును ప్రోత్సహించేందుకు పారిస్ వద్దామని అనుకున్నానని, అయితే తనకు రాజకీయ అనుమతి లభించలేదని చెప్పారు. మాన్‌కు అనుమతి నిరాకరణపై ఆమ్‌ఆద్మీ పార్టీ మండిపడింది. దీనిద్వారా మూడు కోట్ల మంది పంజాబ్ ప్రజలను కేంద్రం అవమానించడమే కాకుండా వారి మనోభావాలను గాయపరచిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో సింగపూర్‌లో విద్యా వ్యవస్థను అధ్యయనం చేసేందుకు వెళ్లాలనుకున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా కేంద్రం అనుమతి ఇవ్వలేదని గుర్తు చేసింది.

ఏమీ చేయొద్దని ఏనుగును వేడుకున్నా

- గుట్టపైన రాత్రంగా అది మా పక్కనే ఉంది
- మా బాధను అర్థం చేసుకుంది
- వాయనాడ్ బాధితురాలి అనుభవం



వాయనాడ్ : కేరళలోని వాయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో బతికి బయటపడిన వారి అనుభవాలు గగుర్పొడిచేలా ఉన్నాయి. సుజాత అనినాంచిరా, ఆమె కుటుంబ సభ్యులు కూడా ఈ విపత్తు నుంచి ప్రాణాలు దక్కించుకున్నారు. చూరాల్‌మలాలో కొండచరియలు విరిగిపడి వారి ఇల్లు ధ్వంసమైంది. సుజాత, ఆమె కుమార్తె సుజిత, భర్త కుట్టన్, మనుమడు సూరజ్ (18), మనుమరాలు మృదుల (12) శిథిలాల కింద చిక్కుకుపోయారు. సుజాత 18 ఏండ్లుగా ముండక్కిలోని ఓ టీ ఎస్టేట్‌లో పనిచేస్తున్నారు.

సోమవారం సాయంత్రం నుంచే భారీ వర్షం కురుస్తోంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట ప్రాంతంలో మెలకువ వచ్చింది. ఆ తర్వాత కొద్ది సేపటికే పెద్ద శబ్దం వినిపించింది. ఇంటి పైకప్పు మా మీద కూలిపోయింది. నా కుమార్తె తీవ్రంగా గాయపడింది. ఎలాగో కొన్ని శిథిలాలను తొలగించి బయటికి వచ్చాను' అంటూ సుజాత ఆ భయానక ఘటనను వివరించారు. శిథిలాల కింద నుంచి మనుమరాలు ఏడవడం ఆమెకు విన్పించింది. ఎంతో కష్టం మీద ఆ అమ్మాయిని బయటికి తీశారు. మిగిలిన కుటుంబ సభ్యులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ సమీపంలోని ఓ గుట్టపైకి చేరారు. సుజాత, ఆమె మనుమరాలు కూడా అక్కడికి చేరుకున్నారు. అయితే ఆ తర్వాత కన్పించిన దృశ్యం వారిలో భయాన్ని నింపింది.

సుజాత, ఆమె మనుమరాలు ఓ చెట్టు పక్కన చేరారు. 'బాగా చీకటి పడింది. ఓ అర మీటరు దూరంలో ఏనుగు కన్పించింది. అది కూడా భయపడుతున్నట్లు ఉంది. అప్పుడే నేను ఏనుగును మనసులో ఓ కోరిక కోరాను. మేము ఇప్పుడే ఓ విపత్తు నుంచి బయటపడ్డామని, ఎవరైనా తమను కాపాడే వరకూ ఆ రాత్రంతా అక్కడే గడపాల్సి ఉంటుందని, ఏమీ చేయవద్దని' కోరాను. ఆ ఏనుగు మా అభ్యర్ధనను ఆలకించినట్లు ఉంది. మా జోలికి రాకుండా అలాగే ఉండిపోయింది. మేము ఏనుగు కాళ్లకు బాగా సమీపంలో ఉన్నాము. అయితే అది మా భయాన్ని అర్థం చేసుకున్నట్లు మమ్మల్ని ఏమీ చేయలేదు. ఉదయం ఆరు గంటల వరకూ అక్కడే ఉండిపోయాము. అప్పుడు కొందరు అక్కడికి చేరుకొని మమ్మల్ని కాపాడారు' అని సుజాత వివరించారు.

సుజాత అనుభవాన్ని కాంగ్రెస్ నేత శశి థరూర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో షేర్ చేశారు. గూడును కోల్పోయిన బాధితులు తమ బాధను ఏనుగుకు చెప్పుకున్నారని, ఆ రాత్రంతా అది వారికి ఆశ్రయం కల్పించి రక్షణగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.

జాతీయతను ఒదులుకుంటున్నారు

- 2023లో భారతీయ పాస్‌పోర్టులు సరెండర్ చేసినవారు రెండు లక్షల మందికి పైనే
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమాచారం

న్యూఢిల్లీ : భారత జాతీయతను వదులకుంటున్న దేశ పౌరుల సంఖ్య పెరుగుతున్నది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డేటా ప్రకారం.. 2023లో రెండు లక్షల మందికి పైగా భారతీయ పౌరులు తమ జాతీయతను వదలుకున్నారు. వారి పాస్‌పోర్టులు సరెండర్ చేశారు. దేశం విడిచి వెళ్లటానికి ఇష్టపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఐదేండ్లలో పౌరసత్వాన్ని వదులుకున్న భారతీయుల సంఖ్య 2023లో 2,16,219 కాగా, 2022లో 2,25,620, 2021లో 1,63,370 మందిగా ఉన్నది. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభలో తెలిపారు. ఆప్ సభ్యుడు రాఘవ్ చద్దా రాజ్యసభలో లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందిం చింది. మంత్రి స్పందిస్తూ.. "పౌరసత్వాన్ని వదులుకోవటానికి లేదా తీసుకోవటానికి గల కారణాలు వ్యక్తిగతమైనవి" అని చెప్పారు. విజయవంతమైన, సంపన్న మైన, ప్రభావవంతమైన డయాస్పోరా (విదేశీల్లో ఉండే భారతీయులు) భారతదేశానికి ఒక ఆస్తి అని వివరించారు.



బెయిల్ ఇక మరింత కష్టం

యూపీ మతమార్పిడి నిరోధక చట్టం సవరణ



లక్నో : యూపీ శాసనసభ ఉత్తరప్రదేశ్ చట్టవిరుద్ధమైన మత మార్పిడి (సవరణ) బిల్లు, 2024ను రెండ్రోజుల క్రితం ఆమోదించింది. ఇది 2021 మత మార్పిడి నిరోధక చట్టానికి మూడు మార్పులు చేసింది. ఈ చట్టం ప్రకారం ఇప్పుడు ఎవరైనా ఫిర్యాదు చేయటానికి అవకాశమున్నది. ఇందులో నేరాలకు శిక్షలు మరింత కఠినతరం చేయబడ్డాయి. నిందితులు బెయిల్ పొందటానికి మరింత కష్టంగా మారనున్నది. మాదక ద్రవ్యాలు, మనీలాండరింగ్‌ను అరికట్టడానికి సంబంధించిన చట్టాలలో బెయిల్ లభించటం ఎంత కష్టమో.. ఇప్పుడు తెచ్చిన మత మార్పిడి చట్టంలోనూ నిందితులకు అంత సులువుగా బెయిల్ లభించే పరిస్థితి ఉండదు.

'ముస్లిం, క్రిస్టియన్లే టార్గెట్‌గా చట్టం'

2021లో శాసనసభ ఆమోదించిన యూపీలోని మత మార్పిడి నిరోధక చట్టం వివాహం, మోసం, బలవంతం లేదా ప్రలోభాల ద్వారా మత మార్పిడిని నిషేధించింది. తమ మతం మార్చుకోవాలనుకునే ఏ వ్యక్తి అయినా కనీసం ఒక నెల ముందుగానే ప్రభుత్వానికి తెలియజేయటం తప్పనిసరి చేస్తుంది. బీజేపీ, దాని అనుబంధ హిందూత్వ సంస్థలు వినిపించే "లవ్ జిహాద్" కేసులలో ఆయుధంగా వాడుకోవటానికి యోగి సర్కారు ఇలాంటి చట్టాలను తీసుకొచ్చిందని కొందరు మేధావులు ఆ సమయంలో ఆరోపించారు. ముఖ్యంగా, రాష్ట్రంలో ముస్లింలు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకోవటానికి ఈ చట్టం ఉపయోగించబడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ డేటా ప్రకారం.. జనవరి 1, 2021 నుంచి ఏప్రిల్ 30, 2023 మధ్య ఈ చట్టం కింద 427 కేసులు నమోదయ్యాయి. వీటిలో 833 అరెస్టులు జరిగాయి.

ఈ నేపథ్యంలో చట్టం రాజ్యాంగ చెల్లుబాటుపై సుప్రీంకోర్టులో సవాలు చేయబడింది. ఈ ఏడాది మేలో ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, యూపీలోని యోగి ప్రభుత్వం మతాంతర జంటలు, మతపరమైన మైనారిటీలకు చెందిన పురుషులపై చట్టాన్ని దుర్వినియోగం చేయటాన్ని ఆపలేదు. దీనిని మరింత తీవ్రతరం చేసే సవరణలతో ముందుకు సాగింది.

పెరిగిన శిక్ష.. జరిమానా


దీంతో తాజా సవరణల ద్వారా చట్టం కింద నిర్దేశించిన అన్ని శిక్షలు గణనీయంగా పెరిగాయి.చట్టం ప్రకారం ఏదైనా చట్టవిరుద్ధమైన మార్పిడికి శిక్ష 1-5 ఏండ్ల నుంచి 3-10 ఏండ్లకు శిక్షను పెంచారు. కనీస జరిమానాను కూడా పదిహేను వేల రూపాయల నుంచి యాభై వేల రూపాయలకు పెంచారు. ఇది మైనర్, స్త్రీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన వ్యక్తి విషయంలో చట్టవిరుద్ధమైన మతమార్పిడికి దిగితే.. రెండు నుంచి పదేండ్ల మధ్య జైలు శిక్ష నుంచి 5-14 ఏండ్ల వరకు పెంచారు. కనీస జరిమానా రూ.25,000 నుంచి రూ.లక్షకు పెంచారు. సామూహిక మతమార్పిడులకు శిక్ష 3-10 ఏండ్ల నుంచి 7-14 ఏండ్ల మధ్య జైలు శిక్షకు పెంచబడింది. కనీస జరిమానా రూ.50,000 నుంచి రూ.లక్షకు పెంచారు.

బెయిల్ కఠినతరం

తాజా చట్టం కింద బెయిల్ పొందడం దాదాపు అసంభవం. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను వ్యతిరేకించటానికి అనుమతించనంత వరకు చట్టం కింద నేరానికి పాల్పడిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేయబడదని సవరించిన బెయిల్ నిబంధన పేర్కొన్నది. ఇంకా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను వ్యతిరేకిస్తే, సెషన్స్ కోర్టు నిందితుడు అటువంటి నేరానికి పాల్పడలేదని విశ్వసించటానికి సహేతుకమైన కారణాలుంటే, నిందితుడు విడుదలైతే ఎటువంటి నేరం చేసే అవకాశం లేదని మాత్రమే బెయిల్ మంజూరు చేయవచ్చు. ఇది నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్, 1985, ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్, 2002లోని బెయిల్ నిబంధనలకు సరిగ్గా సమానంగా ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.

కేంద్రంపై మధ్యతరగతి ఆగ్రహం

- వాస్తవాలు చూపని జాతీయ మీడియా
- ప్రభుత్వ వైఫల్యాలను పక్కనబెట్టి టీఆర్పీల కోసం పాకులాట
- మోడీకి అనుకూలంగా వార్తలు, చర్చలు
- బాధ్యత విస్మరిస్తున్న 'నాలుగో స్తంభం'



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ పదేండ్ల పాలనను భారత్‌లోని ప్రజలు చూశారు. 2014 నుంచి 2024 వరకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అనేక చట్టాలు, విధానాలు, కార్యక్రమాలు తీసుకొచ్చింది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో విజయంతో మెజారిటీ తగ్గినా.. మోడీ సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చింది. జాతీయస్థాయి ప్రవేశ పరీక్షల్లో అవకతవకల నుంచి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ వరకు.. ప్రతీదీ దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. మోడీ సర్కారు తీరుపై ప్రశ్నల వర్షం గుప్పించింది. పరీక్షల విషయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యావేత్తలు కేంద్రం వైఫల్యాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇక గతనెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై దేశంలో మధ్య తరగతి ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కేంద్రంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అయితే, జాతీయ మీడియా మాత్రం ఈ జనాగ్రహాన్ని దాచిపెడుతున్నది. మోడీ సర్కారు వైఫల్యాలను కప్పిపుచ్చుతున్నది. కేంద్ర సర్కారుకు అనుకూలంగా వార్తలు, కథనాలు, చర్చలను చేపడుతున్నది. కేవలం టీఆర్పీ రేటింగ్స్ ధ్యేయంగా జాతీయ మీడియా పని చేస్తున్నదని మేధావులు, విశ్లేషకులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పేరున్న మీడియా తన బాధ్యతను విస్మరిస్తున్నదనీ, భారత్ వంటి దేశానికి ఇలాంటి తీరు ఏ మాత్రమూ యోగ్యం కాదని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. "మధ్యతరగతి అసంతృప్తి సంకేతాలు గత రెండేండ్లుగా మునిగిపోయాయి. అది ఒక్కోసారి లావాలా విరుచుకుపడుతుంది. అధికారాన్ని ప్రశ్నించే వారెవరైనా దేశ వ్యతిరేకులని మోడీ అనుకూల మీడియా ప్రచారం చేస్తున్నది. ఇది చాలా ప్రమాదకరం" అని మేధావులు అంటున్నారు.

పన్ను చెల్లింపుదారుల నుంచి తీసుకున్న సొమ్మును కూలిపోతున్న వంతెనలు, శిథిలావస్థలో ఉన్న విమానాశ్రయాల కోసం వినియోగిస్తున్నారని విమర్శకులు అంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలం సమయంలో నీళ్లతో నిండిన, గుంతలమయమైన రోడ్ల గుండా తిరుగుతున్నప్పుడు మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, వీరి గొంతును మాత్రం సదరు మీడియా వినిపించటంలేదని చెప్తున్నారు. ప్రజలు పన్నులు చెల్లిస్తారు, కానీ ప్రతిఫలంగా ఏమీ పొందలేరని అంటున్నారు. వారు ఏదైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు వెళ్లి, తమ గొంతును వినిపించాల్సి వస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

2009లో మళ్లీ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే యూపీఏ-2 అన్నా హజారే ఆందోళన రూపంలో పెద్ద ఎదురుదెబ్బను చూసింది. ఆ సమయంలో, 2008-09 గ్లోబల్ ఫైనాన్షియల్ క్రైసిస్ అనంతర పరిణామాలను ఎదుర్కోవటానికి ప్రపంచం ఇంకా ప్రయత్నిస్తున్నది. కానీ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేయటం ద్వారా ఆర్థిక సంక్షోభాన్ని పూడ్చింది. పే కమీషన్ ద్వారా నడిచే బకాయిల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు పెద్ద బొనాంజా ఇచ్చింది. ఇది కొన్ని సంవత్సరాల పాటు డిమాండ్‌ను కొనసాగించటంలో సహాయపడింది. కానీ, మోడీ పానలో ఇలాంటి విధానం కరువైందని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు.

మోడీ పాలనలో మధ్యతరగతి ఆదాయాలు పడిపోయాయని గణాంకాలు చెప్తున్నాయి. పారిస్ ఆధారిత ప్రపంచ అసమానత ల్యాబ్స్ చేసిన ఆదాయ అంచనాల ప్రకారం.. అగ్రశ్రేణి 0.5 శాతం కుటుంబాలు మినహా, ధనవంతులైన 10 శాతం మంది వ్యక్తులు గత కొన్ని సంవత్సరాల్లో వాస్తవ ఆదాయ వృద్ధిని చాలా తక్కువగా కలిగి ఉన్నారు. ప్రస్తుతం దేశంలో కోచింగ్ సెంటర్‌లో విద్యార్థుల మరణాలు, పదేపదే రైలు ప్రమాదాలు జరిగినా.. అంతగా చర్చకు రావటం లేదనీ, ఇందుకు మోడీ మీడియా మేనేజ్‌మెంట్ కూడా కారణమని విమర్శకులు అంటున్నారు. మోడీ మిత్రుల చేతుల్లోనే ప్రధాన ఛానెళ్లు ఉండటం ఇందుకు కారణమని చెప్తున్నారు. అయితే, సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెళ్లు కొన్ని ఈ స్థానాన్ని భర్తీ చేస్తూ ప్రజలు పడుతున్న బాధలను వెలుగులోకి తెస్తున్నాయని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. మీడియా అనేది పాలక పక్షానికి ప్రతిపక్షంలా ఉండాలనీ, సమస్యలపై నిలదీయాలనీ, కానీ ప్రస్తుతం మోడీ పాలనలో దేశంలో అలాంటి పరిస్థితులు మాత్రం కనబడటం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల స్కామ్‌లపై కొన్ని నివేదికలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. కేంద్ర బడ్జెట్‌లోని విస్తృత అంశాలు కూడా కేంద్రంపై ప్రత్యక్ష దాడిగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కారణంగా మధ్య తరగతి ప్రజల నడ్డి విరిగిపోయే ప్రమాదమున్నదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. కొన్ని ప్రముఖ మీడియా ఛానెళ్లను కార్పొరేటు సంస్థలు చేజిక్కించుకున్నాయనీ, ఇందులో అదానీ, అంబానీలు కూడా ఉన్నారని మేధావులు గుర్తు చేస్తున్నారు. అయితే, ఈ వర్గం మీడియా మాత్రం మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా.. తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నదని అంటున్నారు.

మీది 'పవర్ జిహాద్'

బీజేపీపై ఉద్ధవ్ థాక్రే ఆరోపణలు

ముంబయి : బీజేపీపై శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాక్రే తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీలను చీల్చి బీజేపీ పవర్ జిహాద్‌కు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, తమను బీజేపీ ఔరంగజేబ్ ఫ్యాన్ క్లబ్ అని అనటంపై కూడా ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. మరాఠాలను పానిపట్టు యుద్ధంలో ఓడించిన ఆఫ్ఘన్ రాజు అహ్మద్ షా అబ్దాలి వారసుడే కేంద్ర హోం మంత్రి అమిత్ షా అని విమర్శించారు. "బీజేపీ నేతలు మమ్మల్ని ఔరంగజేబ్ ఫ్యాన్ క్లబ్ అని అంటున్నారు. మరి మీరు(బీజేపీ) చేస్తున్నదేమిటి? పవర్ జిహాద్ కాదా" అని ఉద్ధవ్ థాక్రే ప్రశ్నించారు. పూణేలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఉద్ధవ్‌థాక్రే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పై విధంగా స్పందించారు. ఇటీవల పూణే వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీల కూటమి మహావికాస్ అఘాడీ(ఎంవీఏ)పై ఆరోపణలు చేశారు. ఎంవీఏ ఔరంగజేబ్ ఫ్యాన్ క్లబ్ అని విమర్శించారు. దీనికి ప్రతిగానే ఉద్ధవ్ థాక్రే బీజేపీకి గట్టి కౌంటర్ ఇచ్చారు. దీంతో ఆరోపణలు, ప్రత్యారోపణలు మహా రాజకీయాల్లో ఆసక్తిని రేపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

2015 బొగ్గు గనుల చట్టాన్ని మార్చాలి : సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు

- మణుగూరులో సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర
- సమస్యలను వివరించిన కార్మికులు



నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్ర శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చేరుకుంది. మణుగూరులో పీకే ఓసీ 2 కొండాపురం భూగర్భ గని స్టోర్, ఏరియా వర్క్‌షాప్ కేసీహెచ్‌పీ మణుగూరు ఓసీ, ఓసీ 4 జీఎం కార్యాలయం, ఏరియా ఆస్పత్రుల్లో ఫిట్ మీటింగ్‌లు నిర్వహించారు. అనంతరం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో విలేకరులతో ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో బొగ్గు తవ్వడం కోసమే సింగరేణి ఏర్పడిందన్నారు. శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణికే ఇవ్వాలన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి బరి తెగించి హైదరాబాద్‌లోనే బొగ్గు గనుల వేలం పాట నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేలానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తోందని ఆరోపించారు. 2021లో కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు గనుల వేలంపాట సందర్భంగా తొడకొట్టిన మాజీ సీఎం కేసీఆర్ ఆ పాటను ఆపలేకపోయారని అన్నారు.

> దాని రక్షణ కోసమే ప్రజా ఉద్యమాలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ బిడ్డగా ప్రజలను మోసం చేసేందుకు శ్రావణపల్లి, సత్తుపల్లి గనులను వేలం వేసేందుకు ఆర్డర్ ఇచ్చారన్నారు. సత్తుపల్లిలో ప్రయివేట్ సంస్థలకు లీజుకిచ్చిన ఉపరితల గనులకు ఓబీ పోసుకునేందుకు సింగరేణి స్థలం కేటాయించిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రానికి మణిహారమైన సింగరేణిని ప్రయివేటు వారికి అప్పజెప్పేందుకు సిద్ధమవుతున్నాయని విమర్శించారు. అందుకు వ్యతిరేకంగా సింగరేణిలోని యూనియన్‌లు, రాజకీయ పార్టీలు, కార్మికులు, కార్మిక కుటుంబాలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మరో సకల జనుల సమ్మె చేస్తేనే సింగరేణిని దక్కించుకోగలమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం అక్కడి ప్రజలు ఎలా పోరాటాలు చేశారో.. అలాగే తెలంగాణలో సింగరేణి కోసం కదలాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో యాత్ర నాయకులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పి.ఆశయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, నాయకులు గద్దల శ్రీనివాసరావు, నిమ్మల వెంకన్న, కొడిశాల రాములు, సత్రపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు వేలం ఎవరి కోసం..? : సాయిబాబు



ఫిట్ మీటింగ్‌లో సీఐటీయూ కేంద్ర కోశాధికారి సాయిబాబు మాట్లాడుతూ.. 2015 బొగ్గు గనుల చట్టంలో మార్పులు చేసి ప్రవేశపెట్టాలన్నారు. ఇంధన అవసరాల కోసం 30శాతం డీజిల్, పెట్రోల్ దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. మన అన్ని రకాల అవసరాలకు సరిపడా బొగ్గు నిల్వలు మన దేశంలోనే ఉన్నాయన్నారు. విదేశాలకు సైతం ఎగుమతి చేసే సామర్థ్యం మనకుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు తెగ నమ్ముతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు గనుల వేలం ఎవరి కోసమని, ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పితే కార్మికులు ఇబ్బందులు పడతారని తెలిపారు. బొగ్గు వేలం ఆగాలంటే ప్రజలు, కార్మికులు, కార్మిక సంఘాలు, కార్మికుల కుటుంబాలు పోరాటాలు నిర్వహించాలన్నారు. అనంతరం అంబేద్కర్, కొమరం భీం విగ్రహాలకు పూలమాలలేసి నివాళి అర్పించారు.



సున్నం రాజయ్య స్ఫూర్తితో పోడు భూముల సమస్యపై పోరాటం

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోడు భూముల సమస్యపై సున్నం రాజయ్య స్ఫూర్తితో పోరాడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోనిసుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సున్నం రాజయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, పి సోమయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి రాజయ్య ఒక ఆణిముత్యమని కొనియాడారు.

అనేక ప్రజా పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న గొప్ప నాయకుడని అన్నారు. ఆయన తన పదవులను సైతం ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ఉపయోగించారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అనేక ఆఫర్లు ఇచ్చినా లొంగని మార్క్సిస్టు నాయకుడని చెప్పారు. పోడు సమస్యలపై అనేక పోరాటాలు చేశారని అన్నారు. ఆయన మరణించి నాలుగేండ్లయినా ఆ సమస్య ఇంకా పరిష్కారం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తితో పోడు భూములకు పట్టాలు వచ్చేంతవరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి కూశన్న రాజన్న, కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, ముంజం ఆనంద్ కుమార్, దుర్గం రాజ్ కుమార్, నాయకులు చాపిలె సాయికృష్ణ, కోరంగ మాలశ్రీ, టికనంద్, మల్లన్న రవి, కమలక్క తదితరులు పాల్గొన్నారు.



కేరళకి రూ.కోటి విరాళం

ఏఐకెఎస్ కేంద్ర కమిటీ నిర్ణయం

ఆగస్టు 10న దేశవ్యాప్త నిధుల సమీకరణకు పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలోని వాయనాడ్ మహా ప్రళయాన్ని చవిచూసింది. కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వందల ఇండ్లు భూస్థాపితమయ్యాయి. ఈ మహా ప్రళయాన్ని ఎదుర్కొంటున్న కేరళకు రూ.కోటి విరాళాన్ని ఇవ్వాలని ఏఐకేఎస్ కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. రెండు రోజుల పాటు నిర్వహించే ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సమావేశాలు శనివారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐఏఎం)లో ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి 70 మందికి పైగా నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అశోక్ ధావలే ఉపన్యాసం అనంతరం ప్రధాన కార్యాదర్శి విజూ కృష్ణన్ నివేదికను ప్రవేశ పట్టారు. దేశాన్ని చుట్టుముట్టిన తీవ్ర వ్యవసాయ సంక్షోభం, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక విధానాలపై చర్చిస్తోంది. భవిష్యత్ కార్యక్రమాలనూ రూపొందిస్తోంది.

కేరళలోని వాయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో విపరీతమైన ప్రాణ, ఆస్తి నష్టం జరగడంపై ఏఐకేఎస్ సంతాప తీర్మానాన్ని ఆమోదించింది. వరదల్లో చిక్కుకున్న ప్రాణాలను కాపాడేందుకు కార్యకర్తలు సమన్వయంతో పగలు, రాత్రి శ్రమిస్తున్నారని సమావేశం పేర్కొంది. తమ సహకారాన్ని రెట్టింపు చేసేందుకు ఏఐకేఎస్, కేరళ కర్షక సంఘం (కేరళలోని ఏఐకెఎస్ రాష్ట్ర కమిటీ) సహాయ చర్యలకు రూ.1 కోటి రూపాయల మొత్తాన్ని అందించాలని నిర్ణయించింది. ఎఐకెఎస్ తమిళనాడు రాష్ట్ర కమిటీ రూ. లక్ష రూపాయల చెక్కును అందించింది.వాయనాడ్ కొండచరియలు విరిగిపడిన బాధితుల కోసం ఆగస్టు 10న దేశవ్యాప్తంగా మాస్ ఫండ్ కలెక్షన్ కోసం ఇప్పటికే పిలుపునిచ్చింది. తెలంగాణ రాష్ట్రం నుంచి సంఘం జాతీయ సహాయ కార్యదర్శి టి. సాగర్, కేంద్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర కమిటీ సభ్యులు పి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయనాడ్ సహాయార్థం విరాళాల సేకరణ

రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొన్న సీపీఐ(ఎం) శ్రేణులు



నవతెలంగాణ- విలేకరులు

కేరళలోని వాయనాడ్ వరద బాధితులకు సహాయం చేసేందుకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ప్రజలు తమ వంతుగా సహాయం చేశారు. కేరళ రాష్ట్రం వయానాడ్ వరద బాధితులకు చేయూతగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిధులు సేకరించారు.

దరూర్‌లో 4,573 రూపాయలు ప్రజల నుంచి విరాళంగా సేకరించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో విరాళాల సేకరణలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పాల్గొన్నారు. ప్రజలకు కేరళ విధ్వంసం గురించి వివరిస్తూ.. విరాళాలు సేకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో, రేగళ్ల గ్రామంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేశారు. సూర్యాపేటలో బ్యానర్ చేబూని విరాళాలు సేకరించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. జిల్లా కేంద్రంలో టవర్ సర్కిల్, ప్రకాశం గంజ్ ప్రాంతాలలో దుకాణాల్లో విరాళాలు సేకరించారు. రూ.4511 ప్రజలందించారు. జగిత్యాలలో 4802 రూపాయల విరాళాలు సేకరించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో సీపీఐ(ఎం) కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. హైదరాబాద్‌లోని అబిడ్స్ సర్కిల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ నాయకులు నారాయణ మాట్లాడుతూ.. కేరళలో వామపక్ష శ్రేణులు రెస్క్యూ ఆపరేషన్ టీంలలో భాగస్వాములై బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందిస్తున్నారని చెప్పారు.

సీఎంను, నన్ను చెప్పలేని పదాలతో దూషించారు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనను, సీఎం రేవంత్‌రెడ్డిని బయటకు చెప్పలేని పదాలతో దూషించారని, అందుకే శుక్రవారం అసెంబ్లీలో తాను సహనం కోల్పోయానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో హిమాయత్ నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ రామన్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కావాలనే తనను టార్గెట్ చేశారని, హైదరాబాద్ అభివృద్ధిపై తనకు మాట్లాడేందుకు అవకాశం వచ్చినప్పుడు ఆటంకం కలిగించారని అన్నారు. వారు తనను దూషించిన మాటలు రికార్డు కాలేదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డిని, తనను కించపరిచే విధంగా మాట్లాడటం వల్లే సహనం కోల్పోయి.. వారి మాటలకు సమాధానంగానే ఆ వ్యాఖ్యలు చేశానన్నారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలు హైదరాబాద్ వాడుక భాషేనని, ఎవరికైనా బాధ కలిగిస్తే క్షమించాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోవడం వల్ల ఆవేదనతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అసెంబ్లీ ప్రారంభమైనప్పటి నుంచి సభను సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించారన్నారు. ప్రతిపక్షంగా సమస్యలపై చర్చలు చేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఉందని.. కానీ వారు అలా ఉండటం లేదన్నారు. పదేండ్లుగా ఏనాడూ తన లాంటి వారికి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం రాలేదన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వారి పద్ధతిని మార్చుకోవాలని సూచించారు.

అందుకే సహనం కోల్పోయా..

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

శ్రీశైలంలో కృష్ణమ్మ పరవళ్లు..

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు 10గేట్లు తెరిచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీళ్లు వదులుతున్నారు. అయితే, శని, ఆదివారం సెలవు కావడంతో సందర్శకులు భారీగా వస్తున్నారు. దీంతో సందర్శకులు, యాత్రికులతో ప్రాజెక్టు వద్ద సందడి నెలకొన్నది. భారీగా వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ప్రజలకు, పర్యాటకులకు, ఇబ్బందులు కలగకుండా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రి స్తున్నారు. పాతాళ గంగలోకి ప్రజలు వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

దుందుడుకుతనం

- వెనిజులా ఎన్నికల ఫలితాలపై అమెరికా పెత్తనం
- సాక్ష్యాధారాలు లేకుండానే పరాజితుడే విజేత అంటూ ప్రకటనలు
- ఖండించిన మదురో సర్కార్, అండగా ప్రపంచ దేశాలు

వాషింగ్టన్, కారకస్ : ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండానే వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్ష అభ్యర్థి ఎడ్మండో గోంజాలెజ్ విజేత అని అమెరికా ప్రకటించింది. వెనిజులాలో అధ్యక్ష ఎన్నికలు జరిగిన కొన్ని రోజుల తర్వాత అమెరికా విదేశాంగ శాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. జులై 28నాటి అధ్యక్ష ఎన్నికల్లో ఎడ్మండ్ గోంజాలెజ్‌కు అత్యధిక ఓట్లు వచ్చాయని ఆ ప్రకటన పేర్కొంది. అంతే కాకుండా వెనిజులా ఎన్నికల వ్యవస్థ, ఓటింగ్ రోజున అనుసరించే ప్రక్రియను, వెనిజులా జాతీయ ఎన్నికల మండలి విడుదల చేసిన ఫలితాల తీరును ఆ ప్రకటన తీవ్రంగా విమర్శించింది. అమెరికా మరోసారి తన కుట్రను అమలు చేయడానికి చూస్తోందంటూ విమర్శించిన వివిధ ప్రభుత్వ, రాజకీయ విశ్లేషకులను, సామాజిక ఉద్యమాలను కూడా ఆ ప్రకటన తీవ్రంగా విమర్శించింది.

వాస్తవిక పరిస్థితులకు విరుద్ధంగా

వెనిజులాలో వాస్తవికంగా నెలకొన్న పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా ఈ ప్రకటన ఉంది. జులై 29న ఉదయం వెనిజులా జాతీయ ఎన్నికల మండలి అధ్యక్షుడు ఎల్విస్ అమరోసో ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. 80శాతం బ్యాలట్లు లెక్కించడం పూర్తయిందని, ఇప్పటికే మదురో 51శాతం ఓట్లతో విజయం దిశగా పయనిస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో 59శాతం మంది పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించు కున్నారని చెప్పారు. మితవాద అభ్యర్థి అయిన ఎడ్మండో గోంజాలెజ్ 44శాతం ఓట్లతో రెండో స్థానంలో వున్నారు. ఈ ఓటమిని అంగీకరించని ప్రతిపక్షం ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని పేర్కొంటూ ఈ ఫలితాలను గుర్తించబోమని తెలిపింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మితవాద మూకలు హింసాత్మక దాడులకు దిగాయి. ఎన్నికల ఫలితాలను తిరస్కరిస్తూనే ఈ హింస్మాతక నిరసనలు చెలరేగాయని భావించేలా చేశారు. కానీ వెనిజులా ప్రభుత్వం ఈ పరిణామాలను తీవ్రంగా విమర్శించింది. దేశాన్ని అస్థిరపరిచేందుకు ఫాసిస్ట్ మూకలు ఈ తరహా ఎత్తుగడలకు పాల్పడుతున్నా యని విమర్శించింది. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఫలితాలపై ఆడిట్ నిర్వహించాలని కోరుతూ అధ్యక్షుడు మదురో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

వెనిజులా ప్రతిస్పందన

అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ ప్రకటన జారీ చేసిన కొద్ది సేపటికే వెనిజులా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన చేసింది. అమెరికా చేసిన అత్యంత హాస్యాస్పదమైన ఈ ప్రకటనలను వెనిజులా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అంతర్జాతీయస్థాయిలో కమ్యూనికేషన్ అధికారాల ద్వారా, సామాజిక నెట్‌వర్క్‌లను ఉపయోగించుకుంటూ, అసత్యాలు, అవకతవకలకు పాల్పడుతూ, తప్పుడు కథనాలు సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించింది. ఇలాంటి చర్యలు వీధి హింసకు దారి తీస్తాయని హెచ్చరించింది. గత 25ఏండ్లుగా బొలివారియన్ ప్రభుత్వాలను కూలదోయడానికి అమెరికా ప్రభుత్వాలు పనిచేస్తూనే ఉన్నాయని విమర్శించింది. వారి ప్రయత్నాలన్నీ వెనిజులా ప్రజల ధృఢ సంకల్పం ముందు ఓడిపోయాయయని పేర్కొంది.

వెనిజులాకు అండగా ప్రపంచ దేశాలు

అమెరికా చర్యను అంతర్జాతీయ సమాజం ఆమోదించలేదు. శుక్రవారం నాటికి డజన్ల సంఖ్యలో ప్రపంచ దేశాలు మదురో విజయాన్నే గుర్తించాయి. వీటిలో చైనా, రష్యా, ఇరాన్, క్యూబా, వియత్నాం, సిరియా, బొలీవియా వంటి దేశాలు వున్నాయి.



ప్రజా రవాణాను అభివృద్ధి చేయాలి

సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర కార్యదర్శి శ్రీనివాస్

- ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలంటూ సంతకాల సేకరణ

నవతెలంగాణ-మెహదీపట్నం

నానాటికీ విస్తరిస్తున్న హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో మెహిదీపట్నం చౌరస్తాలో శనివారం సంతకల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదన్నారు. ప్రజలు నిత్యం ట్రాఫిక్, కాలుష్యం తదితర సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. రోడ్డు వెడల్పు కార్యక్రమాలు, ఫ్లై ఓవర్లు నిర్మించినప్పటికీ ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. నగరంలో ఎక్కువమంది ప్రజలు ప్రయాణించేలా బస్సులు, రైళ్ల సంఖ్యను పెంచకపోవడం వల్ల విధిలేక తమ సొంత వాహనాలను ఉపయోగిస్తున్నారన్నారు. దీంతో నగర రోడ్లపై ప్రతి ఏడాదీ లక్షల్లో సొంత వాహనాల సంఖ్య పెరుగుతోందని, దాంతో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల మహిళలకు ఉచిత బస్సు స్కీం ప్రవేశ పెట్టడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. ఈ పథకం ఆహ్వానించదగినదే కానీ బస్సుల సంఖ్యను పెంచాల్సింది పోయి తగ్గించడం శోచనీయమన్నారు. మెట్రో రైళ్లు కూడా సాయంత్రం సమయంలో ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటున్నాయని, బోగీల సంఖ్యను పెంచాలని కోరారు. నగరంలో ట్రాఫిక్, కాలుష్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ బస్సుల సంఖ్యను, మెట్రో రైల్ సర్వీసులను పెంచాలని డిమాండ్ చేశారు.

నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్ మాట్లాడుతూ.. బస్సులు సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యులు అజయ్, బాబు, నాంపల్లి జోన్ కమిటీ సభ్యులు వెంకటస్వామి, అర్షద్ జాంగిర్, సాగర్, ఫరీద్, బాలు, యాదగిరి, రమేష్, వెంకటేష్, కృష్ణ, శ్రీనివాసు, వెంకటేష్ పాల్గొన్నారు.

భూపాలపల్లిలో 200 పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం

- ఐటీ శాఖ మంత్రి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు
- పోడు రైతులకు పట్టాలు అందిస్తాం.. : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఇండస్ట్రియల్ పార్క్‌తో యువతకు ఉపాధి అవకాశాలు : మంత్రి సీతక్క
- మైలారంలో ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన



నవతెలంగాణ- భూపాలపల్లి

భూపాలపల్లిలో 200 పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ (మైలారం) గుట్టపై 60 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు శనివారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), వరంగల్ ఎంపీ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ముందుగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు మాట్లాడారు.

పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బాధ్యతల్లో భాగంగా 7 నెలల నుంచి అడుగు తరువాత అడుగు వేస్తూ అభివృద్ధి చేస్తూ వస్తున్నామన్నారు. జిల్లాలో నీటి వనరులు, ఖనిజ సంపద పుష్కలంగా ఉందన్నారు. ములుగు, భూపాలపల్లి ప్రాంతాల సాగు నీటి అవసరాలు తీర్చడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. కోటి మందిని స్వశక్తి మహిళా గ్రూపు సభ్యులుగా చేర్చి వారిని లక్షాధికారులను చేయడానికి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇక్కడ పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు కావాలని కోరుతున్నారని, ఐటీ నిపుణులతో సంప్రదించి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. మాస్టర్ ప్లాన్ ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని.. ఇక్కడ 200 పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

రెవెన్యూ సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు రెండు కండ్లలాగా సాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని ఇదిగో అదిగో అని చెప్పి పదేండ్లలో 1.50 లక్షల ఇండ్లు మాత్రమే కట్టిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలోనే 4.50 లక్షల ఇండ్లు కట్టిస్తుందని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరు ఎత్తలేదని, రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధుల విషయంలో తొండాట ఆడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదోడి ఆలోచనకు అనుగుణంగా ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కాబోతుందన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు కోరిన విధంగా పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా మంది ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్నారని, ఇక్కడ ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్కుతో స్థానికంగానే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో మారుమూల ప్రాంతాలైన భూపాలపల్లితో పాటు ములుగులో కూడా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని, దీనికోసం స్థల సేకరణ చేపడుతున్నామని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, భూపాలపల్లి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. ఇక్కడ ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. డిబిఎం 38 ద్వారా సాగునీరు అందించాలని కోరారు. నియోజకవర్గంలో రోడ్ల సమస్య ఉందని చెప్పారు. ప్రధానంగా వెంకటాపూర్ మండలం వెలుతుర్లపల్లి నుంచి సీతారాంపూర్, కొండాపూర్ గ్రామాల మీదుగా గుర్రంపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రులను కోరారు. మొరంచవాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో టిజిఐఎస్ఎస్ చైర్మెన్ శ్రీమతి నిర్మలాజగ్గారెడ్డి, ట్రేడ్ యూనియన్ చైర్మెన్ ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పీ కిరణ్ ఖరే, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు ఎసరు..



- తక్కువ ధరలకు రైతులతో రియల్ వ్యాపారుల అగ్రిమెంట్లు
- రూ.వందల కోట్ల విలువ గల సర్కారు భూములు మాయం
- ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే భూవ్యాపారం

రైతుల ఆధీనంలో ఉన్నన్ని రోజులు అవి అసైన్డ్, భూదాన్, వక్ఫ్‌బోర్డు భూములు.. రియల్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లగానే పట్టా భూములుగా మారుతున్నాయి. నిషేధిత జాబితా నుంచి తొలగిపోయి క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. అసైన్డ్ భూములు, పట్టాలుగా యథేచ్ఛగా మారుతున్నాయి. అధికారుల కనుసన్నల్లోనే క్రయవిక్రయాలు జరుగుతుండటం గమనార్హం. "మీ దగ్గర ఉంటే ఎన్నాళ్లయినా అసైన్డ్‌గానే ఉంటుంది.. అమ్ముకోవడానికి రాదు.. మేము ఎక్కువ డబ్బులిస్తాం.." అంటూ రైతులకు నయానో భయానో డబ్బులు ముట్టజెప్పి వ్యాపారులు అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు. ఆ తర్వాత వారి పేర్లపై పట్టా భూములుగా మార్చుకుంటున్నారు. అధికారులు అనుకుంటే ఏదైనా సాధ్యమే అనే దానికి ఇది నిదర్శనం. రంగారెడ్డి జిల్లాలో భూబాగోతాలకు కొదవ లేదు. రియల్ వ్యాపారుల వెనుక ఎవరు ఉన్నారు.. అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారో అంతు చిక్కని ప్రశ్న. వందల కోట్లు విలువ చేసే భూములను కొల్లగొడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఫోర్త్ సిటీగా మహేశ్వరం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాంతంలో భూములకు ఇప్పటికే భారీగా ధరలు ఉండగా.. సీఎం ప్రకటనతో మరింత డిమాండ్ పెరిగింది. ఇక్కడి భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్నుపడింది. అయితే, ఈ ప్రాంతంలో పట్టా భూముల కంటే అసైన్డ్, సీలింగ్, భూదాన్, వక్ఫ్‌బోర్డు, ఎక్స్ ఆర్మీ, స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం ఇచ్చిన భూములే ఎక్కువగా ఉన్నాయి. ఈ భూములు ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు ఇచ్చినవి. అవి ఎప్పటికీ పట్టాలుగా మారే అవకాశం ఉండదు. అసైన్డ్‌దారులు విక్రయించడానికి కూడా అవకాశం లేదు. కానీ చట్టాన్ని చుట్టచుట్టి రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, అసైన్డ్‌దారులకు పట్టా పాస్ పుస్తకాలు ఇస్తే మంచిదే.. కానీ అసైన్డ్‌దారులకు నయానో భయానో ఆశ చూపి.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ భూములను తమ వశం చేసుకున్న తరువాత రికార్డులు మారుతున్నాయి. ఇందుకు నిదర్శనం ఇటీవల శంషాబాద్ మండల పరిధిలో జరిగిన ఘటనే.

శంకారపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 24లో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో ప్రభుత్వం పేదలకు అసైన్డ్ చేసింది. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సుమారు 20 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమి రైతులు చేతుల్లో ఉన్నప్పుడు సర్కారు భూమిగా ఉంది. రియల్ వ్యాపారి చేతుల్లోకి వెళ్లగానే పట్టాగా మారినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులను సంప్రదించగా సమాధానం లేదు.

అసైన్డ్ నుంచి పట్టాగా మార్పులు

మహేశ్వరం మండలం మంఖాల్‌లో సర్వే నంబర్ 625 నుంచి 642 వరకు ఉన్న లావణి పట్టా భూములపై ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కన్నేసింది. ఇక్కడ ఎకరం సుమారు రూ.10 నుంచి 15 కోట్ల వరకు పలుకుతోంది. 'ఈ భూములు మీకు ఎప్పటికీ దక్కవు.. ఇక్కడికి పెద్దపెద్ద కంపెనీలు వస్తున్నాయి. ఈ భూములను ప్రభుత్వం లాక్కుంటుంది' అని నమ్మబలికి రైతుల నుంచి అసైన్డ్ భూములను ఎకరం రూ.20 నుంచి 40 లక్షల వరకు ఆ రియల్ ఎస్టేట్ సంస్థ అగ్రిమెంట్లు చేసుకున్న పరిస్థితి. ఈ ప్రాంతంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సుమారు 100 ఎకరాల అసైన్డ్ భూమిని అగ్రిమెంట్ చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. కందుకూరు మండలం తిమ్మాయిపల్లిలోని సర్వే నంబర్ 9/1, సర్వే నంబర్ 9/2లోని అసైన్డ్ భూమిని ఎకరం రూ.40 లక్షలకే సొంతం చేసుకుంటున్నారు. మహేశ్వరం-తుమ్మలూరు రెవెన్యూ గ్రామాల మధ్య ఉన్న 70 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. తుమ్మలూరు రెవెన్యూ పరిధిలోని సర్వే 247లో వందల ఎకరాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. తప్పుడు వేలిముద్రలతో పట్టా పాసు పుస్తకాలు సంపాదించి.. ఆ భూములను అక్రమంగా విక్రయిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రక్రియపై ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిని బట్టి చూస్తే రియల్ వ్యాపారులకు రెవెన్యూ అధికారులు ఏ విధంగా కొమ్ముకాస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్న విమర్శలున్నాయి. జిల్లాలో జరుగుతున్న భూ అక్రమాలపై ఉన్నతాధికారులను సంప్రదించే ప్రయత్నం చేసినా.. సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే.. భూ వ్యాపారులతో కొమ్ముకాస్తే ఇక సర్కారు భూములకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సర్కారు భూముల క్రయ విక్రయాలను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

లక్నవరంలో పర్యాటకుల సందడి

- నెలాఖరు వరకు బుక్కైన కాటేజీలు



నవతెలంగాణ-గోవిందరావుపేట

ములుగు జిల్లాలోని లక్నవరం పర్యాటక కేంద్రం శనివారం పర్యాటకులతో కిక్కిరిసింది. వర్షాలకు చెరువు దాదాపు నిండుకోవడంతో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. శని, ఆదివారాల్లో ఇప్పటికే ఆగస్టు నెలాఖరు వరకు కాటేజీలు బుక్ అయిపోయాయి. పర్యాటకుల కొరకు మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు పర్యాటక కేంద్రం యాజమాన్యం కృషి చేస్తుందని మేనేజర్ శివశంకర్ తెలిపారు. ఇప్పటికే బోటు షికారు కోసం పర్యాటకులు లైన్లలో నిలబడుతున్నారు ఆదివారం రద్దీ మరింతగా పెరుగుతుందని తెలిపారు. వికలాంగులు సైతం పర్యాటక కేంద్రాన్ని సందర్శించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు.

ఏసీబీ వలలో కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్

- రైతు దగ్గర లంచం తీసుకుంటుండగా పట్టివేత



నవతెలంగాణ-ఓదెల

పెద్దపల్లి జిల్లాలోని కాల్వ శ్రీరాంపూర్ మండల తహసీల్దార్ జాహిద్ పాషా శనివారం ఏసీబీ అధికారుల చేతికి చిక్కాడు. వివరాల్లోకి వెళితే.. ఓదెల మండలం కొమిర గ్రామానికి చెందిన రైతు కాడం తిరుపతి మంచిర్యాల జిల్లాలోని మందమర్రిలో నివాసం ఉంటున్నాడు. తిరుపతికి కాల్వ శ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామ శివారులోని సర్వే నెంబర్ 645లో 0.28 గుంటల భూమి ఉంది. దాన్ని పట్టా చేయించుకోవడానికి తహసీల్దార్‌ను సంప్రదించగా రూ.50వేలు డిమాండ్ చేశారు. రూ.50 వేలు మూడు విడతలుగా చెల్లించి పలుసార్లు కలిసినా పని కాకలేదు. దాంతో విసిగిపోయిన రైతు కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుని భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. పట్టా పాస్ పుస్తకం కూడా వచ్చింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ తిరుపతికి ఫోన్ చేసి మరో రూ.10వేలు తీసుకురావాలని ఒత్తిడి చేశాడు. దీంతో రైతు ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు తహసీల్దార్ జాహిద్‌పాషా రైతు నుంచి డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్నారు.

బీఏ యానిమేషన్ కోర్సు దరఖాస్తు గడువు 17

- బీసీ గురుకుల కార్యదర్శి సైదులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గురుకుల కాలేజీల్లో బీఏ యానిమేషన్ కోర్సు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని మహాత్మా జోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 17 వరకు ఉందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఉన్న బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఇతర వివరాలకు https://mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌ను, 9032644463, 9063242329 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

భూమాత ఆవిష్కరణ పట్ల హర్షం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ధరణి స్థానంలో భూమాత పోర్టల్‌ను తీసుకొస్తున్నందుకు వీఆర్‌వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేందర్‌రావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముసాయిదా బిల్లు చట్ట రూపం దాల్చితే తెలంగాణ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు.

తెలంగాణ గ్రామ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోహన్, నాయకులు పరమేశ్వరావు, కష్ణ, రాష్ట్ర కోశాధికారి కోనబోయిన ప్రసాద్, తదితరులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు.



బీఆర్ఎస్ ఆఫీసును కూల్చండి

- అమెరికా వెళ్లి వచ్చే లోగా పని పూర్తవ్వాలి
- మున్సిపల్ కమిషనర్‌కు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

"నేను అమెరికా వెళుతున్నా.. 11వ తేదీ తిరిగి వస్తాను. ఆ లోగా నల్లగొండ పట్టణంలో అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని నేలమట్టం చేయాలి" అని ఆర్అండ్‌బీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్మించనున్న మున్సిపల్ కౌన్సిల్ హాల్, రికార్డు రూమ్, రెస్ట్ రూమ్‌లకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ నుంచి అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చేయాలని గతంలో ఎన్నోసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తాను అమెరికా నుంచి వచ్చేలోగా కార్యాలయాన్ని కూల్చేయకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడూ మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. పట్టణంలో అనధికారిక నిర్మాణాలను, ప్రభుత్వ స్థలాలలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపట్టినా వెంటనే తొలగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చెర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

త్రిబుల్‌ఆర్ భూ సర్వేను అడ్డుకున్న రైతులు

- వెళ్లిపోయిన అధికారులు



నవతెలంగాణ-నర్సాపూర్

మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి శనివారం భూమి సర్వే చేయడానికి వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. పరిహారంపై తమకు ఖచ్చితమైన హామీ ఇచ్చే వరకు భూమి సర్వే చేయడానికి వీలులేదని భూ నిర్వాసితులు తెగేసి చెప్పారు. అక్కడే కూర్చొని రైతులు ధర్నా నిర్వహించారు. సర్వే చేయడానికి వచ్చిన అధికారులు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, సీఐ జాన్ రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, సర్వేయర్ మొగులయ్య తదితరులను సర్వే చేయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. త్రిబుల్ ఆర్ రోడ్డు సుమారు 17 గ్రామాల నుంచి వెళ్తుండగా.. ఆయా గ్రామాల్లో రైతుల సహకారంతో సర్వే పూర్తి చేశామని తెలిపారు. రెడ్డిపల్లి గ్రామంలో మాత్రమే సర్వే మిగిలిపోయిందన్నారు. అయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లిస్తుందని, తాము పై అధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తామన్నారు. సర్వేకు సహకరించాలని అధికారులు ఎంత చెప్పినా రైతులు వినకపోవడంతో వెను తిరిగి వెళ్లిపోయారు.

రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొన్న కారు

- బాలుడు మృతి



నవతెలంగాణ-మెహిదీపట్నం

హైదరాబాద్ గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా రాంగ్‌రూట్‌లో దూసుకొచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో బాలుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన రమేశ్ ప్రయివేటు ఉద్యోగి. శనివారం అతను కుమారుడు సూర్య(7), భార్యను తీసుకొని ఇబ్రహీంబాగ్ నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో షేక్‌పేట మారుతీనగర్ కాలనీకి చెందిన యువకుడు శ్రీనాథ్ మద్యం మత్తులో కారు నడుపుకుంటూ రాంగ్ రూట్‌లో వచ్చి రమేశ్ బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో బైక్‌పై ఉన్న బాలుడు సూర్య అక్కడికక్కడే మృతిచెందాడు. రమేశ్, అతని భార్యకు గాయాలయ్యాయి. గోల్కొండ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని శ్రీనాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గాయాలైన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, కారు నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నాడని, కారులో మద్యం బాటిళ్లు కూడా ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. అలాగే, కారులో ఐదుగురు ఉండగా ప్రమాదం జరిగిన వెంటనే మిగతావారు అక్కడి నుంచి పరారయ్యారని తెలిపారు.

కమ్యూనిస్టు సిద్ధాంతానికి గెలుపు ఓటములు కొలమానం కాదు

- చావా లెనిన్ సంస్మరణ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-నేలకొండపల్లి

ఎన్నికల్లో కమ్యూనిస్టుల ఓట్లు, సీట్లు తగ్గినా అనేక రూపాల్లో కమ్యూనిస్టు సిద్ధాంతం, ఆశయాలు నిత్యం గెలుస్తూనే ఉన్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన పార్టీ నాయకుడు చావా లెనిన్ సంస్మరణ సభకు శనివారం తమ్మినేని హాజరయ్యారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కమిటీ సభ్యుడు ఇంటూరి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని మాట్లాడారు. కమ్యూనిస్టులు బలహీనపడుతున్నారని విమర్శలు చేసేవారు ముందుగా.. కమ్యూనిస్టు సిద్ధాంతం, ఆశయాల గురించి అర్థం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములే కమ్యూనిస్టు బలానికి కొలమానం కాదన్నారు. పార్లమెంటు నిండు సభలో ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కమ్యూనిస్టు సిద్ధాంతాలను, కమ్యూనిస్టుల మాటలను తన ఉపన్యాసంలో చెబుతున్న విషయాలను విమర్శకులు గుర్తించాలన్నారు. దేశంలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులను వ్యతిరేకించడమే లక్ష్యంగా సమ సమాజ నిర్మాణం కోసం కమ్యూనిస్టులు నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్నారన్నారు. అటువంటి కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నేడు పార్లమెంటులో కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారంటే అది కమ్యూనిస్టు ఉపన్యాసమేగానీ కాంగ్రెస్ మాటలు కావన్నారు. ఈ పరిణామాలు, మార్పులను కమ్యూనిస్టుల ఓట్లు, సీట్లు, బలాబలాలపై విమర్శలు చేసేవారు గమనించాలన్నారు. నేడు పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేతలు చెప్పే లెక్కలు, ఉపన్యాసాలను తాను గతంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కాంగ్రెస్ హయాంలో చేపట్టిన మహాజన పాదయాత్రలో చెప్పానని గుర్తు చేశారు. నేలకొండపల్లి మండలంలోని మోటాపురం గ్రామం కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రం అని తెలిపారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన నాయకత్వాన్ని అందించిన గ్రామం అని తెలిపారు. ఖమ్మం జిల్లాలో మోటాపురం, తెల్లారుపల్లి లాంటి అనేక గ్రామాలంటే శత్రువుల గుండెల్లో దడ పుట్టేదన్నారు. ఓ సినిమా కవి రాసిన.. ఒక్క రోజైనా ఒక్కసారైనా కమ్యూనిస్టుగా బతుకు నేస్తమా! ఆ గొప్ప నీకు తెలుస్తుంది మిత్రమా! అనే పాటను గుర్తు చేస్తూ కమ్యూనిజం గొప్పతనాన్ని తెలియజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ.. చావా లెనిన్ ఆకస్మిక మరణం బాధాకరమన్నారు.

రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, మన్నేపల్లి సుబ్బారావు, సీపీఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్, గొడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కేవీ.రామిరెడ్డి, కూసుమంచి మండల కార్యదర్శి రమణారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సదానందం తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి వికలాంగ జేఎల్ అభ్యర్థులకు మెడికల్ పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంటర్ విద్యాశాఖ కమిషనరేట్ పరిధిలో 1,392 జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు ఎంపికైన వికలాంగ అభ్యర్థులకు ఈనెల 27 నుంచి మెడికల్ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడే అభ్యర్థులు 126 మంది జేఎల్ పోస్టులకు దరఖాస్తు చేశారని వివరించారు. వారికి ఈనెల 27 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో కంటి పరీక్షలు జరుగుతాయనీ, అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. గైర్హాజరైన వారు వచ్చేనెల రెండో తేదీన రావాలని సూచించారు. వచ్చేనెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు వినికిడి లోపం ఉన్న 74 మంది వికలాంగుల (బధిరుల)కు కోటి ఈఎన్‌టీ ఆస్పత్రిలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. గైర్హాజరైన వారు వచ్చేనెల పదో తేదీన హాజరు కావాలని సూచించారు. 79 మంది ఆర్థోపెడిక్ వికలాంగులకు ఈనెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు ఉస్మానియా ఆస్పత్రిలో మెడికల్ పరీక్షలు జరుగుతాయని వివరించారు. గైర్హాజరైన వారు ఈనెల ఎనిమిదో తేదీన హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 1,392 జేఎల్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ తొమ్మిదిన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

కేజీబీవీ విద్యార్థినిల ఆందోళనపై స్పందించిన విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాసిరకం భోజనం పెడుతున్నారంటూ కోస్గి మండలం నాచారం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినిలు ఆందోళన చేపట్టిన ఘటనపై విద్యాశాఖ స్పందించింది.

విద్యాముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం స్పందించి నాచారం కేజీబీవీని సందర్శించాలంటూ పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులను ఆదేశించారు. విద్యార్థినిలకు మెనూకు తగినట్టుగా పౌష్టికాహారం అందించడంతోపాటు పాఠశాలలో పరిశుభ్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మైదానాలు మాయం



- గత ప్రభుత్వంలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు
- రూ.లక్షలు ఖర్చు
- నిర్వహణ లేక కబ్జా

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఎకరంలో లక్షలు ఖర్చు పెట్టి గ్రామీణ క్రీడా మైదానాలను అట్టహాసంగా ప్రారంభించారు.. ప్రారంభం తర్వాత ఎవరూ అటువైపు చూడలేదు. అందులో చాలా మైదానాలు మాయమయ్యాయి. ఎక్కువగా ఆ ప్రాంగణాల్లో క్రీడల నిర్వహణ జరగడం లేదు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.నాలుగు లక్షలకుపైగా ఖర్చు చేసి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేశారు. మైదానాల్లో ఏర్పాటు చేసిన బోర్డులు సైతం చోరీకి గురయ్యాయి. గత ప్రభుత్వం పట్టించుకోలేదు.. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై దృష్టిపెట్టి గ్రామాల్లో ఆటలను ప్రోత్సహించేందుకు మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థి, యువజన సంఘాలు కోరుతున్నాయి. క్రీడలను ప్రోత్సహిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున.. పెద్ద పెద్ద స్టేడియాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాలను కాపాడాలని కోరుతున్నాయి.

రాష్ట్రంలో 2023 జూన్ 2న క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 19వేల గ్రామాలు, ఐదు వేల కాలనీలలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు నడుం బిగించగా.. సగానికిపైగా ప్రాంతాల్లో అప్పటి ప్రభుత్వం క్రీడా మైదానాలు ప్రారంభించింది. భవిష్యత్ తరాలకు శరీర దారుఢ్యం, మానసిక ఉల్లాసం తదితర వాటిని పెంపొందింపజేసేందుకు క్రీడలు ఉపయోగపడతాయి. క్రీడల శిక్షణ కార్యక్రమంలో అనేకమందికి ఉపాధి అవకాశాలు సైతం లభిస్తాయి. ఊరికో ఆట స్థలం గ్రామానికి క్రీడా ప్రాంగణం అనే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరకపోగా కోట్లాది రూపాయలు నిరుపయోగం అయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మించిన మెజార్టీ క్రీడా ప్రాంగణాలు మాయమయ్యాయి. వనపర్తి జిల్లా పరిధిలో 319 గ్రామాలకుగాను 295 క్రీడా ప్రాంగణాలున్నాయి. పెద్దగూడెం గ్రామంలో 5 ఎకరాల పరిధిలో రూ.3,75,000 పెట్టి క్రీడా ప్రాంగణం, బోర్డులు ఏర్పాటు చేశారు. కడుకుంట్ల దగ్గర రూ.78000, చిట్యాల దగ్గర రూ.68 వేలతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. గద్వాల జిల్లాలో 296 గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో 290 పూర్తి చేశారు. స్థలాలు లేక 16 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయలేదు. నాగర్ కర్నూల్ జిల్లాలో 20 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 280పూర్తి చేశారు. నారాయణపేట జిల్లాలో 336 ప్రాంగణాలకు 334 నిర్మించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 334 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు.



తెలకపల్లి మండల కేంద్రంలోని యోగ భవనం దగ్గర వ్యవసాయ పొలంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం కబ్జాకు గురైంది. అక్కడ బోర్డు మాత్రమే మిగిలింది. కోకో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్ పరికరాలు పరాధీనమయ్యాయి. నాగర్‌కర్నూల్ మండలం దుగ్గలపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గర క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.

పాఠశాల స్థలాన్ని పూర్తిగా కాంపౌండ్‌తో ఆక్రమించుకున్నారు. ఇప్పుడు గ్రామ యువతకు, విద్యార్థులకు క్రీడలకు మైదానం లేకుండా పోయింది. తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామంలో రామగిరి గుట్ట దగ్గర పొలంలో ఓ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల ఎవరికీ ఉపయోగంగా లేకుండా పోయింది. పైగా మైదానం మొత్తం వ్యవసాయ పొలం కావడం వల్ల ఆటలకు అనుకూలంగా లేదు.

క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం

రమేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, నాగర్‌కర్నూల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో మైదానాలు మాయమయ్యాయి. ముఖ్యంగా క్రీడా మైదానాలను పాఠశాలలకు అనుబంధం చేసి నిత్యం విద్యార్థులు ఆడుకునేలా చర్యలు తీసుకోవాలి. మైదానాలను పునరుద్ధరించాలి. కబ్జా చేసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పేరుతో బురిడీ

రూ.2.43 కోట్లు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు పారిశ్రామికవాడలో వెలుగు చూసిన వైనం

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



నవతెలంగాణ-పటాన్‌చెరు

సైబర్ నేరగాల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. చదువుకున్నవాళ్లే వారి ఉచ్చులో పడుతున్నారు. కొన్ని రోజుల కిందట పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏపీఆర్ గ్రాండ్యుయో గేటెడ్ కమ్యూనిటీలో నివాసముండే ఓ ఉద్యోగి సైబర్ నేరగాల ఉచ్చులో పడి సుమారు కోటి రూపాయల మేర మోసపోయాడు. కొన్ని రోజుల వ్యవధిలోనే అదే తరహాలో అదే కాలనీకి చెందిన మరో వ్యక్తి.. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలంటూ వచ్చిన మెసేజ్‌తో రూ.2.43 కోట్లు పోగొట్టుకున్నాడు. ఇందుకు సంబంధించి పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఏపీఆర్ గ్రాండ్యుయో గేటెడ్ కమ్యూనిటీలో నివాసముండే ఓ వ్యక్తికి గత నెల ఏడో తేదీ నుంచి స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలంటూ మెసేజ్‌లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటికి ఆకర్షితుడైన అతడు ఇప్పటివరకు 22సార్లు లావాదేవీలు జరిపి.. రూ.2,43,25000 (రెండు కోట్ల 43 లక్షల 25 వేలు) ఆ ఫేక్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టాడు. చివరకు అది ఫేక్ మార్కెట్ అని తెలుసుకున్న అతడు శనివారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన సీఐ ప్రవీణ్ రెడ్డి బాధితుడి అకౌంట్‌లోని రూ.28 లక్షలు ఫ్రిజ్ చేయించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. సైబర్ మోసాల బాధితుల్లో ఎక్కువగా చదువుకున్నవాళ్లే ఉంటున్నారని చెప్పారు. ఇలాంటి సైబర్ మోసాలకు దూరంగా ఉండాలన్నారు. ఒకవేళ మోసపోతే.. వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

డ్వాక్రా మహిళలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు

మధిర నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్

'ఇందిరా డెయిరీ'లో మహిళలను వాటాదారులుగా చేరుస్తాం : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ముదిగొండ

డ్వాక్రా మహిళలకు రూ.20 కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్యమంత్రి మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని కమలాపురం, అయ్యగారిపల్లి, మల్లన్నపాలెం గ్రామాల్లో ఆయన శనివారం విస్తృతంగా పర్యటించారు. అయ్యగారిపల్లి, కమలాపురం గ్రామాల్లో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మల్లన్నపాలెంలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తామని, త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో మహిళలను పాడి పరిశ్రమలలో వాటాదారులుగా చేర్చి, పారిశ్రామికవేత్తలుగా చేసేందుకు 2014లో ఇందిరా డెయిరీని ప్రవేశపెట్టామని చెప్పారు. నియోజకవర్గంలో మహిళలకు గేదెలు అందించి వారిని పరిశ్రమలో వాటాదారులుగా చేస్తామన్నారు. ప్రజానీకానికి న్యాయం జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. విద్య, వైద్య, ప్రజా, రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. అనంతరం ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, దివ్యాంగులు, ఆర్టీసీ డ్రైవర్లు, గ్రామానికి చెందిన పలువురు సమస్యలపై భట్టికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి

ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓజాకు వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓజాను శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. గెస్ట్ లెక్చరర్లను కొనసాగిస్తూ ఉత్తర్వులను విడుదల చేయాలని కోరారు. బదిలీల్లో డిస్టర్బ్ అయిన గెస్ట్ లెక్చరర్లను మరోచోట సర్దుబాటు చేయాలని సూచించారు. ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ల సంఘం నాయకులు కె మహేష్‌కుమార్, ఎం బాబురావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్జేడీ జయప్రదబాయిని కలిసి సమస్యలపై చర్చించారు.

సర్వోటెక్ పవర్ సిస్టమ్స్‌లో 41 శాతం వృద్ధి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) చార్జర్‌లు, సోలార్ సొల్యూషన్, పవర్ బ్యాకప్ సొల్యూషన్‌లలో ప్రముఖ తయారీదారుగా పేరుగాంచిన సర్వోటెక్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీ అత్యుత్తమ ఫలితాలను సాధించింది. 41 శాతం ఆర్థిక వృద్ధిని సాధించినట్టు శనివారం ప్రకటించింది. వినియోగదారులకు ఉత్తమమైన ఉత్పత్తులు, సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపింది. కొత్త వాటిని నిరంతరం ఆవిష్కరిస్తామని పేర్కొంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇతర ఈవీ చార్జర్ ఈఎం నుంచి 400 యూనిట్ల డీసీ ఫాస్ట్ ఈవీ చార్జర్‌లను సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రాజెక్టులను తయారు చేయడం, సరఫరా చేయడం, ఇన్‌స్టాల్ చేయడం, అమలు చేయడం జరుగుతుందని తెలిపింది.

పీజీ డెంటల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

- ఈ నెల 4 నుంచి 8 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం కన్వీనర్ కోటాలో పీజీ డెంటల్ వైద్య విద్యకోసం నోటిఫికేషన్ జారీ అయ్యింది. నీట్-ఎమ్‌డీఎస్-2024 పరీక్షల్లో అర్హత సాధించిన వారు దరఖాస్తుకు అర్హులు. ఎమ్‌డీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇతర సమాచారం కోసం యూనివర్సిటీవెబ్‌సైట్ http://www.knruhs.telangana సంప్రదించాలని యూనివర్సిటీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి చెందాలంటే అడ్డంకులు అధిగమించాలి

పేదరికం, రుణభారం పెరుగుతోంది

- స్వదేశీ సంస్థల్లో చైతన్యం కొరవడింది
- కాలం చెల్లిన విధానాలతో వృద్ధి సాధ్యం కాదు
- ప్రపంచబ్యాంక్ తాజా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ : రాబోయే దశాబ్దాలలో అత్యధిక ఆదాయం కలిగిన దేశాల హోదాను పొందాలంటే భారత్ సహా వందకు పైగా దేశాలు అనేక అడ్డంకులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రపంచబ్యాంక్ తెలిపింది. వరల్డ్ బ్యాంక్ ప్రపంచ అభివృద్ధి నివేదిక-2024 ప్రకారం అమెరికా తలసరి ఆదాయంలో కేవలం మూడో వంతుకు చేరుకోవాలన్నా మన దేశానికి సుమారు 75 సంవత్సరాలు పడుతుంది. అదే మైలురాయికి చేరుకోవడానికి చైనాకు 10 సంవత్సరాలు, ఇండోనేషియాకు సుమారు 70 సంవత్సరాలు పడుతుంది. ఆదాయ సముపార్జనలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు ప్రపంచబ్యాంక్ అధ్యయనం కొన్ని సూచనలు చేసింది. ఇందుకోసం ఆయా ఆర్థిక వ్యవస్థల అర్థ శతాబ్దపు పనితీరును పరిశీలించింది.

గత సంవత్సరం చివరి నాటికి ఓ మోస్తరు ఆదాయం పొందుతున్న దేశాలు (మిడిల్ ఇన్‌కమ్ కంట్రీస్) 108 ఉన్నాయి. ఇవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. ఈ దేశాల మొత్తం జనాభా ఆరు బిలియన్లు. ప్రపంచ జనాభాలో 75 శాతం ఈ దేశాల్లోనే నివసిస్తున్నారు. అయినప్పటికీ వీరిలో మూడింట రెండు వంతుల మంది పేదరికంలో మగ్గిపోతున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో అనేక సవాళ్లు ఎదుర్కోక తప్పదు. ఆ దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. రుణభారం అధికమవుతోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఏర్పడుతున్నాయి. పర్యావరణ సంబంధమైన ఆందోళనలు తలెత్తుతున్నాయి.

ఇప్పటికీ శతాబ్దం నాటి విధానాలే

కాలం చెల్లిపోయిన విధానాలపై ఆధారపడడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. ఇది వేగం పెంచే ఉద్దేశంతో కారును ఫస్ట్ గేర్‌లో నడపడం వంటిది. శతాబ్దం మధ్య నాటికి సుసంపన్నమైన సమాజాలను నిర్మించాలంటే వెనుకబడకూడదని, నూతన విధానాన్ని, వైఖరిని రూపొందించుకోవాల్సి ఉంటుందని ప్రపంచబ్యాంక్ గ్రూప్ ప్రధాన ఆర్థికవేత్త ఇందర్‌మిత్ గిల్ సూచించారు. 'ఓ మోస్తరు ఆదాయాన్ని పొందుతున్న దేశాలు ఇప్పటికీ గత శతాబ్దం నాటి విధానాలనే అనుసరిస్తున్నాయి. పెట్టుబడులను పెంచడానికి రూపొందించిన విధానాల పైనే ప్రధానంగా ఆధారపడుతున్నాయి. ఇదెలా ఉన్నదంటే ఫస్ట్ గేర్‌లో కారు నడుపుతూ వేగంగా వెళ్లాలని అనుకోవడం' అని ప్రపంచబ్యాంక్ నివేదిక వ్యాఖ్యానించింది.

సంస్థల వృద్ధి రేటు తక్కువ

అమెరికా సంస్థలతో పోలిస్తే భారత్, మెక్సికో, పెరూ దేశాల సంస్థల వృద్ధి రేటు చాలా తక్కువగా ఉన్నదని ప్రపంచబ్యాంక్ నివేదిక ఎత్తిచూపింది. అభివృద్ధికి అవకాశం ఉన్న సంస్థల్లో సైతం చైతన్యం కొరవడిందని, అవి మార్కెట్ నుండి చిన్న చిన్న సంస్థలను కూడా కదిలించలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఓ మాదిరి ఆదాయం ఉన్న దేశాల్లో ఇప్పటి వరకూ కేవలం 34 మాత్రమే అధిక ఆదాయం కలిగిన దేశాల హోదాను పొందాయని, వీటిలో మూడో వంతుకు పైగా దేశాలు యూరోపియన్ యూనియన్‌లో విలీనం కారణంగానో లేదా చమురు ద్వారానో ప్రయోజనం పొందాయని వివరించింది.

నిటి ఆయోగ్ ఏం చెప్పింది?

2047 నాటికి భారత్ 3.36 ట్రిలియన్ డాలర్ల నుండి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని '2047 నాటికి వికసిత్ భారత్' పేరిట నిటి ఆయోగ్ ఇటీవల రూపొందించిన అప్రోచ్ పేపర్ తెలిపింది. తలసరి వార్షిక ఆదాయం 2,392 డాలర్ల నుండి 18,000 డాలర్లకు పెరుగుతుందని చెప్పింది.

వర్ధమాన దేశాలు ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని నివేదిక సూచించింది. అధిక ఆదాయం పొందుతున్న దేశంగా హోదా పొందాలంటే పెట్టుబడులు, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంపై దృష్టి పెట్టాలని ప్రతిపాదించింది. ప్రపంచ

ఆ మూడు అంశాలపై దృష్టి

నేతలను అనుసరించడం కంటే పరిధులు దాటి సొంత ఆలోచనలతో ముందుకు సాగాలని తెలిపింది. ఈ విధానాన్ని అవలంబించి దక్షిణ కొరియా విజయం సాధించిందని గుర్తు చేసింది. దాని తలసరి ఆదాయం 1960లో 1,200 డాలర్లు ఉంటే 2023 నాటికి 33,000 డాలర్లకు చేరిందని చెప్పింది.

మౌనమే సమాధానం

- ఐదేండ్లలో నిషేధానికి గురైన యూట్యూబ్ ఛానెల్‌ల సంఖ్యపై నోరు మెదపని కేంద్రం
- సభ్యుల ప్రశ్నలకు తగిన సమాధానాలివ్వలేని ప్రభుత్వం
- పత్రికా స్వేచ్ఛ, ఇంటర్నెట్ షట్‌డౌన్‌లపై ఆందోళనను తోసిపుచ్చిన మోడీ సర్కారు

న్యూఢిల్లీ : దేశంలో మోడీ పాలనలో పత్రికా స్వేచ్ఛ, ఇంటర్నెట్ షట్ డౌన్, యూట్యూబ్ ఛానెళ్లపై ఆంక్షలు అన్నీ ఇన్నీ కావు. ప్రజల గొంతును వినిపించి, ప్రభుత్వానికి ప్రతిపక్షంలా మారిన పత్రికలు, యూట్యూబ్ ఛానెళ్లపై కేంద్రం ఆది నుంచీ కక్షపూరితంగానే వ్యవహరిస్తున్నది. ఈ విషయంలో ఇటీవల పార్లమెంటు సమావేశాల్లోనూ చర్చ జరిగింది. అయితే, పార్లమెంటు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మాత్రం మోడీ సర్కారు తగిన సమాధానాలివ్వకుండా తప్పించుకున్నది.

మోడీ పాలనలోని గత ఐదేండ్లలో ప్రభుత్వం బ్లాక్ చేసిన యూట్యూబ్ ఛానెల్‌ల సంఖ్యపై కేంద్రం నుంచి ఎలాంటి సమాధానమూ రాలేదు. దీనికి సంబంధించిన డేటాను రాజ్యసభ ఎంపీ వివేక్ తంఖా అభ్యర్థించారు. అయితే కేంద్రం మాత్రం గణాంకాలు వెల్లడించకపోవటం గమనార్హం. గతనెల 22న ప్రారంభమైన పార్లమెంట్ ప్రస్తుత సెషన్‌లో పత్రికా స్వేచ్ఛ, సెన్సార్‌షిప్, ఇంటర్నెట్ షట్‌డౌన్‌కు సంబంధించిన అంశాలు వేడిని పెంచుతూనే ఉన్నాయి. లోక్‌సభ, రాజ్యసభలో కొనసాగుతున్న సెషన్‌లో పార్లమెంటు సభ్యులు (ఎంపీలు) అడిగిన ప్రశ్నల శ్రేణికి కేంద్రం విఫలమైన ప్రతిస్పందనలను అందించింది. కొత్త పార్లమెంట్ భవనం ఆవరణలోకి జర్నలిస్టుల ప్రవేశంపై విధించిన మీడియా ఆంక్షలపై జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేయటంతో పార్లమెంట్ వెలుపల కూడా పత్రికా స్వేచ్ఛ అంశం తెరపైకి వచ్చింది. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రకారం.. శాసనసభ్యులతో మాట్లాడకుండా నిరోధించటానికి పార్లమెంటు ఆవరణలో జర్నలిస్టుల కదలికలపై ఆంక్షలు విధించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ వివేక్ తంఖా.. గత ఐదేండ్లలో ఎన్ని యూట్యూబ్ ఛానెల్‌లను బ్లాక్ చేశారో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రశ్న వేశారు. దీనికి ప్రతిస్పందనగా కేంద్రం ఈ ప్రశ్నను పూర్తిగా తప్పించింది. అలాగే, వైసీపీ లోక్‌సభ ఎంపీ మిధున్‌రెడ్డి అడిగిన మరో ఆసక్తికరమైన ప్రశ్నకు కేంద్రం నుంచి సరైన సమాధానమూ రాలేదు. టెలికాం సేవల తాత్కాలిక సస్పెన్షన్ (పబ్లిక్ ఎమర్జెన్సీ లేదా పబ్లిక్ సేఫ్టీ) రూల్స్, 2017 ప్రకారం ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయటానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అధికారాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం మళ్లీ తప్పుదారి పట్టించింది. వ్యక్తిగతంగా ఇంటర్నెట్ సస్పెన్షన్‌కు సంబంధించి ప్రశ్నపై కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా తప్పించుకునే ప్రయత్నమే చేశారు.

కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ విజయకుమార్.. పత్రికా స్వేచ్ఛ సూచిక 2024లో భారత్ తక్కువ ర్యాంక్‌పై కేంద్రాన్ని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించటానికి ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుందని అడిగారు. పత్రికా స్వేచ్ఛ సూచిక 2024 ఎడిషన్‌లో పరిగణించబడిన 180 దేశాలలో దేశం 159వ స్థానంలో ఉందని ప్రభుత్వానికి తెలియదా? అని కూడా ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. అయితే, వాక్, భావప్రకటనా స్వేచ్ఛలో దిగజారుతున్న పరిస్థితుల గురించిన ఆందోళనలను ప్రభుత్వం తక్షణమే తోసిపుచ్చింది. "2014-15 నుంచి ఇప్పటి వరకు గత 10 సంవత్సరాలలో రిజిస్టర్డ్ పీరియాడికల్‌ల సంఖ్య 1,05,443 నుంచి 1,51,734కి, అంటే 43.9 శాతం పెరిగింది. అదేవిధంగా, ప్రయివేట్ శాటిలైట్ టీవీ ఛానెల్‌ల సంఖ్య కూడా ఈ కాలంలో 821 నుంచి 910కి గణనీయంగా పెరిగింది. ఇందులో 393 న్యూస్ ఛానెల్‌లు ఉన్నాయి" అని కేంద్రం బదులిచ్చింది.

317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జీవో 317పై మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యింది. శనివారం నాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హర్ మహేష్‌దత్ ఎక్కా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు శివశంకర్, బూసాని వెంకటేశ్వరరావు, ఉపసంఘ కమిటీ కన్సల్టెంట్, జాయింట్ సెక్రెటరీ సర్వీసెస్ జీ సునీతాదేవి, సహాయ కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. 317 జీవోలో స్థానికతకు సంబంధించి రెండు రకాల ప్రతిపాదనలను సాధారణ పరిపాలన శాఖ క్యాబినెట్ సబ్ కమిటీ ముందు ప్రతిపాదించింది. వీటిపై చర్చించి, ప్రతిపాదించిన అంశాలను సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌తో సంప్రదించి తుది నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించాలని నిర్ణయించారు. అలాగే జీవో 46కు సంబంధించిన అంశాలపై న్యాయ నిపుణులతో చర్చించారు. దీనిపైనా తుది నిర్ణయం తీసుకోలేదు.

నౌహెరా షేక్ నివాసంలో ఈడీ సోదాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

పెద్ద మొత్తంలో వడ్డీలు ఇస్తామంటూ వేల కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన హీరా గోల్డ్ కంపెనీ యజమాని నౌహెరా షేక్ నివాసంలో శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు నిర్వహించారు. నగరంలోని టోలీచౌకీలో గల ఆమె నివాసంలో ఈడీకి చెందిన ప్రత్యేక బృందాలు ఉదయం నుంచి పొద్దు పోయేంత వరకు సోదాలను సాగించాయి. గతంలోనే హీరా గోల్డ్ వేల కోట్ల రూపాయల డిపాజిట్లకు కుచ్చుటోపీ పెట్టిందని నగర నేర పరిశోధక విభాగం(సీసీఎస్) కేసు నమోదు చేయగా మనీలాండరింగ్ జరిగిందంటూ ఈ కేసును తర్వాత ఈడీ దర్యాప్తును చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నౌహెరా షేక్ అరెస్ట్ కావటం, తర్వాత బెయిల్‌పై విడుదల కావటం జరిగింది. కాగా, ఈ కేసు దర్యాప్తులో భాగంగా నౌహెరా షేక్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలను నిర్వహించారు. ఈ సోదాల్లో వెల్లడైన అంశాలపై ఈడీ అధికారులు తర్వాత పత్రికా ప్రకటనను విడుదల చేసే అవకాశమున్నది.

తల్లి హత్య కేసులో కొడుక్కి విముక్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మెదక్ జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవల్లికి చెందిన వృద్ధురాలి హత్య కేసులో ఆమె కొడుకు పోచయ్యకి హైకోర్టు విముక్తి కల్పించింది. సిద్ధిపేట కోర్టు పోచయ్యకు విధించిన యావజ్జీవ శిక్షను రద్దు చేసింది. 2013లో తల్లి హత్య కేసులో పోచయ్య అప్పటి నుంచి జైల్లో ఉన్నాడు. యావజ్జీవశిక్షను సవాలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తుల ద్విసభ్య ధర్మాసనం అనుమతించింది. 82 ఏండ్ల తల్లిని పోషించలేక పోచయ్య చంపేశాడన్న పోలీసుల చార్జిషీట్ ఆధారంగా కింది కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. ఆమె హత్య జరిగినప్పుడు ప్రత్యక్ష సాక్షులు లేరని హైకోర్టు పేర్కొంటూ ఆ శిక్షను రద్దు చేసింది. గ్రామస్తులు, డాక్టరు, దర్యాప్తు అధికారి సాక్ష్యాల మేరకు కింది కోర్టు తీర్పు చెప్పడాన్ని ఆక్షేపించింది. పంచనామా సాక్ష్యాలు పోచయ్యకు వ్యతిరేకంగా లేవని, అయినా ప్రత్యక్ష సాక్షులు ఒక్కరూ లేరని చెప్పింది. ఈ కేసులో పోచయ్యను విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది.

పాలస్తీనా ప్రజలపై

సామ్రాజ్యవాద దాడి ఖండించాలి

- దురాక్రమణకు నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ దేశవ్యాప్తంగా సంఘీభావం
- తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలి: వామపక్ష పార్టీలు సంఘీభావం

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో



పాలస్తీనా ప్రజలపై సామ్రాజ్యవాద దాడి ఖండించాలని ఎస్‌ఎఫ్‌ఐ పిలుపునిచ్చింది. వారిపై సామ్రాజ్యవాద-జియోనిస్ట్ దురాక్రమణకు నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ దేశవ్యాప్తంగా సంఘీభావ దినోత్సవాన్ని నిర్వహించింది. శనివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగిన సదస్సుకు పాలస్తీనా రాయబారి అద్నాన్ ముహమ్మద్ అబుల్హాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమెరికా సామ్రాజ్యవాదం మద్దతుతో ఇజ్రాయెల్ జియోనిస్ట్ శక్తులు పాలస్తీనా ప్రజలపై జరిపిన దాడి అన్ని హద్దులు దాటిందని అన్నారు. దీనిపై అమెరికా యూనివర్సిటీలతో సహా వెల్లువెత్తుతున్న నిరసనలు, ఆగ్రహం ఆశాజనకంగా ఉన్నాయని అన్నారు. క్యూబా రాయబారి ఆబెల్ అబల్లే, ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు విపి సాను, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, ఉపాధ్యక్షులు ప్రతీక్ ఉర్ రెహ్మాన్, సంగీత దాస్, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, సెక్రటేరియట్ మెంబర్ ఐషి ఘోష్ మాట్లాడారు.

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ ఎంఎల్ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి రవిరాయ్ మాట్లాడారు. తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని, ఇజ్రాయెల్‌పై సైనిక ఆంక్షలు విధించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బందా కరత్ మాట్లాడుతూ పాలస్తీనాకు ఎల్లప్పుడూ సంఘీభావం ఉంటుందని, ప్రజలు ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలని అన్నారు. పాలస్తీనాలోని పిల్లలు, ప్రజలపై అనాగరిక భయానక దాడి కొనసాగుతోందని అన్నారు. "భారత ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు సైనిక వస్తువులను సరఫరా చేయడానికి అన్ని లైసెన్సులను రద్దు చేయాలి. దేశంలో తయారు చేసిన డ్రోన్‌లు, పేలుడు పదార్థాలు పంపుతున్నారు. యుద్ధంలో, పాలస్తీనాపై మారణహోమంలో ఉపయోగిస్తున్నారు" అని ఆమె పేర్కొన్నారు. ఇజ్రాయెల్ నుంచి భారతదేశం కూడా సైనిక, భద్రతా పరికరాలను దిగుమతి చేసుకుంటోందని, ఇది ఇజ్రాయెల్ తన చర్యలలో ఆర్థికంగా సహాయపడుతుందని అన్నారు. పాలస్తీనా కార్మికుల స్థానంలో ఇజ్రాయిల్‌కు భారతీయ కార్మికులను పంపినందుకు ఆమె ప్రభుత్వాన్ని విమర్శించారు. "వేలాది మంది కార్మికులు ఇజ్రాయెల్‌కు పంపారు. ఇది ఇజ్రాయెల్ జియోనిస్ట్ ప్రభుత్వం వర్ణవివక్ష విధానానికి ప్రత్యక్ష మద్దతు" అని ఆమె విమర్శించారు. గాజాలో కొనసాగుతున్న దాడిని మతపరమైన యుద్ధంగా చిత్రీకరిస్తున్నారని, ఇది నిజం కాదని అన్నారు. ప్రపంచం చూసిన అత్యంత ఘోరమైన భయానక సంఘటనలలో భారతదేశం భాగస్వామిగా ఉందని విమర్శించారు.

రేషన్ కుంభకోణం కేసులో టీఎంసీ నేత అరెస్ట్

కోల్‌కతా : రేషన్ కుంభకోణం కేసులో తృణమూల్ కాంగ్రెస్ నేత అనిసౌర్ రెహమాన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్ట్ చేసినట్లు శుక్రవారం ఓ అధికారి తెలిపారు. నార్త్ 24 పరగణాల జిల్లాలోని బ్లాక్ అధ్యక్షుడైన అనిసౌర్ రెహమాన్, అతని సోదరుడినిగురువారం కోల్‌కతా కార్యాలయంలో సుమారు 14 గంటల పాటు ఇడి విచారించింది. అనంతరం అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రేషన్ పంపిణీ కుంభకోణంలో రెహమాన్, అతని సోదరుడు అరెస్టయ్యారు. వైద్య పరీక్షల అనంతరం వారిని సిటీ కోర్టులో హాజరుపరుస్తామని ఆ అధికారి తెలిపారు. ఇదే కేసులో అరెస్టయిన అటవీ శాఖ మాజీ మంత్రి జ్యోతిప్రియోకు రెహమాన్ అత్యంత సన్నిహితుడని అన్నారు.

రైస్‌మిల్ యజమాని, మంత్రి మరో అనుచరుడు బారిక్ బిస్వాస్‌కు కూడా సమన్లు జారీ చేశామని ఆ అధికారి పేర్కొన్నారు. మంగళవారం బిస్వాస్‌కు చెందిన నివాసం, రైస్‌మిల్లులో సోదాలు జరిపామని, రూ. 40 లక్షల నగదు, యుఎఇలోని ఆస్తులలో ఆయన పెట్టుబడులకు సంబంధించిన కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

డ్రగ్స్‌పై నియంత్రణకు

నైజీరియన్లపై టీజీన్యాబ్ అధికారుల డేగకన్ను

- కొందరి కోసం బెంగళూరు వెళ్లిన ప్రత్యేక బృందాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కొకైన్, హెరాయిన్ వంటి మాదక పదార్థాలను రవాణా చేస్తూ యువతను పెడదోవ పట్టిస్తున్న కొందరు నైజీరియన్లపై తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీజీ-న్యాబ్) అధికారులు డేగ కన్ను వేశారు. రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న నైజీరియన్లలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇటీవలన భారీ మొత్తంలో కొకైన్ డ్రగ్స్‌తో పట్టుబడినవారిలో నైజీరియన్లు ఎక్కువగా ఉండటం, వీరు విదేశాలతోపాటు గోవా, బెంగళూరు నగరాల నుంచి ఎక్కువగా ఈ డ్రగ్స్‌ను నగరానికి స్మగ్లింగ్ చేయటాన్ని పరిగణలోకి తీసుకున్న టీజీ న్యాబ్ అధికారులు వీరి కార్యకలాపాలను కట్టడి చేయటంపై నిశితంగా దృష్టిని సారించారు. వీరికి సహకరిస్తున్న స్థానిక యువకుల కదలికలపై కూడా నిఘాను పెంచారు. ముఖ్యంగా, బెంగళూరులోని ఒక కాలనీలో ఎక్కువగా నివసిస్తున్న నైజీరియన్లు తరచుగా డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడుతూ రాష్ట్రంలోని మాఫియాకు చేరవేస్తున్నారని టీజీ న్యాబ్ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా అందిన సమాచారం మేరకు బెంగళూరులోని కొందరు డ్రగ్స్ స్మగ్లర్లు అయిన నైజీరియన్లను పట్టుకోవటానికి ఒక ప్రత్యేక బృందం బయలుదేరినట్టు సమాచారం.

ప్రముఖ నృత్యకారిణి

యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

తెలుగు రాష్ట్రాల సీఎంలు సంతాపం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రముఖ భరతనాట్య, కూచిపూడి నర్తకి యామినీ కృష్ణమూర్తి కన్నుమూశారు. 84 ఏండ్ల ఆమె వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్నారు. ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. భరత నాట్యం, కూచిపూడి నృత్యంతో ఆమె భారతదేశఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపచేశారు. 1940లో ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో ఆమె జన్మించారు. క్షీరసాగర మధనంలో మోహినీగా, భామాకలాపంలో సత్యభామ, ఉషాపరిణయంలో ఉషగా, శశిరేఖాపరిణయంలో శశిరేఖగా ఆమె ఎన్నో నృత్యరూపకాల్లో పాత్రలను పోషించారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మ విభూషణ్ పురస్కారాలతో కేంద్ర ప్రభుత్వం యామినీ సరస్వతిని సత్కరించింది. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా సేవలందించారు. ఢిల్లీలో 'యామినీ స్కూల్ ఆఫ్ డ్యాన్స్' స్థాపించి ఎంతో మంది యువతకు భరత నాట్యం, కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చారు.

రేవంత్‌రెడ్డి, చంద్రబాబు సంతాపం

యామినీ కృష్ణమూర్తి మరణం పట్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఏ రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు వేర్వేరుగా సంతాపం తెలిపారు. అమెరికాలో ఉన్న రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి సంతాప సందేశం పంపారు. ఆమె భారతదేశం గర్వించదగిన గొప్ప నృత్యకారిణి అని కొనియాడారు. కళారంగంలో ఆమెలేని లోటును ఎవరూ తీర్చలేరన్నారు. ఎంతో మంది యువతకు



ఆమె నాట్యం నేర్పించి దేశంలోనే కళా రంగానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారని చెప్పారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైన్స్ ముందున్న ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్



నవతెలంగాణ- హయత్‌నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కామినేని నుండి మన్సూరాబాద్ చౌరస్తా వరకు ప్రతి నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. కొందరు పాదచారులు నడవడానికి వీలులేకుండా ఫూట్ పాత్‌లు సైతం కబ్జాదారుల పాలైంది.. దానికి ప్రధాన కారణం ఆ ప్రాంత పరిధిలో ఒక వైన్స్, బార్ దుకాణం ఉండడంతో పాటుగా కొన్ని హెూటల్ సముదాయాలు కూడా ఉండడం..దీంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. అంతేకాదు అటునుంచి మహిళలు నడుచుకుంటూ వెళ్లాలంటే జంకుతున్నారు. పోలీసులు ఏవిధమైన చర్యలు తీసుకుంటారో చూడాలి మరి..

'నవతెలంగాణ' ప్రజా సమస్యల పరిష్కార పత్రిక

నాగోల్ ఎస్ఐ శివ నాగ ప్రసాద్



నవతెలంగాణ-నాగోల్

నవతెలంగాణ దినపత్రిక ప్రజా సమస్యల పరిష్కార పత్రిక అని నాగోల్ ఎస్ఐ శివ నాగ ప్రసాద్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా ఆయన పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నవతెలంగాణ దినపత్రిక బడుగు, బలహీన వర్గాలకు, కార్మిక కర్షకుల పక్షాన నిలుస్తూ వారి సమస్యలను కథనాలుగా రాస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఇంకా ముమ్ముందు మరింత అభివృద్ధి చెందుతూ నవ తెలంగాణ దినపత్రిక ముందుకెళ్లాలని ఎస్ఐ శివనాగ ప్రసాద్ ఆకాక్షించారు.

ప్రజా గొంతుకగా నిలుస్తున్న 'నవతెలంగాణ'

- ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ- నాగోల్

నిజాలను నిర్భయంగా, నిస్పక్షపాతంగా వార్తా కథనాలను వెల్లడిస్తూ నవతెలంగాణ దినపత్రిక ఒక ప్రజా గొంతుకగా నిలుస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు.

9 వసంతాలు పూర్తిచేసుకుని పదవ వసంతంలోకి అడుగుడుతున్న సందర్భంగా ఆయన శనివారం నవ తెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, పాత్రికేయులకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతి అక్రమాలపై విశ్లేషించి వార్తా కథనాలను అందిస్తూ నవ తెలంగాణ దినపత్రిక ప్రజల్లో మమేకమైందన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వార్తా కథల రూపంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాటిని పరిష్కరించడంలో ఎనలేని కృషి చేస్తుందని కొనియాడారు. ఎలాంటి వ్యాపార దృక్పథం లేకుండా సమాజ శ్రేయస్సు కోసం నిర్భయంగా నిజాలను నిష్పక్షపాతంగా చాటుకుంటున్న నవతెలంగాణ దినపత్రిక ముమ్ముందు ఇలాంటి ఎన్నో వసంతాలను పూర్తి చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి





నవతెలంగాణ - బడంగ్‌పేట్

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 17వ డివిజన్ బాలాపూర్ పాత గ్రామంలో చేపట్టిన అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డితో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, నాయకులు ఎర్ర జైహింద్, బాలింగని జంగయ్య, గోరిగే శ్రీశైలం, టేకుల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ రామిడి భూమిరెడ్డి నగర్ కాలనీలో చేపట్టిన అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శనివారం కార్పొరేటర్ రామిడి మాధురి వీరకర్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, నాయకులు చప్పిడి సంతోష్ రెడ్డి, నవ్వారు మల్లారెడ్డి, కుంచె నాగేందర్ గౌడ్, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం, పచ్చదనం
కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు చేపట్టనున్న స్వచ్ఛదనం పచ్ఛదనం కార్యక్రమంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ జి.రఘు, డిఈఈ జ్యోతి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



- చిలుక ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్‌లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శివపురి కాలనీ, అపార్ట్మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు.. సీసీ కెమెరాలు, స్ట్రీట్ లైట్, ప్యాచ్ వర్క్ పనులను సొంత నిధులతో శనివారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్ రెడ్డిని శివ పురి కాలనీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా తన సొంత నిధులతో పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. సమస్య ఏది ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేసేందుకు ముందు ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామచంద్ర రెడ్డి, కిశోర్, శశి, రవీందర్, నరేందర్, శివాజీ, వాసు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, డాక్టర్ సూర్యశ్రీ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : కమిషనర్ వాణిరెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, కాలుష్య నియంత్రణకే వనమహెూత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీ 17వ వార్డులో వనమహెూత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహెూత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీధర్ గౌడ్, లక్ష్మీనారాయణ, మేనేజర్ జ్యోతి, ఏఈ అయేషా, రిటైర్డు అటవీ శాఖ అధికారి సుధీర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాని కళాశాలలో ఘనంగా బోనాల ఉత్సవాలు



నవతెలంగాణ - చైతన్యపురి

కొత్తపేటలోని శివాని మహిళా జూనియర్ కళాశాలలో బోనాల ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ డాక్టర్ పి. రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఎంతో ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తారని అన్నారు. విద్యార్థినులు, సిబ్బంది సాంప్రదాయ వస్తువులు ధరించి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ, కరస్పాండెంట్ వేదిరే సుదర్శన్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తా : కార్పొరేటర్

నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధి పద్మావతి కాలనీలోని వాసవి అపార్ట్మెంట్ నుండి పద్మావతి నగర్ కాలనీ రెండో గేటు వెళ్లే రోడ్డును కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. గుంతలు గుంతలుగా ఉన్న రోడ్డు వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వాసవీ అపార్ట్మెంట్లో మంచినీటి సమస్యను కూడా సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ కార్పొరేటర్ సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మావతి నగర్ కాలనీ వాసులు వాసవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తాం



శానిటేషన్ అధికారి యాదగిరి

నవతెలంగాణ- బడంగ్ పేట్

రోడ్లు, ఖాళీ స్థలాలలో చెత్త, చెదారం వేస్తే జరిమానా విధిస్తామని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ నిర్వహణ అధికారి యాదగిరి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం రోడ్డుపై బహిరంగంగా చెత్తను పడేస్తున్నటువంటి వ్యక్తికి రూ.500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ రఘుల ఆదేశాల మేరకు జరిమానాలను విధిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్లలోని అన్ని కాలనీల ప్రజలు ఎవరైనా సరే రోడ్లకు ఇరువైపుల, ఖాళీ స్థలాలు, ఓపెన్ నాలాలలో కుప్పలు తెప్పలుగా చెత్త, చెదారం వేస్తే జరిమానా విధించడం ఖాయమని హెచ్చరించారు. ప్రస్తుత వర్షా కాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.


ఉచిత హెూమియోపతి వైద్య శిబిరం



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ సీనియర్ సిటిజన్స్ భవనంలో ప్రభుత్వ హెూమియోపతి కళాశాల సీనియర్ డాక్టర్ అన్నపూర్ణ రామంతపూర్ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఐ కాలనీ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు పానుగంటి ప్రతాపరెడ్డి అధ్యక్షతన శనివారం ఉచిత హెూమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పానుగంటి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌సీఐ కాలనీ సీనియర్ సిటిజన్స్ భవనంలో ప్రతి నెల మొదటి శనివారం ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి ఎఫ్‌సీఐ కాలనీ, చుట్టు పక్కన గల కాలనీల నుండి దాదాపుగా 50 నుండి 60 మంది వస్తారని చెప్పారు. శిబిరానికి వచ్చిన ప్రజల యొక్క ఆరోగ్య సమస్యలను బట్టి వారికి ఒక నెల రోజులకు సరిపడ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ కాలనీ సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి రామ్నాథ్, ఉపాధ్యక్షుడు రఘుపతి రెడ్డి, హెూమియోపతి కళాశాల హౌస్ సర్జన్స్, వైద్య బృందం, సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో
ఉత్సాహంగా ట్విన్నింగ్ డ్రెస్ కాంపిటీషన్



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నారాయణ స్కూల్లో ఉత్సాహంగా ట్విన్నింగ్ డ్రెస్ కాంపిటీషన్‌ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్- చిల్డ్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు పెంపొందించడానికి ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. అందరిపట్ల స్నేహభావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రా బాబు, ఏవో మాధవి, ఏడి రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం చేయండి : సీపీఐ



నవతెలంగాణ-ఎల్బీనగర్

కేరళలో జరిగిన వరద బీభత్సంలో అనేక కుటుంబాలు మృతి చెందాయని, రోడ్డున పడ్డ అనేక కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ సరూర్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం వరద బాధితులకు సహాయం అందించాలని ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ మాట్లాడుతూ విరాళాలను సేకరించి జిల్లా పార్టీకి అందజేస్తామని తెలిపారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్, మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఫై మీద, సరూర్ నగర్ మండల ఏఐటీయూసీ కార్యదర్శి ఎం మదిలేటి, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి కమలమ్మ, సీపీఐ నాయకులు పూజారి శ్రీను, ఇదిరిస్ బాయ్, అనిత, హేమలత, పార్వతమ్మ, చాంద్ బి, మంజు ,నాగమ్మ మీసాల స్వామి, కేశవ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కరెంటు స్తంభాల సమస్యను పరిష్కరిస్తా

- కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

కరెంటు స్తంభాల సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పోలీస్ కాలనీ, సాహెబ్ నగర్ వీకర్ సెక్షన్ బస్తీలో కరెంటు స్తంభాలు లేక ఇబ్బందికరంగా ఉందని బస్తీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ శనివారం సంబంధిత ఎలక్ట్రికల్ ఏడీ రామచంద్రయ్యతో కలిసి బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే ఈ సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, పోలీస్ కాలనీ అధ్యక్షులు అజయ్ కుమార్, పెంటయ్య, ఎలక్ట్రికల్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నాయకులుగా తయారు కావాలి

- లార్డ్స్ విద్యాసంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప



నవతెలంగాణ - మీర్ పేట్

ప్రజల కోసం నిరంతరం కృషి చేసేందుకు మంచి నాయకులుగా తయారు కావాలని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లెలగూడ లార్డ్స్ పాఠశాలలో కౌన్సిల్ క్రౌనింగ్ సెరేమోనీ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరానికి కావాల్సిన మేటి నాయకులను తయారుచేయడానికి పాఠశాలలో విద్యార్థుల నుండే రావాలని కోరారు. పాఠశాలలో చదువుతో పాటు జీవితంలో ఎలా ఎదుగాలి అనే పాఠం కూడా నేర్పుతున్నట్లు పేర్కొన్నారు. నేటి తరంలో తల్లీదండ్రులు తమ పిల్లల్నీ ఇంజనీర్లు, డాక్టర్లుగా చూడాలనుకుంటున్నారు తప్పా.. ఎవ్వరూ కూడా తమ పిల్లలను రాజకీయ నాయకులుగా, టీచర్లుగా చూడాలనుకోవడం లేదన్నారు. రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం మా బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బేర్ల శ్రీనివాస్ రెడ్డి, సంస్థ డైరెక్టర్ సిద్దల శ్రీలత, డీన్ సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ఎంఎల్ మరియన్, ఉపాధ్యాయులు, తల్లీదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హయత్ నగర్ మెగా సిటీ స్కూల్‌లో బోనాలు



నవతెలంగాణ - హయత్‌నగర్

హయత్‌నగర్ డివిజన్ పరిధిలో ఉన్న మెగా సిటీ పాఠశాలలో బోనాల పండుగ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ స్కూల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పోతురాజుల వేషాధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపాల్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



నవతెలంగాణ - చంపాపేట్

ఆర్థికంగా వెనుకబడి ఉన్న మహిళలకు చైతన్య మహిళా మండలి ఫౌండర్ డైరెక్టర్ జయ సింగ్ థామస్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లను శనివారం అందజేశారు. ఈ మేరకు శనివారం ఆమె మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ కావ్వగూడ పరిధిలో 181 మంది శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్స్, కుట్టుమిషన్లు అందజేసినట్టు తెలిపారు. నిరుపేద మహిళలు స్వయం ఉపాధితో రాణించాలంటే వృత్తి, నైపుణ్యం, అభివృద్ధి, శిక్షణ, ఉచిత కల్పన కార్యక్రమాలు చేపట్టేందుకు ఉషా కుట్టు మిషన్ అండగా ఉంటుందన్నారు. గత ఆర్థిక సంవత్సరం 550 మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధితో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ శ్రీ చైతన్య పాఠశాలలో ఎన్నికలు

నవతెలంగాణ - చంపాపేట్

కర్మన్‌ఘాట్ శ్రీ చైతన్య టెక్నో పాఠశాల యందు విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఇలా ఎన్నికలు నిర్వహించడం వలన విద్యార్థులకు ఓటు విలువ తెలిసి, భవిష్యత్తులో వారు సమాజంలో ఎలా మెలగాలి, నాయకత్వ లక్షణాలు ఎలా ఉంటాయి అని తెలపడమే ఈ ఎన్నికల నిర్వహణ ముఖ్య ఉద్దేశం. ఈ ఎన్నికలలో గెలుపొందిన విద్యార్థులకు వారి వారి శాఖలకు చెందిన గుర్తులతో బ్యాడ్జీలు అందజేశారు. ప్రిన్సిపాల్ మాధవి విద్యార్థులచే ప్రమాణం చేయించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎజియం. సతీష్, ఆర్ ఐరవందర్ రెడ్డి, కోఆర్డినేటర్ రఘువంశీ, ప్రిన్సిపాల్ ఫణి మాధవి, వైస్ ప్రిన్సిపాల్ సుందర్సంగ్, డీన్ వెంకట రమణ, పాఠశాల ఐకాన్ ఇంచార్జి సతీష్, సీ బ్యాచ్ ఇంచార్జి సంధ్య, ప్రైమర ఇంచార్జి లక్ష, ప్రీ ప్రైమరీ ఇంచార్జి పద్మావతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



బాక్స్ డ్రయినేజీ పనుల పరిశీలన



నవతెలంగాణ- మల్కాజిగిరి

మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో కొనసాగుతున్న బాక్స్ డ్రయినేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ శనివారం ఈఈ లక్ష్మణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంజీరా వాటర్ పొల్యూట్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ పరిశీలనలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, జలమండలి మేనజర్ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్, సంపత్ రావు, లైన్మెన్లు పాల్గొన్నారు.

నాచారం వెస్లీ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-కాప్రా

నాచారం వెస్లీ స్కూల్లో ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తర్వాత వెస్లీ స్కూల్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ- కాప్రా

చిన్నతనం నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విద్యార్థులకు సూచించారు. నాచారం ఇందిరా హై స్కూల్ లో ఇన్వెస్టిట్యూర్ సరమని ఘనంగా నిర్వహించారు. ముందుగా నృత్య ప్రదర్శనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ శాంతి సాయజెన్ శేఖర్, నాచారం ఎస్ఐ మెహబూబ్ అలీతో ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అన్వర్ మోహినుద్దీన్, అఫ్సర్ మోహినుద్దీన్, ప్రిన్సిపాల్ షేహనాజ్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ అయేషా, పీఈటీ శేఖర్, టీచర్స్, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మా గ్రామాలను యాదాద్రి జిల్లాలో కలపొద్దు

- బీజేపీ నాయకులు మచ్చేందర్ రెడ్డి
- మేడ్చల్ జిల్లాలోనే కొనసాగించాలని మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ - ఘట్కేసర్ రూరల్

ఘట్కేసర్ మండలంలోని ఔషపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలను యాదాద్రి భువనగిరి జిల్లాలో కలపొద్దని పంచాయతీరాజ్ మంత్రివర్యులు సీతక్క (అనసూయ)కు బీజేపీ నాయకులు ఏనుగు మచ్చేందర్ రెడ్డి శనివారం స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘట్కేసర్ మున్సిపాలిటీలో కలపాలని లేదంటే మండలాన్ని కొనసాగించాలని కోరారు. కక్షపూరిత రాజకీయాలకు తావు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. వినతి అందజేసిన వారిలో మచ్చ సందీప్ నేత, కాసుల వెంకటేష్ గౌడ్, మహేష్, గుమ్మడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి





నవతెలంగాణ - మల్కాజిగిరి

సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్దం పరశురామ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు జె ఏ.సి వెంకన్న, రాము యాదవ్, అమీనుద్దీన్, భాగ్యనందు రావు జే.కే. సాయి గౌడ్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నేరేడ్ మెట్

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య చికిత్స కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శనివారం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులు నేరేడ్ మెట్ డివిజన్‌కు చెందిన ఈశ్వర్‌కు 28 వేల 5 వందలు, నిఖిల్ కు 60 వేల రూపాయల చెక్కులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, రాము యాదవ్, జేఏసీ వెంకన్న, జె కె సాయి గౌడ్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం : శ్రీకాంత్ యాదవ్



నవతెలంగాణ- జవహర్ నగర్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్ నివాసి సదానందంకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసీ 1,50,000 వేల రూపాయల చెక్కును టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, సీనియర్ నాయకులు, ఎర్రగుండ్ల వెంకటేశ్వర్లు, సోమ నర్సింగరావు ముదిరాజ్ పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్స్ ఫౌండర్, చైర్మెన్ ముమైత్ ఖాన్ దంపతులకు సన్మానం



నవతెలంగాణ-నేరేడ్ మెట్

ఆరాధన కల్చరల్ అసోసియేషన్ 29వ వార్షికోత్సవం సందర్భంగా గానసభలో విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం అనే కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలుగా సమాజంలో వికలాంగుల కోసం ఎనలేని సేవ చేస్తున్న వారి సేవకు గుర్తింపుగా హెలెన్ కెల్లర్స్ ఫౌండర్, చైర్మెన్ ఉమరా?న్ దంపతులను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి చేతుల మీదగా ఘనంగా సన్మానించారు. అనంతరం హియరింగ్ ఇంపైర్డ్ స్టూడెంట్స్ ఆఫ్ హెలెన్ కెల్లర్స్ స్కూల్ విద్యార్థులు అలరించిన సంస్కృత కార్యక్రమాలు సబికులను ఎంతో అలరించాయి.

పీవీ పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ -మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని పాపారాయ విద్యానికేతన్ స్కూల్‌లో శనివారం మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ శిబిరంలో కంటి, డెంటల్, జనరల్ సర్జన్‌కు సంబంధించి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల దృష్ట్యా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, మేడ్చల్ మండలం ప్రైవేట్ పాఠశాలల ప్రెసిడెంట్ గిరిబాబు, అడ్వైజర్ పాండు, పాఠశాల యాజమాన్యం రామేశ్వర్ రెడ్డి, నరసింహ గౌడ్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, వైద్యులు పాల్గొన్నారు.





పలు కూడళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - కాప్రా

నానక్ రాంగూడ, కొండాపూర్‌లోని పలు కూడళ్లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి శనివారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎలిఫెంట్ సర్కిల్ కూడలి వద్ద మహనీయుల విగ్రహాల ముందు కూడలిని అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేసేందుకు రూ.కోటి పదమూడు లక్షల రూపాయలు, రామానుజ సర్కిల్ కోసం అరవై అయిదు లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఎలిఫెంట్ సర్కిల్ వద్ద కూడలిని కూడా పచ్చదనంతో అందమైన గార్డెనింగ్, స్కల్ప్చర్స్, ఫూట్ పాత్ తదితర అంశాలతో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిలాల్, డీఈ రూపా, ఏఈ స్రవంతి, స్థానిక నాయకులు తాండవాసు గౌడ్, పైళ్ల ప్రవీణ్ కుమార్, దూల్మిట్ట దయాకర్ రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



నవతెలంగాణ- కాప్రా

లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా ఏఎస్‌రావు నగర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుషాయిగూడలోని వెంకటేశ్వర టెంపుల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వీరేశం లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను అభినందించారు. అవసరమైన పేదలకు మరిన్ని సేవలను అందించాలని కోరారు. కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డాక్టర్ అనిల్ బృందం.. 152 మందికి కళ్ళ పరీక్షలు, పద్మ సాయి క్లినిక్ డాక్టర్ దినేష్ బృందం దంత పరీక్షలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం .శ్రీదేవి, కార్యదర్శి చనమోలు వరప్రసాద్, సభ్యులు సునీల్ కుమార్, విజయకుమార్, జోన్ చైర్మెన్ మురళీచారి, ఆలయ కమిటీ సభ్యులు రఘు గౌడ్, శ్రీనివాస గౌడ్, చారి, పరిజాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్యమిత్రుల ఆత్మీయ కలయిక



నవతెలంగాణ- హైదరాబాద్

బాల్య మిత్రుల ఆత్మీయ కలయిక లియోనియా రిసార్ట్స్‌లో శనివారం జరిగింది. దాదాపు 55 సంవత్సరముల కిందట ఆంధ్రప్రదేశ్ అమలాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న బాల్య స్నేహితులు అందరూ కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తర్వాత గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ప్రతి సంవత్సరము ఒకసారైనా కలుసుకుందామని అభిప్రాయపడ్డారు. ఈ ఆత్మీయ కలయిక మాచి రాజు జోగిరాజు భుజస్కందాల పైన వేసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిముషకవి సూర్యనారాయణ, ఎర్రమిల్లి సత్యనారాయణమూర్తి నరసింహ శాస్త్రి, శ్రీనివాస్, శర్మ బాలాజీ పురుషోత్తం, రామన్న మిత్ర బృందం పాల్గొన్నారు.

చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైల్ అదాలత్

నవతెలంగాణ- కాప్రా

చర్లపల్లి కేంద్ర కారాగారం ప్రాంగణంలో జైల్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం 14 కేసులు పరిష్కరించి.. 12 మంది ఖైదీలకు విముక్తి కలిగించడం జరిగినది. అదేవిధంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలో మొత్తం 70 కేసులను పరిష్కరించి.. 39 మంది ఖైదీలకు విముక్తి కలిగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జి. సాయి శరత్ గౌరవ VIవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎల్బీనగర్, ఎస్ఆర్ దిలీప్ కుమార్ నాయక్, IX వ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, జి. నిష్కా పాత్రుడు IV AJCJ CUM IV AMM LB Nagar, కేంద్ర కారకార పర్యవేక్షణ అధికారి వారు సంతోష్ కుమార్ రాయ్, ఉప పర్యవేక్షణ అధికారి జైలర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పూడూరును గ్రామ పంచాయతీగానే కొనసాగించాలి

మాజీ సర్పంచ్ బాబు యాదవ్

నవతెలంగాణ- మేడ్చల్



పూడూరు గ్రామాన్ని మేడ్చల్ మున్సిపాలిటీ ఆ తర్వాత జీహెచ్ఎంసీలో కలపొద్దని కోరుతూ శనివారం మాజీ సర్పంచ్ బాబు యాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ గత నెల 26వ తేదీన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ మేమో 5924/ఏంఏ 2024 ద్వారా జారీ చేసిన ఉత్తర్వులలో జీహెచ్ఎంసీ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న గ్రామాలను జీహెచ్ఎంసీలో కలుపుతున్నట్లు తెలిపారని అన్నారు. పూడూరు గ్రామం ఔటర్ రింగ్ రోడ్డుకు బయట ఉందని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయం తీసుకోలేదని తెలియజేశారు .గ్రామపంచాయతీలో ఇటీవల మహిళా గ్రామ సభ పేరుతో స్వయం సహాయక సంఘాల లోన్స్ గురించి సమావేశం ఏర్పాటు చేసి విలీనం గురించి తీర్మానం చేశారని గుర్తుచేశారు. సమావేశంలో కొద్దిమంది మహిళలు మాత్రమే పాల్గొన్నారని వివరించారు. మెజార్టీ గ్రామ ప్రజలు ఎవరు ఈ సమావేశంలో పాల్గొనలేదని చెప్పారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సమయం ముగిసిన తర్వాత ఈ తీర్మానాన్ని తెలియజేశారు .పూడూరును గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని.. లేని పక్షంలో తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



- మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్

నవతెలంగాణ-కీసర

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ లోని 14వ వార్డు శివ శంకర్ నగర్ కాలనీలో పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని కోరారు. మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్ర రెడ్డి, వైస్ చైర్మెన్ శ్రీ.బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి రాజేందర్ కుమార్, 14వ వార్డు కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ , కౌన్సిలర్ బుద్ధవరం తిరువెంగళ లక్ష్మి, కౌన్సిలర్ అన్నమరాజు లావణ్య ,బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రం రెడ్డి ,నాగారం మున్సిపల్ అధ్యక్షుడు వేణు ,బీజేపీ నాయకులు అక్కల సురేష్ ,జూపల్లి నరేష్ ,కౌకుంట్ల రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ పటిమ అలవర్చాలి

- పల్లవి స్కూల్ డైరెక్టర్ సుశీల్ కుమార్



నవతెలంగాణ-బోడుప్పల్

విద్యార్థులకు చిన్న నాటి నుండే నాయకత్వ పటిమ అలవర్చాలని పల్లవి స్కూల్ డైరెక్టర్ సుశీల్ కుమార్ అన్నారు. బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ సుశీల్ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ తనూజ అధ్వర్యంలో శనివారం విద్యార్థి నాయకుల పదవీ స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమాండింగ్ ఆఫీసర్ తెలంగాణ 1వ ఎన్సిసి యూనిట్ కల్నల్ ప్రసూనాథ్ పాల్గొన్నారు. దీపప్రజ్వలన చేసి అతిథులందరిని స్వాగతిస్తూ చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. తదనంతరం ముఖ్య అతిథులు విద్యార్థి నాయకులకు నాయకత్వ బాధ్యతలను అప్పగిస్తూ వారికి బ్యాడ్జిలను బహుకరించారు. ఆ తరువాత పాఠశాల పేరు నిలిపే విధంగా క్రమశిక్షణతో ప్రవర్తిస్తూ, బాధ్యతాయుతంగా నాయకుల వలె మెలుగుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం ముఖ్య అతిథులకు విద్యార్థులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భముగా కల్నల్ ప్రసూనాథ్ మాట్లాడుతూ సమాజంలోని పరిస్థితులను బట్టి విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. జీవితంలో పైకి రావాలంటే ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవలసి వస్తుందని, వాటినన్నింటిని అధికమిస్తూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలియజేశారు. విద్యార్థులందరూ లక్ష్య సాధనతో ముందుకు వెళ్లాలని తెలియజేశారు. ఈ సందర్భముగా పాఠశాల డైరెక్టర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి నాయకులను అభినందించారు. ఈ సందర్భముగా వారు నిర్వర్తించవలసిన బాధ్యతలను తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సత్కరించారు.

స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని వినతి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

స్మశాన వాటికను పరిశీలించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలని ఓల్డ్ నేరేడ్‌మెట్ న్యూ విద్యా నగర్ వాసులు, జె కె సాయి గౌడ్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని న్యూ నేరేడ్ మెట్ గౌడ్ సంఘం కమిటీ సభ్యులు మర్యాదపూర్వంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కొన్ని కారణాల వల్ల స్మశాన వాటిక అభివృద్ధి జరగటం ఆగిపోయిందని, ఆ తర్వాత జిహెచ్ఎంసి అధికారులు కూడా పట్టించుకోలేదని, మీ చొరవతో స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వీలైన త్వరలోనే సంబంధిత జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి స్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ నేరేడ్ మెట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిఆర్ నరసింహ, జె జై రాం, మధు, కే శ్రీధర్, జీడి శ్రీధర్, అభిషేక్, పవన్, టివి నరేందర్, ఎన్ గణేష్, జె జయరామ్, జె సాయి, జె లక్ష్మణ్, జి జగదీష్, ఈశ్వర్, ఎం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ - కీసర

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ 20 వార్డు లోని గోపికృష్ణ కాలనీ ఆలయము వద్ద మున్సిపల్ నిధులు రూ.7 లక్షలతో సాయిబాబా ఇంటినుండి ప్రకాశ్ ఇంటి వరకు డ్రైనేజ్ పనులు, వైకుంఠ దామం వద్ద నరసింహ యాదవ్ ఇంటి నుండి శిల్పి శ్రీనివాస్ ఇంటి వరకు సీసీ రోడ్ నిర్మాణ పనులను చైర్మెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్ర సురేష్ కార్యాలయము వద్ద మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుమిత్ర సురేష్, 20వ వార్డు అధ్యక్షులు రామారావు, కాలనీ అధ్యక్షులు కొమురయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, గౌరవ అధ్యక్షులు శిల్పి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్త, వైస్ ప్రెసిడెంట్లు సరళ రవికాంత్, సాయిబాబా, శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి నర్సింగ్ రావు, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్‌కు చెందిన, పి.సామ్యూల్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా, రూపాయలు రెండు లక్షల ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజక వర్గాని కి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని కలిసి పలు వినతులు, ఆహ్వానాలు అందజేశారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన పనులను

ప్రజలు సమస్యలతో అల్లాడిపోతున్నారు

- అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజలు సమస్యలతో అల్లడిల్లిపోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్‌తో పాటు మున్సిపల్, జల మండలి, ఇరిగేషన్ విభాగాల అధికారులతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డివిజన్ పరిధిలోని యూసఫ్ నగర్, సబ్దర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లో పర్యటించారు. స్థానికులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులను అడిగి ప్రజా సమస్యలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోనని ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. యూసఫ్ నగర్, సబ్దార్ నగర్లో డ్రయినేజీలు పొంగిపొర్లు పోవడం, రోడ్లు సరిగా లేకపోవడం, సమయానికి త్రాగు నీరు రాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. రాజీవ్ గాంధీ నగర్‌లో వర్షాలు వచ్చినప్పుడు డ్రయినేజీలు పొంగి పొర్లడం ఇళ్లలోకి మురుగునీరు వర్షపునీరు వచ్చి చేరడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పైప్ లైన్ నిర్మాణంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అధికారుల పనులకు స్థానికులు అడ్డుపడరాదని, లింక్ రోడ్ల నిర్మాణం కోసం స్థలం వదిలి పైప్ లైన్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రాజీవ్ గాంధీ నగర్, సబ్దార్ నగర్‌ల్లో కరెంటు పోల్స్ ఏర్పాటు చేయాలనీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్ అధికారులు లక్ష్మి నారాయణ, ప్రకాష్, రంజిత్, భాస్కర్, నాయకులు గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం

- కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం
- ఈనెల 5-9వ తేదీ వరకు నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వచ్ఛదనం-పచ్చదనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం పల్లె, పట్టణ ప్రగతి పేరిట 11 రోజుల పాటు ప్రజల వద్దకు వెళ్లింది. కాంగ్రెస్ సర్కారు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించ తలపెట్టింది. 5 రోజుల్లో ఏయే రోజు ఏయే కార్యక్రమం నిర్వహించాలనే దానిపై ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. గురువారం ఈ విషయమై చీఫ్ సెక్రెటరీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సైతం నిర్వహించి కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పంచాయతీ శాఖ సమాయత్తమవుతోంది.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

5వ తేదీ (మొదటి రోజు)

స్థానిక నాయకులు, యువజన, స్వయం సహాయక సంఘాలు, వార్డు కమిటీలతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సమావేశాల్లో వీధి కుక్కల బెడద, తడి పొడి చెత్తను వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీ, తోటల పెంపకం, పారిశుధ్యం వంటి వాటిపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ నిషేధం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్ల, ఇతర ప్రదేశాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు.

6వ తేదీ (రెండో రోజు)

తాగునీరు, వర్షపు నీటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవడం, తాగు నీటి వనరులు శుభ్ర పరచడం, క్లోరినేషన్ చేయడం, నీటిని పరీక్ష చేయుటం లాంటివి చేపడతారు. చెరువులు, కుంటలను సందర్శించి మరమ్మతులకు ప్రణాళికలు తయారు చేయడం. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారు.

7వ తేదీ (మూడో రోజు)

గ్రామాలు, పట్టణాల్లో నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి, వాటిని పూడ్చటం, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకుంటారు. డ్రయినేజీ నీరు నిలిచే చివరి ప్రాంతంలో సామాజిక కాంకుడు, గుంతలను ఏర్పాటు చేయడం, వాటర్ ట్యాంకులు, బోరు బావులు, నల్లాల వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటారు.

8వ తేదీ (నాలుగో రోజు)

వీధి కుక్కల సంచారంపై దృష్టి పెట్టడం. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే దాని గురించి నిర్ణయం తీసుకుంటారు, డెంగీ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడటంతోపాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో ఫీవర్ సర్వేలు నిర్వహించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, యాంటీ లార్వా, ఆయిల్ బాల్స్ తయారీపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

9వ తేదీ (ఐదో రోజు)

కార్యక్రమం చివరి రోజు శుక్రవారం అన్ని కుటుంబాలు, ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు సైతం డ్రై డేను పాటించాలి. నీటి నిల్వ కనిపించే ప్రతి ప్రదేశం, ప్రతి వస్తువును శుభ్రం చేయించాలి. వీటితోపాటు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలి. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి. ప్రభుత్వ, విద్యా సంస్థలను ఇందులో భాగస్వాములు చేయడం వంటివి నిర్వహిస్తారు.



నిధుల మాటేంటి..?

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అందుకు తగ్గ నిధులు ఉండాలి. నిధులు లేకపోతే క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు పొందడం కష్టం. గత ప్రభుత్వం నిర్వహించిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమం, ప్రస్తుత సర్కారు నిర్వహించిన ప్రజా పాలనకు నిధులు విడుదల చేయకపోవడంతో కింది స్థాయి ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సొంత డబ్బులు, అప్పు చేసి కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత ఇందుకు సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు. ప్రస్తుతం సర్పంచులు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం బాధ్యత ప్రత్యేక అధికారుల పై పడింది. ఈ కార్యక్రమం సక్సెస్ కావాలంటే ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం



- ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 5 మంది లబ్దిదారులకు ద్వారా మంజూరైన, రూ.1,68,500 ఆర్థిక సహాయానికి సంబంధించిన, సీఎంఆర్ఎఫ్ చెక్కులను కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి బాధిత కుటుంబాలకి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజే శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్య మంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని అన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ.. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని పేర్కొన్నారు. అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా.. సీఎం సహాయ నిధి ఆర్థిక భరో సా నిస్తుందని ఎమ్మెల్యే తెలియచేశారు. ఈ సందర్భంగా బాధితుల కుటుంబ సభ్యులు వైద్య చికిత్సకి సహకారం అందించిన ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేష్ ముదిరాజు, మంత్రిప్రగడ సత్యనారాయణ, కాశినాథ్ యాదవ్, శివరాజు గౌడ్, మల్లేష్, వినోద్, వేణు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌లున్నారు.

అసంపూర్తి పనులు త్వరలోనే పూర్తి చేస్తా



- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. శనివారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి, చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనుల పై ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్ సంతులిత, సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పరిగణలోకి తీసుకోని కాలనీలలో స్వయం గా ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుంచి సమస్యలను తెలుసుకొని సత్వర పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. జల వాయు విహార్, హెచ్ఎంటీ హిల్స్, హెచ్ఎంటీ శాతవాహన నగర్ కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు భీముని కుంట చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలను తీసుకుంటామన్నారు. ప్రత్యేక పైప్ లైన్ ద్వారా మురుగు నీరు మళ్లింపు చర్యలను త్వరలోనే చేపట్టి చెరువు కలుషితం కాకుండా చేసి, చెరువును సుందరవనంగా తీర్చిదిద్దుతామన్నారు. భీమునికుంట చెరువు అలుగును పరిశీలించి అలుగు వద్ద చెత్త, చెదా రం పెరుకుపోవడం వలన నీటి ప్రవాహం సాఫీగా సాగక మురుగు నీటి వ్యవస్థతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. కాలనీలో డ్రయినేజీ, రోడ్లు, మంచినీరు, వీధి దీపాలు, ఎలక్ట్రికల్ సంభందిత సమస్యలను శాశ్వత పరిష్కారం చూపుతామని త్వరలోనే పనులు ప్రారంభించి కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈవిశ్వం, వర్క్ ఇన్ స్పెక్టర్లు మహాదేవ్, రతన్ నాయక్, కాలనీ వాసులు పాల్, సుబ్బయ్య, ఎన్వి ఎ.రాజు, లక్ష్మీ రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులకు కల్పించేలా కృషి..

ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా కృషి చేస్తానని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని హైదర్ నగర్‌లో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పునరుద్ధరణ నిర్మాణ పనులలో భాగంగా బోర్ వెల్ పనులను డివిజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హైదర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించబోయే భవనం నిర్మాణ పనులలో భాగంగా బోర్ వెల్ పనులను ప్రారంభించు కోవడం చాలా సంతోషకర మన్నారు. పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రభు త్వ పాఠశాలలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. పిల్లలకు చదువుకోవడానికి వీలుగా అనువైన చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూ డదని, అదనపు తరగతి గదుల నిర్మాణము పై కాంట్రాక్టర్‌కు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, కాంట్రాక్టర్ మురహరి రావు, స్థానిక కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఈపీఎఫ్ పెన్షనర్ల చలో ఢిల్లీ ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-దుండిగల్

కేంద్ర ప్రభుత్వం సంవత్సరాలతరబడి ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్య పరిష్కరించడం లేదని ఈపీఎఫ్ 95పెన్షనర్ల పట్ల వివక్ష కొనసాగిస్తున్నదని అపరిష్కృతంగా నెలకొన్న ఈసమస్య పరిస్కారం కోసం జాతీయ కోఆర్డినేషన్ కమిటీ పిలుపు నిచ్చారు. ఈ నెల 6,7,8, తేదిలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ మైదానంలో దేశ వ్యాప్తంగా పెన్షనర్లు పాల్గొంటున్నారు. మన తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భారీఎత్తున ఆదివారం బయలు దేరెందుకు సమయాత్తం అయ్యామని కూకట్‌పల్లి ఏరియా కమిటీ అధ్యక్షులు ఎల్ వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శంకర్ రావులు శనివారం ప్రగతి నగర్‌లో ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ల ప్రధాన డిమాండ్స్‌లో భాగంగా కనీ స పెన్షన్ రూ. 9000 లుగా నిర్ణంచాలని, పెరుగుచున్న ధరలకు అనుగుణంగా కరువు బత్యం చెల్లించాలని తెలిపారు. ఈపీఎఫ్ పెన్షనర్లకు ఆరోగ్య పరిరక్షణ పథకం ప్రవేశపెట్టిఉచిత వైద్యం అందించాలని కేంద్ర ప్రభుత్వంతము ఉద్యోగుల పే కమిషన్ ప్రకటించిన ప్రతి సారి ఈపీఎఫ్ పెన్షనర్లకు సైతం సమాన నిష్పత్తిలో పెన్షన్ పెంచాలన్నారు. ఈపీఎఫ్ పెన్షన్ చెల్లించడానికి వేతన సీలింగ్ ఎత్తి వేయాలని పేర్కొన్నారు. భగత్ సింగ్ కోషియార్ కమిటీ సిఫారసులను అమలు పర్చాలన్నారు.1-9-2014తరువాత రిటైర్డ్ అయిన వారికీ రూ. 15000 లు పై బడిన వేతనం 1.16 శాతం ప్రభుత్వమే చెల్లించాలి.. హయ్యర్ పెన్షన్‌కు అర్హత వారందరికీ సుప్రీం కోర్ట్ తీర్పు అమలు చేయాలనీ తెలిపారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలి



- డిపో మేనేజర్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల బస్ డిపో నుంచి సికింద్రాబాద్, వివిధ రూట్‌లో బస్సులు నడపాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. శనివారం ఈ మేరకు జీడిమెట్ల డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 29ఆర్, 32ఏ, 9ఎక్స్, 9 కె రూట్లల్లో..పెరుగుతున్న జనాభా దృశ్య బస్సులను పెంచకపోగా.. ఉన్న వాటిని తగ్గించడం వల్ల నిత్యం వందల మంది ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రాకపోకలు సాగిస్తున్నారని, సమయానుకూలంగా బస్సులు లేక ప్రజలు విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల ఏర్పాటుకు డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఏరియా కమిటీ సభ్యుడు గుబ్బల లక్ష్మీనారాయణ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు హరిబాబు యాదవ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ పూర్ణచంద్రగుప్త, సీనియర్ నాయకులు పి.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టార్టప్ ఫండింగ్ సదస్సు



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్టార్టప్ ఫండింగ్, వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ అనే అంశంపై విద్యార్థులకు సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత మాట్లాడుతూ విద్యార్థుల మొదటి ప్రాధాన్యత ఎంటర్ ప్రెన్యూర్‌గా ఎదగడానికి ఉండాలి అని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ ఆలోచనలతో ముందుకు వస్తే సహాయ సహకారాలు అందించడానికి చాలా కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఫండ్ రైసింగ్ చేస్తాయని సూచించారు. కార్యక్రమ ముఖ్య అతిథి డా.గౌరవ్ గుప్తా, స్టార్ట్ అప్ ఎకో సిస్టం ఎనేబుల్ మేనేజర్, ఏఐసి, టి-హబ్ మాట్లాడుతూ ఏదైనా ఒక ప్రోడక్ట్ ను మనం ప్రజల్లోకి తీసుకెళ్లేటప్పుడు దాన్ని ప్రజలకు ఎలా అందించాల అనేది ముఖ్యం. సాధారణంగా ఒక కొత్త ఉత్పత్తి మార్కెట్లోకి తీసుకొని వచ్చినప్పుడు వ్యక్తి ఆలోచనకు అనుగుణంగా ఎంటర్ ప్రెన్యూర్ ఆలోచిస్తారని, దీర్ఘ కాలిక దృష్టి, అధిక లాభాలను పొందటానికి ప్రయత్నిస్తాడని సూచించారు. పంట పొలాలలో క్రిమిసంహారక మందులు పిచికారి చేయడానికి రైతులకు ఎక్కువ సమయం పడుతుంది. దీనికి అనుగుణంగా ఒక ఎంటర్ ప్రిన్యూర్ ఆలోచించి డ్రోన్స్ తయారుచేసి వాటి ద్వారా క్రిమిసంహారక మందులు పిచికారి చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పనిని చేయవచ్చని సూచించారు. గాడిద పాల ద్వారా సబ్బులు, సౌందర్య సాధనాలను తయారు చేస్తూ ఉన్న ఒక మహిళ ఎంటర్ ప్రెన్యూర్ గురించి వివరించారు. వరి గడ్డిని పుట్టగొడు గులు తయారు చేయడం ద్వారా వరిగడ్డిని కలిస్తే వచ్చే కాలుష్యాన్ని నివారించవచ్చు అని ఈ పుట్టగొడుగులు పెంపకం ద్వారా ఎంటర్ ప్రెన్యూరుగా కెరియర్ ప్రారంభించవచ్చని సూచించారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ విభాగంలోను స్టార్ట్ అప్‌గా ఎలా ప్రారంభించ వచ్చునో విద్యార్థులకు విపులంగా వివరించారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో 78 ఇంకుబెటర్ రిజిస్టర్ అయి ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు వాటి యొక్క ప్రాముఖ్యత వివరిం చారు. స్టార్ట్ అప్ కు సహాయ సహకారాలు అందించే పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలను విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పిఆర్‌ఓ రవి సుధాకర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

హరి హర క్షేత్ర ఆలయ అభివృద్ధిపై సమీక్ష



నవతెలంగాణ-కూకట్‌పల్లి

భరత్ నగర్ కాలనీలోని హరి హర క్షేత్ర దేవస్థానం, పాలక మండలి మొదటి సమావేశం ఆలయ ప్రాంగణములో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సమావేశంలో.. ముఖ్యమైన సమస్యలు, చేపట్టబోయే ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ డాక్టర్ పి నాగిరెడ్డి, ఈఓ.విజయ భారతి, పాలక మండలి సభ్యులు మూర్తి, వెంకటేష్, లక్ష్మి నారాయణ, సంతోష్, మణెమ్మ, ప్రధాన అర్చకులు సూరిబాబు, యోగానందమ్మ, శారద, ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పై దరువు అంజన్న హర్షం వ్యక్తం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు హర్షించదగ్గ విషయమని, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దరువు అంజన్న ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. 30 ఏండ్ల నుంచి మందకృష్ణ నాయకత్వంలో జరిగిన, నిరంతర పోరాటానికి న్యాయం లభించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి మండలి శాసనసభలో ప్రకటన చేయడం అభినందనీయం అని కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఉద్యోగ నియామకాల్లో కూడా మాదిగ, మాదిగ ఉపకులాలకు, రిజర్వేషన్లు అమలు చేయడానికి అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా మాదిగ దండోరా ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు జోహార్లు అర్పించారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం కలిగించకండి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వివిధ ప్రాంతాలకు చెందిన వాటర్ టాంకర్ యజమానులు శనివారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుని శంబీపూర్‌లోని కార్యాలయంలో కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న కాలనీలకు మంచినీటి ఎద్దడి ఉన్నందున నిన్న కొన్ని కారణాల వలన వివిధ ప్రాంతాలలో వాటర్ సంపులను ప్రభుత్వ అధికారులు సీజ్ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీకి తెలియజేయగా వారు వెంటనే స్పందిస్తూ తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సీజ్ చేసిన వాటర్ సాంపులను యధావిధిగా కొనసాగించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నారాయణ, చంద్ర శేఖర్,రమేష్, స్వామి, శ్రీకాంత్ పాల్కొన్నారు.

ప్రతి శిశువుకూ తల్లి పాలు ఇవ్వాలి

నవతెలంగాణ-దుండిగల్

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపల్ పరిధిలోని గండి మైసమ్మ సమీపంలో గల అంగన్ వాడి కేంద్రంలో టీచర్ ఎమ్.మీనాదేవి ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ఆగష్టు 1-మొదలు 7వ తేది వరకు నిర్వహించే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుండిగల్ మునిసిపల్ 8వ వార్డు కౌన్సిలర్ కొల సాయి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు ముర్రి పాలు ఇవ్వాలని తెలిపారు. పుట్టినప్పటి నుంచి 2సం "వరకు ప్రతి పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలని, తల్లి పాలతో పోషకాలు ఎక్కువగా ఉంటాయని. ఇలా చేయడం వలన తల్లి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం పిల్లలకు అక్షరబ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా, ఆరోగ్య లక్ష్మి కమిటీ సభ్యులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీ గణేష్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే శ్రీ గణేష్ శనివారం రెండో విడత బోనాల చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న కొత్త దేవాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను పికెట్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మమ్మ అరోగ్యం బాగాలేదని తెలుసుకున్న మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ మొహమ్మద్ బాబా ఫసియుద్దిన్ అమె ఇంటికి వెళ్లి పరామర్శించి ఆమెలో ఆత్మ స్థైర్యాన్ని నింపారు.
నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రజా రవాణా మెరుగుదలకు సీపీఐ(ఎం) సంతకాల సేకరణ





నవతెలంగాణ-ఓయూ

నగరంలో ట్రాఫిక్, కాలుష్య సమస్య పరిష్కారం కోసం ప్రజా రవాణా సౌకర్యాలు కల్పించాలని సీపీఐ (ఎం) ఆగస్టు 1 నుండి 7 వరకు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తోందని పార్టీ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి అజయ్ బాబు తెలిపారు. సంతకాల సేకరణ , కరపత్రాల పంపిణీ, సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వానికి ప్రజల సమస్యలు తెలియజేస్తామని చెప్పారు. బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాలని,మెట్రో రైలు బోగీలను 6 వరకు పెంచాలని ,ఎం.ఎం.టీ. ఎస్ లోకల్ రైళ్లను పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం మారేడ్ పల్లి పాలిటెక్నిక్ బస్ స్టాప్ వద్ద కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదని తెలిపారు. నగర ప్రజల నిత్యం ట్రాఫిక్ రద్దీతో, కాలుష్య సమస్యలతో తీవ్రంగా సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల సంఖ్య పెరగకపోగా భారీగా తగ్గిపోతున్నాయి అన్నారు. సొంత వాహనాలు కొత్తగా ప్రతి ఏటా లక్షల సంఖ్యలో రోడ్లపైకి వస్తున్నాయని.. ఇది ఇలాగే కొనసాగితే ట్రాఫిక్కు పద్మవ్యూహంలో హైదరాబాద్ ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పార్టీ సికింద్రాబాద్ జోన్ నాయకులు ఆర్ మల్లేష్ ,ఎం గోపాల్, ఏ అనిల్ పాల్గొన్నారు.

బస్సులు పెంచాలని సీపీఐ(ఎం) సంతకాల సేకరణ

బేగంపేట్ : హైదరాబాద్ నగరంలో బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం సనత్‌నగర్ జోన్‌లో ప్యారడైజ్ ఫైర్ స్టేషన్ పక్కన బస్ స్టాప్ హాస్పిటల్ ఎదురుగా బస్ స్టాప్‌లో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ జి.నరేష్ మాట్లాడుతూ నగర జనాభాకు అనుగుణంగా బస్సుల సంఖ్య లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 2800 బస్సులు ఉన్నాయని, రవాణా నిపుణుల అంచనా ప్రకారం నగర అవసరాలకు కనీసం 7000 బస్సులు అవసరమైతాయన్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా బస్సుల సంఖ్యను పెంచి ప్రజల ఇబ్బందులు తొలగించేలా కృషి చేయాలన్నారు. పార్టీ జోన్ నాయకులు పి.మల్లేష్, తదితరులు పాల్గొన్నారు

సమస్త చరిత్రకు ఖజానా 'తెలంగాణ'

- రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖల డైరెక్టర్ మామిడి హరికృష్ణ
- ఓయూలో ఆర్కియాలజీ జాతీయ సదస్సు



నవతెలంగాణ-ఓయూ

సమస్త చరిత్రకు పరిశోధకుల కోసం తెలంగాణ రాష్ట్రం ఖజానా లాంటిదని రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖల డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. యానిసెంట్ ఇండి యన్ హిస్టరీ, కల్చర్ అండ్ ఆర్కియాలజీ ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో " ఆర్కియాలజీ : ఏ కన్వర్జెన్స్ ఆఫ్ మల్టీ, ఇంటర్, ట్రాన్స్ డిసిప్లినరీ అప్రోచెస్" అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సును శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల రూము నెంబర్ 133 లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మామిడి హరికృష్ణ మాట్లాడుతూ. ఆర్కియాలజీ అంటే మానవ సమాజ నిర్మాణ మూలాల్లోకి వెళ్లడం అని వివరించారు. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితమే తెలంగాణ భూమి మనుగడలో ఉన్నదని చెప్పారు. దేశంలోనే కాకుండా రాష్ట్రంలో శిల్ప సంపద, శాసనాలపై వెలికితీతలు పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పప్పుల. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ. ఆర్కియాలజీ పరిశోధనల ద్వారా విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అజంతా ఎల్లోరా లాంటి శిల్ప కళను చూసిన తర్వాత నిర్మాణ శైలిలో ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా తెలుసుకోవాల్సిన అంశాలు ఉన్నాయన్నారు.హరప్పా నాగరికత నుంచి మొదలుకొని నేటి ఆధునిక నాగరికత పరిణామ క్రమంలో నేడు డిజిటల్ యుగంలోకి చేరుకున్నామని నాటి నుంచి నేటి వరకు కూడా విజ్ఞాన వ్యాప్తిలో పరిశోధనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి అన్నారు. ఓయూ మాజీ రిజిస్ట్రార్, ఆర్కియాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ కిషన్ రావు మాట్లాడుతూ చరిత్ర రచనలకు ఆర్కియాలజీ పరిశోధనల కీలకమన్నారు. ప్రొఫెసర్ విజయ్ కుమార్ బాబు కీలక ప్రసంగం చేశారు" మెగా లిథిక్ బరియల్స్ ఇన్ తెలంగాణ" అనే అంశంపై ఆర్కియాలజీ పరిశోధక విద్యార్థి మేడి దివ్య రాసిన పుస్తకాన్ని సదస్సులో అతిథులు ఆవిష్కరించారు. సదస్సు ఉద్దేశాలను లక్ష్యాలను గురించి సెమినార్ డైరెక్టర్, హిస్టరీ హెడ్ ప్రొఫెసర్ బి లావణ్య, కన్వీనర్ డాక్టర్ యాలాల శివానంద్ వివరించారు. ఈ సదస్సులో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తలత్ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీనవేణి రామ్ షఫర్డ్, ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామలింగం, ఓయూ జర్నలిజం శాఖ హెడ్ డాక్టర్ సతీష్, అకాడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి . రమేష్,సోషియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ .పరందాములు, డాక్టర్ బోనకుర్తిసోమేశ్వర్,ఆర్కియాలజీ శాఖ ఫ్యాకల్టీ మెంబర్స్ డాక్టర్ జయశ్రీ, డాక్టర్ ఉమా, డాక్టర్ నాగమణి లతోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు ,రీసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు.



బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

అమీర్ పేట డివిజన్‌కు కుమ్మరి బస్తీకి చెందిన పార్టీ నాయకులు నరేందర్ మాతమూర్తి, బీజేఆర్ నగర్ కు చెందిన రవి కిరణ్ మాతమూర్తి ధనమ్మ లు శుక్రవారం సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం వారి నివాసాలకు వెళ్ళి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారిని పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, సంతోష్, నర్సింహ, గులాబ్ సింగ్, గోపిలాల్ చౌహాన్, కూతురు నర్సింహారావు తదితరులు ఉన్నారు.

పేదలకు నిరంతర సేవలు



- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

నిరుపేదలకు నిరంతరం వేనుదన్నుగా నిలుస్తామని, కరోనా మహమ్మారి రోజుల్లో సైతం ప్రజలను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేశామని ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ మున్సిపల్ డివిజన్లకు చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం సితాఫలమండీలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. దాదాపు 155 మందికి రూ.56 లక్షల విలువజేసే చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ. నియోజకవర్గం పరిధిలో ప్రతీ ఇంటికీ వివిధ సంక్షేమ పథకాలను అందించేందుకు కషి చేస్తున్నామని తెలిపారు. పభుత్వ పథకాలకు లంచాలు చెల్లించరాదని, ఎవరైనా డబ్బులు అడిగితే సితాఫల్ మండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత రమేష్, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, బీ.ఆర్.ఎస్. యువ నేత రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజానికి కృషి చేయాలి



- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం లాల్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఫోటో ఎగ్జిబిషన్ అవగాహన కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పాశ్చాత్య సాంస్కృతికి అలవాటు పడుతూ చెడు అలవాట్లకు యువత బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నంత స్థాయికి ఎదగాలని కోరారు. మన ఇంటి పక్కల రోడ్లమీద డ్రగ్స్ గంజాయి వాడుతున్నారని తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తిరుమలగిరి సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల విచక్షణ కోల్పోతారని, అరవడం, కేకలు వేయడం, డిప్రెషన్ లోకి వెళ్లిపోవడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ మాఫియా స్కూల్ లో చదువుకునే చిన్న చిన్నపిల్లలకు కూడా వదలకుండా చాక్లెట్ల రూపంలో డ్రగ్స్‌ను అంటిస్తూ వ్యాపారానికి కొనసాగిస్తున్నారని.. ఇలాంటి వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు స్కూలు ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ మాట్లాడుతూ డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షురాలు సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజానాట్యమండలి ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. మారన్న, ప్రజానాట్యమండలి నగర నాయకులు జె రఘు, ఎమ్మార్వో ఆఫీస్ ఆర్ఐ సునీల్ కుమార్, ప్రభుత్వ గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ అన్విత రెడ్డి, సరళ, టీచర్లు భవిత తదితరులు పాల్గొన్నారు





గద్దర్ వర్ధంతిని విజయవంతం చేద్దాం

- డా.ఎ. పరశురాం

నవతెలంగాణ-ఓయూ

6న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరగనున్న గద్దర్ యాదిలో ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్టు రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశురాం కోరారు. డా.పరశురాం ఆధ్వర్యంలో శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గద్దరన్న యాదిలో వాల్ పోస్టర్లు ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలే గద్దర్ వారసులు అని అన్నారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు, రచయితలు ,విద్యావంతులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఉపాధ్యక్షుడు ప్రేమయ్య, ప్రధాన కార్యదర్శి డా.సి.యచ్ .వెంకటేశ్వర్లు, డా.రమేష్, డా.బాలకోటి నాయక్, డా.అర్జున్, డా.సమీ కాంట్రాక్టు అధ్యపకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని అవగాహన సదస్సులు



- నిర్వాహకులు అనిల్

నవతెలంగాణ - బంజారాహిల్స్

ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఈనెల 9న ఆదివాసీలు, గిరిజన ప్రాంత ప్రజలు వారు జీవించే జీవన విధానాలు, వారు జరుపుకునే గిరిజన పండుగలను ఉద్దేశిస్తూ స్వచ్ఛమైన అటవీ ప్రాంత వాతావరణం కాలుష్యం బారిన పడకుండా ఎలా కాపాడుకోవాలనే అంశాల మీద ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నామని కార్యక్రమ నిర్వాహకులు అనిల్ తెలిపారు.

శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో పర్యావరణ శాస్త్రవేత్తలు, సత్యనారాయణ ఆకాశలతో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఈ సంవత్సరం సుస్థిర మేడారమని ప్రత్యేకమైన అంశంతో మేడారం అడవులు అక్కడ జరిగే గిరిజన వన దేవతల పండుగల సందర్భంగా అక్కడికి వచ్చే జనం ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు, ఇతరత్రా వస్తువులతో కాలుష్యం బారిన పడుతున్నాయని, అలాంటి విపత్కర పరిస్థితులను నిలవరించడానికి ఎలాంటి విధానాలు అవసరమో తమవంతుగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. దీనికి తెలంగాణ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల నుంచి చేయూత లభిస్తే ఈ ఉద్యమాన్ని మరింత ఉధతంగా ముందుకు తీసుకుపోగలమని నమ్మకం తమకు కలుగుతుందంటూ విజ్ఞప్తి చేశారు. ప్రకాష్,సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



- టీపీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ షబ్బీర్ అలీ

నవతెలంగాణ - బంజారాహిల్స్

ఎల్బీ స్టేడియంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రయివేటు టీచర్లను ఉద్దేశిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ప్రొఫెసర్ కోదండరాం నివాసాన్ని ముట్టడిస్తామని తెలంగాణ టీచర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ షబ్బీర్ అలీ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యదర్శి నవీన్ కుమార్‌తో కలసి ఆయన మాట్లాడారు. ఇంటర్ పాసైనవారు డిగ్రీ ఫెయిలైన వారు ప్రయివేటు పాఠశాలల్లో బోధిస్తున్నారని, ప్రభుత్వ ఉపాధ్యాయుల అర్హతలో ప్రయివేటు ఉపాధ్యాయులకు సగం కూడా అర్హత లేదంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రయివేటు టీచర్లను మనోవేదనకు గురి చేస్తున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మూడు లక్షల ప్రయివేటు టీచర్ల మనోభావాలు దెబ్బతీసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఉండడం శోచనీయం అని అన్నారు. తెలంగాణ కు తండ్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు కూడా ప్రయివేటు పాఠశాలల్లోనే చదువుతున్నారని, దాన్నిబట్టి ప్రయివేటు పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుల చిత్తశుద్ధిని సీఎం అర్థం చేసుకోవాలని అన్నారు. ఒకవేళ ముఖ్యమంత్రి అన్నట్టుగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు తమకు అర్హత లేకపోతే రూ. 80 వేలు, లక్ష వేతనాలు తీసుకుంటూ పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో ఎందుకు చదివిస్తున్నారని ప్రశ్నించారు. సీఎం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ కోదండరాం.. సీఎం ఈ వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు వారించకుండా ఎందుకున్నారని ప్రశ్నించారు. గురువు స్థానంలో ఉండి గురువులను అవమానిస్తుంటే చూస్తున్న ఆయన తీరుకు నిరసనగా ఆదివారం తమ ఫోరం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరాం ఇంటిని ముట్టడిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ ఖాన్,మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు అజ్మద్దీన్ పాల్గొన్నారు.



యాగశాలను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ శనివారం స్ట్రీట్ నెంబర్ 8 లోని వెలుగుగుట్టలోని మల్లికార్జునస్వామి, అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న యాగశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు విద్యుత్ స్తంభాలు యాగశాలకు అడ్డుగా ఉన్నాయని తెలిపారు. ఎలక్ట్రికల్ అధికారులకు పిలిపించి విద్యుత్ స్తంభాలు పక్కకు జరపాలిసిందిగా కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ రాంరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్ పటేల్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదలపై హర్షం



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ విడుదల సందర్భంగా నిరుద్యోగ జేఏసీ వ్యవస్థాపకులు, ఓయూ జేఏసీ చైర్మెన్ ఓరుగంటి కృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న సరస్వతీ ఆలయంలో 108 కొబ్బరి కాయలు కొట్టారు. 60 ఏండ్ల తెలంగాణ కల నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో బీఆర్ఎస్ చేసిన మోసానికి చరమగీతం పాడి నిరుద్యోగులు కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి సీతక్క, ఇతర మంత్రులకు తెలంగాణ నిరుద్యోగుల తరుపున కతజ్ఞతలు చెప్పారు. కాంగ్రెస్ ప్రతి సంవత్సరం యూపీఎస్‌సీ తరహాలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి దాని ద్వారా ప్రభుత్వ ఉద్యోగ ప్రక్రియ ఏటేటా నిర్వహిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పారదర్శకంగా నిర్వహిస్తూనే ప్రతి ఒక్క శాఖలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో విద్యార్థులకు తెలియజేసేలా జాబ్ క్యాలెండర్ ఉండబోతుందని,స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని ప్రారంభించడం కూడా విద్యార్థులకు వారు వారి వారి రంగాలలో అభివద్ధి మెరుగుపరచుకోవడానికి ఒక సువర్ణ అవకాశం అన్నారు. అంబేద్కర్,నాగేష్ నాయక్, సత్తి నర్సింహా అంజి,సింహాద్రి, శ్రీవాస్, మహేష్,గోపి ,పీహెచ్డీ స్కాలర్స్ విద్యార్థి నిరుద్యోగులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి

- టీపీసీసీ కార్యదర్శి కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట్



సనత్ నగర్ నియోజకవర్గం ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కారం దిశగా చర్యలు చేపడతానని టీపీసీసీ కార్యదర్శి కోట నీలిమ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.... సనత్ నగర్‌లోని పలు డివిజన్‌లలో అనేక సమస్యలు ఉన్నాయని.. వాటిని తీర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లు, డ్రయినేజ్, మంచినీటి సమస్యలు లేకుండా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు తన దృష్టికి సమస్యను తీసుకొస్తే వెంటనే ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకెళ్తానని వెంటనే సమస్యను పరిష్కారం ఇచ్చే దిశగా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు జీహెచ్ఎంసీకి ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తోందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని తెలిపారు.



బొరబండలోని వీకెర్ సెక్షన్, శిల్పి నగర్ నివాసి లక్ష్మమ్మ అనారోగ్య కారణంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బోరబండ కార్పొరేటర్ మహమ్మద్ బాబా ఫసియుద్దిన్ సతీమణి హాబీబా సుల్తానా.. లక్ష్మమ్మకు నివాళ్లర్పిస్తూ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభుతి తెలియజేశారు.
నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మాదిగల పోరాట ఫలితం సుప్రీం కోర్టు తీర్పు



- తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ మాదిగ.

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు 30 సంవత్సరాల మాదిగల పోరాట ఫలితం అని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ మాదిగ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి గూడ, అంబేద్కర్ నగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణ తీర్పు మాదిగలకు అనుకూలంగా ఇచ్చిన కోర్టు న్యాయమూర్తుల బృందానికి మాదిగల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగ ఉప కులాలకు విద్యా ,ఉద్యోగాలలో ఎక్కువ శాతం రిజర్వేషన్లు పెరుగుతాయని, ఎస్సీ కులాలలోని విద్యావంతులు ఉద్యోగాలు సంపాదించుకుంటారని ఆనందం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో కొమ్ము కృష్ణ బాబు, ఎర్ర నగేష్ ,నాగరాజు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు .

విద్యుత్తు వినియోగదారులతో సమావేశం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

భాగ్యనగర్ విద్యుత్ సెక్షన్‌లోని హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీలో విద్యుత్తు వినియోగదారులతో శనివారం విద్యుత్ అధికారులు ముఖాముఖి సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో నేరుగా కాలనీ వాసులతో వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్తు సరఫరా పరిస్థితులు వారికి సంస్థ ద్వారా అందే సేవలు, బిల్లులు చెల్లించే విధానం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ డీఈ చక్రవర్తి, ఏడీఈ ప్రసాద్, ఏఈ షాబాజ్, భాగ్యనగర్ ఏఈ మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్లలో వ్యక్తి దారుణ హత్య



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని నిర్మానుష్య ప్రాంతంలో సుమారు 35 సంవత్సరాల వయసు కలిగిన ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందని తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలను పరిశీలించారు. శరీరంపై దుస్తులు లేకుండా ఉన్న వ్యక్తిని బండరాయితో కొట్టి చంపినట్లు అనుమానిస్తున్నారు. ఇక ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా లే ఔట్ల క్రమద్దీకరణకు చర్యలు చేపట్టాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సరళీకత చెల్లింపు పథకం (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా లే ఔట్ల క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపట్టాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు తెలిపారు. శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దాన కిషోర్‌తో పాటు ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో సరళీకత చెల్లింపు పథకం (ఎల్ ఆర్ ఎస్) ద్వారా లేఔట్లను క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధి విధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు అందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రభుత్వానికి నష్టం జరగకుండా సరళీకత చెల్లింపు పథకం (ఎల్‌ఆర్ ఎస్) ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని మంత్రులు ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపల్, గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయతీల పరిధిలో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కార దిశగా అడుగులు వేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుతూనే ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, గ్రామ పంచాయితీ అధికారులు కమిటీలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వారి ఆధ్వర్యంలో సరళీకత చెల్లింపు పథకం (ఎల్‌ఆర్ ఎస్) ద్వారా లేఔట్లను క్రమబద్ధీకరణపై పరిశీలించి తదుపరి సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించి క్రమబద్ధీకరణ క్రమంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూముల క్రమబద్ధీకణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

మున్సిపల్ అధికారులతో సమావేశం

సీడీఎంఏ వి.పి.గౌతమ్, జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి ఈ నెల 5-9వ తేదీ వరకు నిర్వహించే స్వచందనం-పచ్చదనం కార్యక్రమాలను విజయవంతం చేయాలనీ, వీధి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడే బాధ్యత అందరి మీద ఉందనీ, ఇందుకు సంబంధించిన అనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ ప్రకారం కుక్కల జనవాలను తగ్గించాల్సి ఉందనీ, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు, మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని పార్కులుగాను, వాకింగ్ ట్రాక్స్‌గాను, క్రీడా స్థలాలు గాను రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతులు లేని భవనాలను గుర్తించి వాటిని కూల్చివేయడానికే తగిన చర్యలు తీసుకుంటూ అదనంగా నిర్మించిన భవనాలకు ప్రస్తుత ప్రభుత్వ విధానాల ప్రకారం పన్ను విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా (లోకల్ బాడీస్, అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి (రెవెన్యూ), మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

39 మురుగు నీటి శుద్ధి కేంద్రాలకు రూ. 3849.10 కోట్ల నిధులు



- 100శాతం అందుబాటులోకి వస్తే దక్షిణాసియాలోనే తొలి నగరంగా హైదరాబాద్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ అర్బన్ అగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజూ 1950 ఎంఎల్డీల మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. ఈ క్రమంలో నగరంలో మురుగు నీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. రోజూ ఉత్పన్నమయ్యే మురగు నీటిని వంద శాతం శుద్ధి చేయడానికి వీలుగా ఎస్టీపీల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హైదరాబాద్ మహా నగరంలో కొత్తగా మురుగు నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. అమత్ 2.0 (ఒక్మూరాచీజఎజు-3) కింద మొత్తం 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించడానికి రూ. 3849.10 కోట్లు నిధులు కేటాయించింది. ఓఆర్‌ఆర్, జీహెచ్‌ఎంసీ పరిధిలోని స్థానిక సంస్థలతో పాటు మూసీ నది ప్రక్షాళన కోసం వీటిని నిర్మించనున్నారు. మొత్తం 39 ఎస్టీపీల్లో ఒక ఎస్టీపీని 'పీపీపీ' (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడ్‌లో, మిగిలిన 38 ఎస్టీపీలను 'హెచ్‌ఏఎం' హైర్ అండ్ మేయింటనెన్స్) విధానంలో నిర్మిస్తారు. వీటిని రెండు ప్యాకేజీల్లో పూర్తి చేయనున్నారు. ప్యాకేజీ-1లో 16 ఎస్టీపీలు, ప్యాకేజీ-2లో 22 ఎస్టీపీలు నిర్మిస్తారు. ఇప్పటికే అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్టీపీల నిర్మాణం జరుగుతోంది. వీటి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే రోజూ ఉత్పన్నమయ్యే మురుగును 100 శాతం శుద్ధి చేసే తొలి నగరంగా దక్షిణాసియాలోనే హైదరాబాద్ చరిత్ర సష్టిస్తుంది.

పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి

- 102 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 31 క్వింటాళ్ల గోదుమల పట్టివేత
- ముగ్గురు నిందితుల అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాని కొందరు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిని నుంచి 102 క్వింటాళ్ల పీడీఎస్ రైస్, 31 క్వింటాళ్ల గోదుమలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.2.97లక్షలుంటుందని పోలీసులు తెలిపారు. శనివారం డీసీపీ సుదీంద్రా తెలిపిన వివరాల మేరకు భవానీనగర్‌కు చెందిన షేక్ రషీద్, షేక్ అయాజ్, తలాబ్‌కట్టకు చెందిన ఏండీ అక్తర్ వివిధ వ్యాపారాలు చేస్తుంటారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో గోధుమలు, పీడీఎస్ (రేషన్ బియ్యం)ను బ్లాక్ మార్కెట్‌కు తరలించి డబ్బులు సంపాదించాలని పథకం వేశారు. ఇందులో భాగంగా రేషన్ డీలర్ల నుంచి రూ.12లకు కిలో బియ్యం, కిలో గధుమలు కొనుగోలు చేస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న నిందితులు మహారాష్ట్రాలో కిలో రూ.20ల చొప్పున విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు అదనపు డీసీపీ ఏ.శ్రీనివాస్ ఆదేశాలతో నిందితులను అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రా, ఎస్‌ఐలు కే.నర్సింహులు, ఎన్.నవీన్, జీ.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని, సీసీఎల్‌ఏ కమిషనర్ సూచనల మేరకు వీలైనంత త్వరగా పెండెన్సీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్‌ఓఆర్ ముసాయిదా బిల్లు-2024 పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ (www.ccla.telangana.gov.in) ద్వారా అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఈ నెల 2వ నుంచి 23వ తేదీ వరకు ఈ ముసాయిదా బిల్లుపై ప్రజలు ఎవరైనా సరే తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చని అని సూచించారు. సలహాలు, సూచనలను ఈ మెయిల్ (ror2024-rev@telangana.gov.in) ద్వారా తెలుపవచ్చని సూచించారు. పోస్ట్ ద్వారా కూడా 'ల్యాండ్ లీగల్ సెల్, సీసీఎల్‌ఏ కార్యాలయం, నాంపల్లి, స్టేషన్ రోడ్, అన్నపూర్ణ హెూటల్ ఎదురుగా, ఆబిడ్స్, హైదరాబాద్ 500001' చిరునామాకు పంపించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మండలాల తహశీల్దార్లకు కలెక్టర్ గౌతమ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికా బద్ధంగా పరిష్కరించాలని, సీసీఎల్‌ఏ కమిషనర్ సూచనల మేరకు వీలైనంత త్వరగా పెండెన్సీ పూర్తి చేయాలని సూచించారు. తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారం, పది రోజుల్లోపు క్లియర్ చేయాలని గడువు విధించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలనీ, డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వెనువెంటనే పరిష్కరించాలన్నారు. మండలాల వారిగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలనీ, సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న వాటిని ముందుగా పరిశీలన జరిపి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతి గురించి రోజువారీగా పరిశీలన జరపాలని ఆర్డీఓలకు సూచించారు. వక్ఫ్ భూములు, ఇనాము భూములు, డిఫెన్స్ భూములు, నిషేధించబడిన భూము ల్లో ఉన్న దరఖాస్తులను తిరస్కరించాలని తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేస్తున్నామనీ, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. అర్జీల పరిష్కారానికి చేపట్టిన చర్యలను తెలియజేస్తూ ఆన్‌లైన్లఓ అప్లోడ్ చేసే సమయంలో వివిధ అంశాలను సవివరంగా పేర్కొనాలని అన్నారు. ఏదైనా అర్జీని తిరస్కరిస్తే, అందుకు గల కారణాలను సహేతుకంగా పొందుపర్చాలని ఆదేశించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE: R.R.DISTRICT AT: L.B.NAGAR
O.S.No. 453 of 2021

Between:
Medireddy Vanitha & another ...Plaintiffs
And
Jonnada Darshan Reddy & others ...Defendants

To,
D-2.Nimma Janga Reddy S/o. Ranga Reddy, R/o.Plot No.224, Laxmi Mega Township, Ragan naguda, Abdullapurmet (M), R.R.District
D-3.Vottikoti Thirumalesh S/o. V.Chittari, R/o. H.No.8-7-93/NE/P/2, Near Kasthuri Hostel, Ayodya Nagar Colony, Hastinapuram North Saroornagar Mandal, R.R.District-500079

Take notice that the above named plaintiffs filed the above suit against you seeking Partition and Separate Possession and Declaration, to Declare the Regd. Sale Deeds vide Doct. Nos. 27554/2016 & 27556/2016, both dated 21-10-2016 and Doct. No.3561/2017 dated 26-07-2017 as null and void and not binding on the plaintiffs in respect of the suit schedule property and the said suit is posted to 13-08-2024 for your appearance. Hence you are hereby directed to appear either in person or through an advocate on the said date i.e., 13-08-2024 at 10:30 A.M. before the above court, failing which the matter will be decided basing on the documents available on record.

//BY ORDER OF THE COURT//
A.H.CHAKRAVARTHY
Advocate,
H.No.19/A, Sai Kuteer, Santoshnagar Colony, Saidabad, Hyderabad - 59 Cell: 9391011576

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.S.NO. 484 OF 2024

BETWEEN:
Sri Mangina Venkata Ratna Prasad and Another .....Plaintiffs
AND
Smt Sirangu Seshu Tulsi and Others .....Defendants

To,
All Concerned ... Defendant No.3

Sir's,

Please take notice that the above plaintiffs have filed Suit for declaration to declare the plaintiffs and Defendant No.1 as the only surviving legal heirs of the deceased Late Mangina Seetha Ramanujam. When the matter came up for the consideration the Hon'ble Court was pleased to direct the Plaintiffs to issue service of notice through Paper Publi cation to you and posted the matter for appearance on 05.08. 2024 at 10.30 A.M. before the above Court either in person or through your Counsel. If none of the parties appear on the above date on the above court the matter will be heard as per law.

//BY ORDER OF THE COURT//
D.Madhava Rao
K.Nitesh
D.Raghavendar Rao
K. Ankit Raj
Advocates
Plot No.41, Ishaq Colony, Secunderabad

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు సూర్యాపేట గారి సమక్షంలో
I.A No: 121 of 2020
O.S. No: 82 of 2018

Beetween:-
1. కొలిశెట్టి కమలమ్మ
2. కొలిశెట్టి నవీన్ కుమార్
.....పిటీషనర్స్/ప్రతివాదులు.
మరియు
కొలిశెట్టి మధుసూదన్ ....రెస్పాండెంట్/వాది

TO
1.కొలిశెట్టి మధుసూదన్, తండ్రి: లేట్ రంగయ్య, వయస్సు: 61 సం॥లు, వృత్తి: వ్యవసాయం, మరియు నివాసం: ప్లాటు నెం: 363, మల్కాజ్‌గిరి, హైదరాబాద్
.....రెస్పాండెంట్

పైన తెలిపిన పిటీషన్ ఓ.యస్ నెం: 82/2018 డిక్రీని రద్దు చేయు నిమిత్తం పెట్టినాను. అట్టి పిటీషన్‌లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీకు ముట్టక వాపసు వచ్చుచున్నవి. కావున పై పిటీషన్ తేది: 14-08-2024న మీ హాజరు నిమిత్తం ఉన్నది. కావున మీరు స్వయంగా కాని లేదా వకీలు ద్వారా కానీ పై వాయిదాకు పై కోర్టులో హాజరు కాగలరు. ఏమైనా అభ్యంతరములు ఉన్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షములో పిటీషన్ తీర్మానించబడును.

//కోర్టు వారి అనుమతితో//
ఇట్లు
గ్రంధి వెంకటేశ్వర్లు, బి.ఎ. ఎల్.ఎల్.బి
గడ్డల శ్రీనివాస్,
న్యాయవాదులు, సూర్యాపేట
సెల్: 9440574136

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (PRINCIPAL DISTRICT JUDGE) AT HANUMAKONDA
O.P.NO. 497 OF 2020

Between:
BHUKYA JAMLA AND ANOTHER ...Petitioners
And
KATHULA DHARMAIAH & OTHERS ...Respondents

NOTICE

To
R-2 SANDEPAKA NAVITHA, D/o. Komaraiah, R/o H.No.3-4-98/31/2N, Mallapur village, Nacharam, Uppal, Medchal district.

Please take notice that the above named Petitioners have of filed the above O.P. against you and others for grant compensation. The said case is stands posted on 26-09-2024 for your appearance before the above said Hon'ble Court at 10-30 a.m. either in person or through an Advocate, failing which the matter will be decided exparte.

// BY ORDER OF THE COURT //
THATIKONDA KRISHNA MURTHY
Advocate
Nandi Hills, Hunter Road
Hanuma konda district.
Mobile No. 98491 36256.

PUBLIC NOTICE

General Public are hereby informed that my client **SRI.KUNDHARAJU SIVA RAMA CHANDRA RAJU, S/o.SRI.K. SANGA RAJU**, Age:36Yrs, Occ: Employee, R/o.Flat No.502, Ganga Enclave, Royal Oaks, Pet Baheerabad, Jeedimetla, Hyderabad-500055 have entered into a Agreement of Sale by paying substantial sale consideration to purchase Plot bearing No.90, total land admeasuring 253 Sq. Yards, in Sy.No. 155/ఆఅ, 156/ఆఅ , 155 and 156 situated at Gopanpally Village, Seri Lingam pally Mandal, Ranga Reddy, Telangana, from it's a Registered Agreement of Sale cum G.P.A Holder namely Smt. Kanneganti Kavitha W/o.K.Venu Gopal, R/o.Vengal Rao Nagar, S.RNagar, Hyderabad of Smt.Vutukuri Nagasree, W/o.T.Chandra sekhar, R/o.Malakpet, Hyderabad as such any person or persons have got any sort of claims over the said land or any objections of whatever nature to the proposed sale transaction or any alienations on this property, may approach to my office along with all the relevant original documents within 7 days from the date of this publication, thereafter no claims or objections will be entertained and my client will proceed with the registration of Sale Deed in his favour treating the said land as free from any third party claims and objections.

BANOTH VAMSHI
Advocate
O/o.204,MJK Aprts, Barkatpura Chaman,Hyderabad500026, Cell:8142224227

IN THE COURT OF THE HON'BLE ADDL.JUNIOR CIVIL JUDGE :AT JADCHERLA
O.S.NO.122/2021

Between:
Kola Krishna ...Plaintiff
And
Kurmidde Shyam Sundar and 3 others ...Defendants
(Summons)

To
M.Manikyam S/O Venkayya,age 68 years,Occ:business,R/O 23-132/204,Sri Sai Enclave,near Aubindho Jr.College,MathaLaxminagar Kothapet Hyderabad-500035 (Defendant NO.3)

Take notice that the above named plaintiff has filed a Declaration suit O.S.NO 122/2021 against you and 3 others before the above shown Court.This case is posted for your appearance on 14-08-2024.Hence you are hereby required to appear in person or through an Advocate before this Hon'ble court on 14-08-2024 at 10-30AM.Otherwise you will be set exparte and the case will be decided in your absence as per Law.

(By the Order of the Hon'ble Court)
Sd/-
D.K.SATYANARAYANJI
ADVOCATE
Mahabubnagar.

IN THE COURT OF HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM XXIV ADDI CHIEF JUDGE CITI CIVIL COURT, AT:HYDERABAD.
O.P.NO.214 OF 2017

BETWEEN:
A.Sreenu and another. ...Petitioner
AND
V.Kistappa and another. ...Respondents.

To,
1.V.Kistappa,S/o.V.Thimmaiah, Occ:Owner Cum Driver of Tipper Bearing No.AP 12 U 2890,R/o. H.No.3-45/4/58, Gowlidoddi Village, Sherilingampally, R.R.Disi. ...R1

Please take Notice that the above OP is filed against you and others for grant of Compensassion the Hon'ble court posted above case **on 21-8-2024.at 10.30 am** for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.A.Madhava Reddy,
Advocate
Dilsukh nagar, Hyderabad.

IN THE COURT OF THE HON'BLE Ist ADDL. JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAGIRI DISTRICT, UPPAL AT:: L.B.NAGAR
O.S.NO.1222 OF 2021

Between:
BANK OF INDIA Parvathapur Branch Medipally Mandal Medchal-Malkajgiri Dist. ...Plaintiff-Bank
AND
1)M/s.Sai Enterprises Plot Nos. 82, 83 & 84, Maruthi Nagar Om Vihar Colony Budha Nagar, Medi pally Medhal-Malkajgiri District
Second Address:
M/s.Sai Enterprises Door No.3-1-6/41/1/171 Green Hills Colony Mallapur, Uppal Mandal Medhal-Malkajgiri District Rep. by its Proprietor Mrs.Purumandla Krishna Veni W/o.P.Mahender Reddy
2)Mrs.Purumandla Krishna Veni W/o.P.Mahender Reddy Aged about 45yrs, Occ: Business Proprietrix M/s.Sai Enterprises H.No.7-6/20, Ganesh Nagar Uppal, Hyderabad ...Defendant/s

Please take notice that the Plaintiff Bank above named filed the above suit against you for recovery of money of Rs. 10,23,780/- together with interest and costs. The said suit stands posted **to 21-08-2024** for your appearance either in person or through your advocate **at 10.30 AM.** If you failed to appear before the said court on the date and time mentioned above the matter will be heard and decided exparte

//By Order of the Court//
S/d.
M.Saidaiah
M.Devender Reddy
Advocates
Plot No.204, 2 nd Floor Sri Nilaya Residency Green Park Colony Karmanghat Hyderabad Counsels for Plaintiff

---

IN THE COURT OF THE HON'BLE VI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.NO.2029 OF 2020

BETWEEN:
Smt.G.Laxmi Devi @ Laksmamm ...Plaintiff
AND
Smt.Chepuri Geeta and others ...Defendants

To,
1.Smt.Chepuri Geeta, W/o. Chepuri Venugopal, Aged 47yrs, Occ: Housewife, (D1)
2.Chepuri Venugopal, S/o.Chepuri Shankaraiah, Aged 50yrs, Occ: Business, (D2)
Both 1 & 2 are the resident of H.No. 2-2-1075/14/1/A-New Baagh Amberpet, Hyderabad.

NOTICE

Please take the notice, that the above named plaintiffs has filed the above Suit against you and Others for Mandatory Injunction for the Suit Property situated at Bagh Amberpet is posted to 05-08-2024 for your appearance. Therefore you may appear in person or through an Advocate **by 10:30 A.M. on 05-08-2024.** In case of your absence on the said date and time before the said Court, the matter will be decided by the Court.

(BY THE ORDERS OF THE HON'BLE COURT)
B.Srinivasulu
Jamuna Tiwari , Asma Begum
Advocates
Flat No. 211, 2nd Floor, Santosh Plaza, N.S. Road, Vinaynagar Colony, Saidabad, Hyd-500 059. Mobile No.98490 97394

IN THE COURT OF THE HON'BLE Ist ADDL. JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAGIRI DISTRICT, UPPAL AT: L.B. NAGAR
O.S.NO.765 OF 2021

Between:
BANK OF INDIA Boduppal Branch Hyderabad ...Plaintiff-Bank
AND
Smt.Arisharlapally Aruna W/o. A.Anjaiah Chary Aged about 38 yrs, Occ: Business R/o.Door No.1-55/1, Boduppal Near Grama Panchayat Office Medhal-Malkajgiri District ...Defendant/s

Please take notice that the Plaintiff Bank above named filed the above suit against you for recovery of money of Rs.99,000/- together with interest and costs. The said suit stands posted **to 21-08-2024** for your appearance either in person or through your advocate **at 10.30 AM**. If you failed to appear before the said court on the date and time mentioned above the matter will be heard and decided exparte

//By Order of the Court//
S/d-
M. Saidaiah
M.Devender Reddy
Advocates
Plot No.204, 2 nd Floor Sri Nilaya Residency Green Park Colony Karmanghat Hyderabad Counsels for Plaintiff

---

IN THE COURT OF CHIEF JUDGE-CUM-MACT, CITY CIVIL COURTS. At: Chatta Bazar, Hyderabad.
MVOP No.1494 of2023

BETWEEN:
Pushpalatha Gade, ...Petitioner/s.
AND:
Nagasai.K., & Anothers. ...Respondent/s.

To,
Venkataramana.G., @ Venkata Ramana.G., S/o:Srinu, Age:27yrs, Occ: Driver, R/o: Plot No:671, Ayyappa Society, Madhapur, Serilingampally, R.R.Dist- 500081

Take this Notice that the petitioner herein has filed the above M.V.O.P. against you and another cespondent by claiming compensation before the above mentioned Court. Hence the above M.V.O.P. is posted for your appearance and counter. If you fail to appear before the above mentioned Court **on 13-09-2024 by 10.30 a.m.**, the matter will be decided in your absence.

(By Order of the Court)
PUTTA THIRUPATHI REDDY
ADVOCATE
Flat No:1, Ravi Residency Apartment, H.No: 13-4-48/F/1, Opp:Central Bank of India. left side to Rajadhani Theater, Vikas Nagar, DilsukhNagar, Hydrabad (Town & Dist.) T.G PIN:500060. RRDIST, Phone: 9440687160.

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT: AT: L.B.NAGAR
O.S.No.499 of 2024

Between:
1.M.SAI KUMAR S/O late. M.CHANDRA BHANU, Aged about :39yrs, Occ: PVT Employee R/o.H.NO.6-12,Ayodhya Nagar Colony, Meerpet, K.V.Ranga Reddy, Telangana,Pin-500097 AADHAR NO.788829955262.
2.CHOLKAR REKHA D/O M.CHANDRA BHANU W/O. CHOLKAR AMRUTHRAJ Aged 45yrs Occ: House Wife, R/O.10-73, Prashanth Nagar, Balapur X Road, Saroor nagar, K.V.Ranga Reddy Aadhar Card No.260758486684,
3.BASATKAR SANDHYA D/O. M.CHANDRA BHANU W/O. AMBU RAO Aged: 37Yrs, Occ: House Wife,R/O.13-125/218, Sreenagr Colony,Shad Nagar Aadhar Card No.234527404984, ...Plaintiffs
And
1.The Tahsildar, Balapur Mandal, R.R.District.
2.All concerned ...Defendants

NOTICE TO CONCEREND PEROSNS

Whereas the plaintiffs have filed the above suit for declaration of legal heirs of LATE MAHINDRAKAR SAKKU BAI@ M.SAKKU BAI W/O M.CHANDRA BHANU.in respect of suit schedule of property If any person or persons have any objection on the above case, please appear before the Hon'ble court **on 20-08-2024 at 10.30 am** either in person or pleader, otherwise the suit will be determined in exparte.

SCHEDULE OF PROPERTY

All that the piece and parcel of land bearing plot no.80 part, in Survey No.127,128 and 142, admeasuring 148 Sq.Yards or equivalent to 123.74 Sq.Mtrs, Black No.2, situated at Meerpet old Village, Saroor Nagar Revenue Mandal, Ranga Reddy District, under Meerpet Grampanchayathi under registration Sub-District Champapet having purchased the same by way of a Regd. Sale Deed vide Doct.No.4242/1997 dated 17-09-1997 and bounded by: North : Plot No.84 & 85
South : 20' wide Road
East : 40' wide Road
West : Plot No.280 part

//ORDER OF THE COURT//
MEKALA DURGAIAH,
Advocate
OFF;Flot No; 228,2 nd Floor,L.P.T,Market, L.B.Nagar, R.R.District, Telangana-74 Cell:9948668713
Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM CHIEF JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
MVOP.NO.2389 OF 2023

Between:
K.Raja Reddy ...Petitioner
And
The TSRTC and others ...Respondents

To
Helalpur Baswaraj S/o.Ramanna Aged about 57Yrs, Occ: Driver of RTC Bus bearing No.AP 11 Z 1622 R/o.2-4-482, Krishna Nagar, Kachiguda, Hyderabad - 500027 ...Respondent no. 3

NOTICE

Please take notice, that the above named petitioner has filed the above OP for claiming compensation. The above said case is posted **on 06-09-2024 at 10-30 AM** for your appearance. Therefore you are directed to appear before the above Hon'ble Court either in person or through an advocate, if you fail to appear on the said date and time the matter will be decided in your absence as per law.

//By order of the Court//
P.CHANDRA MOULI
ADVOCATE
H.NO.8-1-58/5, Bangaru Enclave, Jyothinagar, Karmanghat, Hyderabad, Mob: 9246360785

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE: R.R.DISTRICT: AT: L.B.NAGAR
I.A.No. 471 of 2021
IN
O.S.No. 453 of 2021

Between:
Medireddy Vanitha & another ...Petitioners/Plaintiffs
And
Jonnada Darshan Reddy & others ...Respondents/Defendants

To,
R-2.Nimma Janga Reddy S/o. Ranga Reddy, R/o.Plot No.224, Laxmi Mega Township, Ragan naguda, Abdullapurmet (M), R.R.District
R-3.Vottikoti Thirumalesh S/o. V.Chittari, R/o. H.No.8-7-93/NE/P/2, Near Kasthuri Hostel, Ayodya Nagar Colony, Hastinapuram North Saroornagar Mandal, R.R.District-500079

Take notice that the above named plaintiffs filed the above suit against you seeking Partition and Separate Possession and Declaration, to Declare the Regd. Sale Deeds vide Doct. Nos.27554/2016 & 27556/2016, both dated 21-10-2016 and Doct.No.3561/2017 dated 26-07-2017 as null and void and not binding on the plaintiffs in respect of the suit schedule property and the said I.A. is posted to 13-08-2024 for your appearance. Hence you are hereby directed to appear either in person or through an advocate on the said date i.e., **13-08-2024 at 10:30 A.M.** before the above court, failing which the matter will be decided basing on the documents available on record.

//BY ORDER OF THE COURT//
A.H.CHAKRAVARTHY
Advocate,
H.No.19/A, Sai Kuteer, Santoshnagar Colony, Saidabad, Hyderabad - 59 Cell: 9391011576

IN THE COURT OF THE XII ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT: HAYATHANGAR
O.S.No.598 of 2024

Between:
Konda Andalu & others ...Plaintiffs
AND
The Tahsildar Abdullapurmet & Others ...Defendants

SUMMONS

To:
All Concerned

Take notice that the above named Plaintiffs have filed the above suit for declaration on declare them as legal heirs and successors of late Konda Shankar Goud who died on intestate on 09-10-2009 and also her estate mentioned as Suit Schedule of Property. The above said case stands posted **to 30-08-2024 at 10.30 a.m.** before the above said Hon'ble Court calling for objections if any from the general public and for their appearance. If anybody having any objections if any and if they fail to appear on the date and time mentioned above either in person or though pleader, the matter will be heard and decided in their absence in accordance with law.

Schedule of Property

All that Piece and Parcel of the Land bearing Plot No.17 Southern Part, admeasuring an area of 134.5 Sq.Yards or 112.45 Sq. Mtrs., in Survey No.622, situated at Pedda Amberpet Village and Grampanchayath, Hayathnagar Revenue Mandal (presently Abdullapurmet Mandal), Ranga Reddy District, Registration Sub-District, Pedda Amberpet and bounded by:
North: Plot No. 17 Northern Part;
South: Neighbor's land;
East: 25' Wide Road;
West: Plot No. 11;

//BY ORDERS OF THE HONOURABLE COURT//
Sd/-
M/s.S.SHEKHAR REDDY,
Advocates
D.No. 3-9-419/1, Saraswathinagar Colony, Mansoorabad, Hyderabad, Mobile 9848092440. Counsel for the Plaintiffs.

నేడు భారత రాజ్యాంగ సంక్షిప్తం గ్రంథావిష్కరణ

- హాజరుకానున్న ప్రముఖులు..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

మాజీ రాజ్యసభ సభ్యుడు ,బీసీసీఈ చైర్మెన్ టి.దేవేందర్ గౌడ్ తెలుగు, ఇంగ్లీష్ భాషలలో అందిస్తున్న భారత రాజ్యాంగ సంక్షిప్తం గ్రంథాన్ని తెలంగాణ హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ జి రాధా రాణి ఆదివారం ఆవిష్కరించనున్నారు.బీసీసీఇ ఇన్‌చార్జి ఇంద్రవెల్లి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం కోఠి హనుమాన్ టెక్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి) ఎండీ రియాజ్(గ్రంథాలయ సంస్థ చైర్మెన్) తిరుమలి (విశ్రాంత ఆచార్యులు ఢిల్లీ యూనివర్సిటీ) బీఎస్ రాములు (బీసీ కమిషన్ చైర్మెన్) పాశం యాదగిరి (సీనియర్ జర్నలిస్ట్) నల్ల సూర్యప్రకాశ్ (బహుజన ఫ్రంట్ నేత) నాగమ్మ పూలే (రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్), ఎం ఎఫ్ గోపీనాథ్ (డిఎం కార్డియాలజిస్ట్), దేవరపల్లి హరిప్రసాద్, దిగంబర్ కవి నగ్న మూని, సీఎల్ఎన్ గాంధీ, ప్రసాద్, ఎండీ రఫీ, జి రాములు, నాగన్న, తదితరులు పాల్గొని వారి సందేశాలు అందిస్తారని తెలిపారు.



శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసిన సుమధుర సంస్థ చైర్మెన్ గుండా మధుసూధన్, వైస్ చైర్మెన్ కె వి రామారావు, డైరెక్టర్లు కందుకూరి భరత్ కుమార్, గుండా నవీన్ కుమార్, మొరంచెట్టి శ్రీనివాస్‌లు తిరుమల జేఈఓ వెంకయ్య చౌదరిని కలిసి శ్రీ వెంకటేశ్వర అన్నదాన ట్రస్ట్ కు కోటి రూపాయల విరాళమును అందించారు. నవతెలంగాణ - సిటీబ్యూరో

ప్రజా రవాణాను పటిష్టం చేయాలి

- సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్
- పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



నవతెలంగాణ-అంబర్‌పేట్

ప్రజా రవాణాను పటిష్టం చేయాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్ కోరారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేయాలని కోరుతూ పార్టీ అంబర్‌పేట్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ చే నెంబర్ సిటీ బస్టాండ్ చౌరస్తాలో కరపత్రాలు పంచుతూ సంత కాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ దేశంలో వేగంగా విస్తరిస్తున్న నగరాలలో హైదరాబాద్ ఒకటన్నారు. కానీ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ట్రిబుల్ ఆర్ వరకు విస్తరించిన నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ అంతంత మాత్రమే ఉండడం, ప్రయివేటు వాహనాలు కొనుగోళ్లు పెరగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. దాంతో శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం తదితర సమస్యలతో నగర వాసులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం వల్ల అనేక సమస్యలు పరిష్కార మవుతాయని, పర్యావరణాన్ని రక్షించవచ్చు అని అన్నారు. కోటి 20 లక్షల మంది జనాభా ఉన్న నగరంలో కేవలం 2,800 సిటీ బస్సులు మాత్రమే నడుస్తు న్నాయని తెలిపారు. అవి కూడా సగాని సగం స్క్రాప్‌కు వెళ్లే బస్సులు ఉన్నాయన్నారు.జనాభాకనుగుణంగా 7000 బస్సులు డిమాండ్ ఉందని, కావున వెంటనే బస్సుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మెట్రో రైలు బోగీలను ఆరుకు పెంచాలని కోరారు. ఎంఎంటీఎస్ రైళ్లను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదన్నారు. వాటిని పునరుద్ధరించి రైళ్లను సమయానికి నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేపడతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు జి రాములు, బి.సుబ్బారావు, షబానా, వరలక్ష్మి, జనార్ధన్, రవి తదితరులు పాల్గొన్నారు.

20 నెంబర్ బస్సుల సంఖ్యను పెంచాలి

- 45 నెంబర్ బస్సు తిరిగి ప్రారంభించాలి
- సీపీఐ (ఎం) ముషీరాబాద్ నియోజకవర్గం కార్యదర్శి మద్దెల దశరథ్



నవతెలంగాణ - ముషీరాబాద్

కవాడిగూడ భోలక్ పూర్ నుంచి వెళ్లే 20 నెంబర్ బస్సుల సంఖ్యను పెంచి 45 నెంబర్ బస్సు తిరిగి ప్రారంభించాలని సీపీఐ (ఎం) ముషీరాబాద్ నియోజకవర్గం కార్యదర్శి మద్దెల దశరథ్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ముషీరాబాద్ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో కవాడిగూడ కల్పన బస్ స్టాప్ దగ్గర సంతకాల సేకరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కవాడిగూడ భోలక్ పూర్ నుంచి వెళ్లే 20 నెంబర్ బస్సులు పూర్తిగా తగ్గించడంతో ఉద్యోగులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గంటసేపు బస్టాండ్ లో నిలబడినా 20 నెంబర్ బస్సు రావడం లేదన్నారు. వచ్చిన బస్సు కూడా పూర్తిగా కిక్కిరిసిపోయే విధంగా వస్తున్నదని.. దాంతో విద్యార్థులు కాలేజీలకు, ఉద్యోగులు ఆఫీసులకు సరైన టైముకు వెళ్లలేక పోతున్నారని అన్నారు. దీనికి కారణం 20 నెంబర్ బస్సులను తగ్గించడమేనని వెంటనే 20 నెంబర్ బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే 45 నెంబర్ బస్సు అనేక సంవత్సరాలుగా భోలక్ పూర్ కవాడిగూడ మీదుగా వెళ్ళేదని.. ప్రస్తుతం ఆ బస్సును రద్దు చేయడంతో ప్రజలు అమీర్‌పేట్, బోరబండ, సనత్ నగర్ ప్రాంతాలకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. 45 నెంబర్ బస్సును తిరిగి వెంటనే ప్రారంభించాలని కోరారు. మహిళలకు ఉచిత ప్రయాణం అని చెప్పి ఉన్న బస్సులను తొలగిస్తే మహిళలు ఏరకంగా ప్రయాణం చేయగలుగుతారని ప్రశ్నించారు. నగరంలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు లక్షలలో ఉన్నారని.. దానికనుగుణంగా ఆర్టీసీ బస్సులు లేవన్నారు వెంటనే నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ ముషీరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు పి. విమల, బాబు నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, గద్వాల్ కష్ణ ,రామచందర్ ,రోజా, తదితరులు పాల్గొన్నారు.



'స్వచ్ఛదనం - పచ్చదనం' ను విజయవంతం చేయాలి

- జోనల్ కమిషనర్ టీ వెంకన్న

నవతెలంగాణ - ధూల్ పేట్

గ్రేటర్ పరిధిలో వక్ష సంపదను పెంచేందుకు ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. చాంద్రాయణగుట్ట నర్కి పూల్ బాగ్ లోని జోనల్ కార్యాలయం లో శనివారం జోనల్ కమిషనర్ అన్ని విభాగాలు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు జోనల్ కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులపాటు నిర్వహించే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమానికి సర్కిల్ డీసీల పర్యవేక్షణలో ఆరోగ్యం పారిశుధ్యం, యూసీడీ, అర్బన్ బయోడైవర్సిటీ, టాక్స్, ఎంటమాలజీ విభాగాల సమన్వయంతో ప్రత్యేక బందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా 5న పారిశుధ్య సమస్యల పరిష్కారానికి బస్తీలు, కాలనీ, వాణిజ్య సముదాయాలు , ఆర్టీసీ బస్టాండ్‌లు , రైల్వే స్టేషన్స్, స్మశాన వాటికలు, పార్కులో ప్లే గ్రౌండ్లలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. 6న దోమల కట్టడికి, ఫాగింగ్, వీధి కుక్కల బెడద నివారణ చర్యలపై కార్యక్రమం, 7న నీటి నిల్వలు, చెరువులు బావులు పరిశుభ్రత, 8న డ్రయినేజీ, నాలాల పుడికతీత పనులు, కమ్యూనిటీ హాళ్ల నిర్వహణ పై కార్యక్రమం ఉంటుందన్నారు. చివరి రోజు 9న వన మహెూత్సవం సందర్భంగా అన్ని బస్తీలు కాలనీలో, విద్యాసంస్థలు, ఇతర ప్రాంతాల్లో మొక్కలను పంపిణీ చేసి... ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నామన్నారు . ఈ కార్యక్రమాలకు ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మలక్ పేట్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్ నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు జయంత్, సురేందర్, సరిత, శ్రీనివాస్ రెడ్డి రవికుమార్, ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, టౌన్ ప్లానింగ్ సీపి శ్యామ్ కుమార్, ఈఈ లు నరేందర్ గౌడ్, హరి కిషోర్, పీర్ సింగ్, ఏకంబరం, ప్రకాశం, రవాణా విభాగం డీ సీ టి ఓ వినయ్ భూషణ్, ఈ సిడి డిపిఓ లు రాధమ్మ యుగంధర్ రెడ్డి, డీఈ లు, యూబీడీ, ఎలక్ట్రికల్ , ఆరోగ్యం, పారిశుధ్యం విభాగం, అధికారులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవడం సమిష్టి బాధ్యత



- సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె.నారాయణ
- కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

కనికరంలేని పరిస్థితిని ఎదుర్కొంటున్న వాయనాడ్ ప్రకతి విపత్తు బాధితులను ఆదుకోవడం మన సమిష్టి బాధ్యత అని సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ అన్నారు. ఊహించని ఘోరమైన వరదలు హృదయ విదారకమైన సంఘటన అని ఆవేదన వ్యక్తం చేసారు. కేరళ, వయనాడ్ విధ్వంసకర, వరదలు, కొండచరియలు విరిగిపడిన బాధితుల సహాయార్థం అబిడ్స్ సర్కిల్ నుండి శనివారం సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ నిర్వహించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి. నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి. స్టాలిన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం తదితరులతో కలసి అబిడ్స్, కోఠి, గన్ ఫౌండ్రి, బషీర్ బాగ్, లిబర్టీ తది తర ప్రాంతాల్లో డా. కె. నారాయణ విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేరళను సందర్శించే ప్రజలకు ప్రధాన పర్యాటక కేంద్రం వాయనాడ్ అని, సమద్ధిగా ఉన్న కొబ్బరి, తాటి చెట్లు, దట్టమైన అడవులు, వరి పొలాలు, ఎత్తైన శిఖరాలు కేరళలోని గొప్ప ప్రకతి దశ్యాలతో అలంకరించి ఉంటాయని, వీటిని రంక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైఉందన్నారు. హైదరాబాద్ ప్రజల స్వచ్ఛంద సహాయం వాయనాడ్‌లో స్థానభ్రంశం చెందిన ప్రజలకు, గాయపడిన వందలాది మంది బాధితులకు తక్షణ సహా యాన్ని పొందడంలో సహాయపడుతుందని, తెలిపారు. మానవతా ప్రతిస్పందనతో కేరళ రాష్ట్రంలో వందలా దిమంది సీపీఐ శ్రేణులు రెస్క్యూ ఆపరేషన్ టీం లలో భాగస్వాములై బాధితులకు అన్నిరకాలుగా సహాయం అందిస్తున్నారని చెప్పారు. వయనాడ్ బాధిత కుటుం బాలకు తక్షణ సహాయం, పునరావాసం అందించడమే సీపీఐ లక్ష్యం అని, ప్రకతి విపత్తుతో నిర్వాసితులుగా మారి, ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవడం దేశ ప్రజల బాధ్యత అని, వారికీ తక్షణ సహాయం, పునరావాసం అందించడానికి ప్రజలు ఉదారమైన విరాళాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు సలీం ఖాన్, కంపల్లి శ్రీనివాస్, పార్టీ నగర నేతలు ఆరుట్ల రాజ్ కుమార్, శక్రి బాయి, మహమూద్, చెట్టుకింది శ్రీనివాస్, కొంరెల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు

ఆపరేషన్ ధూల్‌పేట్‌లో గంజాయి పట్టివేత



- 5.068 కిలోల గంజాయి పట్టివేత..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఆపరేషన్ ధూల్‌పేట్ లో భాగంగా శనివారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్ అంజిరెడ్డి గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలహాసన్ రెడ్డి ఆదేశాల మేరకు ధూల్‌పేటలో అమ్మకాలు రవాణా వినియోగం పై దాడులు నిర్వహిస్తున్నారు. శనివారం 5.068 కేజీల గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లోని జియాగూడ పురాణపుల్ కమ్మరివాడ ధూల్‌పేట్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 2.550 గంజాయిని పట్టుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ధూల్‌పేట్‌లో గంజాయి పై దాడులు జరుగుతున్నాయి అనే సమాచారం మేరకు గంజాయి అమ్మకం దారులు డోర్ స్టెప్ వరకు గంజాయి సరఫరా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాంపల్లి, మాదాపూర్ గచ్చిబౌలి అత్తాపూర్ నాగల్ నగర్ ప్రాంతాల్లో గంజాయి కావాలని ఆర్డర్లు ఇచ్చినట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. ఇలాంటి వారి వద్ద నుంచి 2.518 గంజాయిని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. మొత్తం గా5.068 కేజీల గంజాయి మొత్తంగా పట్టుకున్నారు. ఈ రెండు చోట్ల దాడుల్లో కమ్మర్వాడి ప్రాంతానికి చెందిన నిఖిల్ కుమార్, అఖిలేష్ సింగ్, జియాగూడకు చెందిన అరుణ్ రావు, అమీష్,ఆశిష్, గణేష్ పి సాయికుమార్‌లను అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో అంజిరెడ్డి తో పాటు ఎక్సైజ్ సిఐలు మధుబాబు గోపాల్,ఎమ్మార్పీ చంద్రశేఖర్ భాస్కర్ రెడ్డి, ఉమామహేశ్వరరావు సాయి కిరణ్ అజీజ్ ప్రకాష్ మహేష్ రాకేష్ లు ఉన్నారు. గంజాయిని పట్టుకున్నందుకు సీఐలను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమల్ హసన్ రెడ్డి అభినందించారు.



సీఎంఆర్ఎఫ్‌ను ప్రజలు సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ - ముషీరాబాద్

సీఎంఆర్ఎఫ్‌ను ప్రజలు సద్వినియోగించుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసానిస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో శంకర్ ముదిరాజ్, కేశవపురం అరుణ్, ముదిగొండ మురళి, సుధాకర్ గుప్తా, మీడియా ఇన్‌చార్జి ముచ్చ కుర్తి ప్రభాకర్, కళ్యాణ్ నాయక్, గందు వెంకటేష్, శివ యాదవ్, రమేష్ రెడ్డి, మున్నా, శ్రీకాంత్, బలవంత రాజ్, తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు తక్షణమే షెడ్యూల్‌ను ప్రకటించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు



నవతెలంగాణ - ముషీరాబాద్

తక్షణమే కుల గణనకు షెడ్యూల్ ను ప్రకటించాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్ బీసీ భవన్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో బీసీ కుల గణన కై నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల గణను చేసి చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి కేంద్ర, రాష్ట్ర మంత్రులను, ప్రజా ప్రతినిధులను తిరగనివ్వమని హెచ్చరించారు. కేంద్రం తక్షణమే బిల్లు పెట్టాలని లేకుంటే తామే బీసీలకై ప్రయివేటు బిల్లు పెట్టిస్తే ఈ ప్రభుత్వాలకు ఉనికి ఉంటుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పెంపు, కులగణన అంశంలో బలహీనమైన ప్రయత్నాలు చేసి చేయి దులుపుకుంటామంటే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి. చిరంజీవులు మాట్లాడుతూ కులగణన మొత్తం వ్యవహారం రెండు నెలల్లో పూర్తవుతుందని తన గత అనుభవాలను అవకాశాలను వెల్లడించారు. ప్రొఫెసర్ సింహాద్రి మాట్లాడుతూ కులగణన సమాజ సమగ్ర దర్పణమని, దీని ద్వారానే బీసీలకు బహుజనులకు సంపూర్ణ రాజ్యాధికారం సిద్ధించి అసమానతలు రూపుమాపడమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి సహధ్యక్షులు వేముల రామకృష్ణ, గుజ్జసత్యం కోలా జనార్ధన్, నీల వెంకటేష్, భరత్ కుమార్, నందగోపాల్, సతీష్, పద్మ గౌడ్, రాజేందర్, అనంతయ్య జక్కుల వంశీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, తదితరులు హాజరయ్యారు

యాప్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు విధానంపై అవగాహన

నవతెలంగాణ-ధూల్ పేట్



ప్రభుత్వం రూపొందించిన టీజీ ఎస్పీడీసీఎల్ యాప్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు విధానంపై అత్తాపూర్ ఏడిఈ వెంకటేష్ గౌడ్ ఫ్రెండ్స్ కాలనీ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఫ్రెండ్స్ కాలనీలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ నేరుగా వినియోగదారులతో మాట్లాడుతూ.. కొత్తగా రూపొం దించిన యాప్ లో బిల్లులో చెల్లింపు ఎంతో సులభతరమని సూచించారు. వినియోగదారులను ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించే విధంగా ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ ఏఈ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



- ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

దళితుల్లో కులగణన నిర్వహించిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి అన్నారు. శనివారం కోఠి హనుమాన్ టెక్డి లోని బీసీ సాధికారక భవన్ లో నిర్వహించిన ఎస్సీ 57 ఉపకులల పోరాట సమితి రాష్ట్ర కమిటీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదిగలు,ఉపకుల సుధీర్ఘ పోరటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని రంగాలలో దళితుల పక్కా సమాచారాన్ని తీసుకున్న తర్వాతనే వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచించిందన్నారు. దళితుల్లో కులగణనను చేపట్టిన అనంతరమే జనాభా దామాషా ప్రకారం శాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే రిటైర్డ్ జడ్జితో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

గతంలో ఏర్పాటు చేసిన రామచంద్రయ్య రాజు, ఉష మెహరలో కుమార్ కమిషన్‌లు స్పష్టంగా తెలుపుతూ ఉప కులాల అభివృద్ధి కోసం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చాయని గుర్తు చేశారు. దళితుల్లోని మాల, మాదిగలకు, తహసీల్దార్ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తే ఉప కులాల వారికి మాత్రం ఆర్డీవోలు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడమేంటని ప్రశ్నించారు. గతంలో 57 ఉప కులాలలో ఐదు ఉపకలాలకు మాత్రమే ఎమ్మార్వో నుంచి కుల దవీకరణ పత్రాలు పొందేందుకు అనుమతి ఇవ్వగా మిగతా 52 కులాలు నేటికి ఆర్డీవోల నుండి కుల ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు ఎన్నో ఇబ్బందులను కష్టాలను ఎదురు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం 59 దళిత కులాలలో 63 లక్షల జనాభా మాల మాదిగ కాకుండా మిగిలిన 57 ఉపకులాల వాస్తవ జనాభా 30 లక్షల వరకు ఉంటుందని అన్నారు. సమావేశంలో ఎస్సీ ఉపకులాల కుల పోరాట సమితి నాయకులు నీరకొండ బుచ్చన్న గోసంగి, చంద్రగిరి సత్యనారాయణ, జాడి ముసలయ్య నేతకాని, మాటపతి నాగయ్య స్వామి బుడుగ జంగం, బోలె పెద్దయ్య, సాయిని ప్రసాద్ నేత, తుల్జాపూరి శోభతాయి మహర్, కర్నే రామారావు డక్కలి, ఫస్ట్ టైం కుమారు బౌద బుడగ జంగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల అవార్డుల ప్రదానోత్సవం..



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఇంజినీరింగ్ కళాశాల అకాడమిక్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం కళాశాల అసెంబ్లీ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-2024 విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొత్తం 22 బంగారు పతకాలు, నగదు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ ఎన్. బలరాం మాట్లాడుతూ. విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతున్న రంగాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. వీటి ద్వారా దేశంలో యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని పేర్కొన్నారు. యువకులు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించేందుకు అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని తెలిపారు. సంస్థలు స్థాపించి కేవలం ఉన్న అవకాశాలనే కాకుండా ఎగుమతులు చేసే దశకు చేరుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ పూర్తి అయిన వారికి ఒక రకంగా ఇక్కడి ప్రయాణం ముగిసినప్పటికీ, మరో విద్యాపరమైన కోర్సు, ఉద్యోగిగా మరో ప్రస్థానం ప్రారంభమవుతుందని చెప్పారు. నేర్చుకునే ప్రక్రియ మాత్రం నిరంతరం కొనసాగాలని సూచించారు. వర్సిటీలో చదివిన ప్రతి ఒక్కరి భవిష్యత్తు నిర్మాణానికి ఇక్కడ నేర్చుకున్నది పునాదిగా ఉపయోగపడుతుందని అన్నారు. అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో అత్యున్నత ప్రతిభ ప్రదర్శించిన కళాశాల పూర్వ విద్యార్థిని ఎంపికచేసి అందిస్తున్న విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారాన్ని అమెరికాకు చెందిన కృష్ణ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ వ్యవస్థాపకుడు గోపాల్ టీకే కృష్ణకు అందించారు. ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కళాశాలకు వచ్చిన తనకు ఇక్కడ ఇలాంటి గౌరవం పొందడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, అది సాధించే వరకు కష్టపడాలని సూచించారు. జ్ఞానాన్ని సాటి వారితో పంచుకున్నప్పుడే అది మరింత వృద్ధి చెందుతుందని చెప్పారు. మొత్తం కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించిన సాయి మానస ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో యుజి బీఈ పూర్తి చేసుకున్న 325 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పప్పుల. లక్ష్మీనారాయణ, మోస్చిప్ టెక్నాలజీస్ ఎండీ, సీఈవో శ్రీనివాస కాకుమాను, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పైడిమర్రి. చంద్రశేఖర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నర్సింహులు సాంకె, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ విజయ్కుమార్, సీడాక్ డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణయ్య, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఇంజనీరింగ్ కళాశాల ఉద్యోగులు ,పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అదృశ్యం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఆడుకోవడానికి వెళ్లిన చిన్నారి అదృశ్యమైన సంఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంబజార్ చత్రికి చెందిన ప్రియాంక గృహిణికి 6 ఏండ్ల కూతురు ప్రగతి ఉంది. ప్రియాంక సోదరి కొడుకు 4 ఏండ్ల వృతిక్‌తో కలిసి ప్రగతి శనివారం సాయంత్రం కట్టెలమండిలోని ముత్యాలమ్మ దేవాలయంలో ఆడుకోవడానికి వెళ్ళింది. బాబు ఇంటికి రాగా కూతురు ఎంతకీ రాకపోవడంతో తల్లి ఆ దేవాలయానికి వెళ్లి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికిన ప్రయోజనం లేకపోవడంతో అబిడ్స్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెదరని బంధం స్నేహం

మహిళలకు లెక్కకు మించిన బాధ్యతలు. ఇక పెండ్లి తర్వాత ప్రపంచమే మారిపోతుంది. అందుకే మగవాళ్లలా తమ చిన్ననాటి స్నేహాలను కొనసాగించలేరు. బాధ్యతల నడుమ తమ గురించి తామే మర్చిపోతుంటారు. ఇక స్నేహితలను ఎక్కడ గుర్తు పెట్టుకుంటారు. వారితో మాట్లాడే తీరికే ఉండదు. కానీ మనకు ఆనందాన్ని పంచేది.. అనుబంధాన్ని పెంచేది స్నేహం ఒక్కటే. స్నేహానికి కులం లేదు, మతం లేదు. స్నేహానికి హోదా లేదు. నవ్వు వెనుక బాధను.. మౌనం వెనుక మాటలను.. కోపం వెనుక ప్రేమను.. అర్థం చేసుకునే వారే నిజమైన స్నేహితులు. నిజమైన స్నేహాన్ని గుర్తించండి, ఆ స్నేహం కలకాలం ఉండేలా కాపాడుకోండి. ఈరోజు **స్నేహితుల దినోత్సవం** సందర్భంగా స్నేహం గురించి కొందరు రచయితలు తమ మనసులోని భావాలు మానవితో ఇలా పంచుకున్నారు...

స్నేహానికి స్నేహమే సాటి

ప్రతి మనిషికీ స్నేహం అనేది సపోర్ట్ సిస్టమ్ లాంటిది. మంచి కుటుంబం, స్వచ్ఛమైన స్నేహం లభించిన వారికంటే అదృష్టవంతులు మరెవ్వరూ ఉండకపోవచ్చు ఈ ప్రపంచంలో. మంచి స్నేహం లభించిన వారు ఎక్కువకాలం ఆనందంగా జీవించే అవకాశం ఉందని ఎన్నో సర్వేలు తేల్చి చెప్పాయి. కుటుంబంతో పంచుకోలేని అనేకానేక విషయాలు పంచుకునే స్వేచ్ఛ స్నేహితుల వద్ద ఉంటుంది కనుకే చాలా ఆనందంగా ఎక్కువకాలం జీవిస్తారనుకుంటా. నాకు బాల్యం నుంచీ మంచి స్నేహితులే దొరికారు. ఎక్కువగా ఆడపిల్లలే కావడంతో, వారంతా బాల్య వివాహాలతో అత్తగారిళ్లకు వెళ్లి పోయారు. స్కూల్ లైఫ్‌లో అయిదో తరగతి వారు పదో తరగతి లో లేరు. పదో తరగతి వారు ఇంటర్మీడియట్‌కు చేరలేదు. ఇంటర్‌లో కట్ అయిన వారున్నారు. ఇంటర్, డిగ్రీ దాకా చేరి డిగ్రీలో పెళ్ళిళ్ళతో వెళ్ళిపోయినవారున్నారు. నేను పుట్టి పెరిగిన గ్రామీణ వాతావరణమే ఇందుకు కారణం. ఈమధ్యే మా పదో తరగతి క్లాస్మేట్స్ టచ్‌లోకి వచ్చారు. ఆ ఆనందం మాటల్లో చెప్పలేను. హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత స్నేహం వెలితి బాగా కనిపించేది. జర్నలిజం... అందు లోనూ రిపోర్టింగ్ ఫీల్డ్‌లోకి వెళ్లిన తర్వాత నా ప్రపంచ పరిధి విస్తరించడం మొదలైంది. నా వృత్తిలో చాలామంది స్నేహితులు లభించారు. చాలా ఏండ్లుగా చాలామందితో స్నేహం కొనసాగుతూనే ఉంది. గాఢ స్నేహం లేకున్నా, ఏదీ తాత్కాలికమైనది కాదు. సాహితీ ప్రపంచంలో మటుకు భావోద్వేగాలు అధికం. స్నేహితులు కూడా అటువంటి వారే. నాకు సాహితీ ప్రపంచంలోకి అడుగు పెట్టిన తర్వాత తెలంగాణ సాహితి రూపంలో పెద్ద సపోర్ట్ సిస్టమే లభించింది. తొలుత సలీమాతో ఆ స్వచ్ఛమైన స్నేహం లభించింది. తర్వాత అనంతోజు మోహనకృష్ణ, తర్వాత ఆనందాచారి సర్.. ఆ తర్వాత అందరూ కుటుంబ స్నేహితులైపోయారు. మా సమూహంలోకి మేరెడ్డి రేఖ ఆలస్యంగా వచ్చినా తనస్నేహ మాధుర్యంతో చేరువయ్యారు. వీరందరితో లిమిట్లెస్ అంశాలు చర్చించగల స్వేచ్ఛ ఉంది. కరోనా మొదటి వేవ్ నుంచి నేనూ, నా కుటుంబం ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న అనేకానేక భావోద్వేగాలకు వీరినుంచి లభించే మద్దతు నాలోని స్థైర్యానికి మరింత ఊతమిస్తుంది. ఈ సందర్భంగా తెలంగాణ సాహితిని నాకు పరిచయం చేసిన, నన్ను తెలంగాణ సాహితికి పరిచయం చేసిన కవి, నేను అంకుల్ అని ప్రేమగా పిలుచుకునే కపిల రామ్ కుమార్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు చెప్తున్నాను.



- నస్రీన్ ఖాన్

ఓరిమి, క్షమ ఉంటేనే...

అస్తిత్వాలు,అంతరాలు అర్థమవుతున్న కొద్దీ స్నేహాలు నిలుపుకోవడం కష్టమైన పనే అవుతుంది. క్షమించడం, అర్థం చేసుకోవడమే కాక, ఎదిగే సమయాన్నివ్వడం, అప్పటిదాకా ఒకరినొకరు కనిపెట్టుకుని ఉండడమే స్నేహానికి సూత్రం. తరతమ బేధాలు లేకుండా, కులమత విద్వేషాలు లేకుండా ఇదివరకటి స్నేహాలు నడిచేవి. అందరూ కలిసి వేడుకలు చేసుకునే వాతావరణం అంతటి వివక్షలో నూ సాగేది. కాని ఇప్పుడు ఆర్థికస్థాయి బట్టే చదువులు, ఆ చదువులబట్టే ఉద్యోగాలు. పేద, ధనిక వర్గాలు కలిసి ఒకే విషయం నేర్చుకోవడం లేదా పని చేయడం అనే వాతావరణమే లేదిప్పుడు. సహజీవనం తక్కువవు తున్న కొద్దీ ఇద్దరి మధ్యా దూరం పెరిగిపో తోంది. మనలాగా ఆలోచించని వారంతా మన శత్రువులే అనుకునే ఈ సమయాల్లో స్నేహానికి చాలా ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఓరిమి, క్షమ ఈ రెండూ ఉన్న చోటనే స్నేహం మనగలుగుతుంది.



- అపర్ణ తోట

ఎన్నో అనుబంధాల కలయికే స్నేహం

స్నేహం గొప్పదా ప్రేమ గొప్పదా అని ఎవరైనా అడిగితే, ఎటువంటి సందేహం లేకుండా స్నేహమే గొప్పదని చెప్పవచ్చు. నిస్వార్థ మైన స్నేహం స్నేహితులని మరింత ముందుకు తీసుకెళ్తుంది. జీవితంలో స్నేహ బంధం అంత మధురమైనది. స్నేహం అంటే భుజం మీద చెయ్యేసి నడవటమే కాదు, నీకెన్ని కష్టాలు వచ్చినా నీ వెనుకే నేనున్నానని భుజం తట్టి చెప్పడం. ఇలా మనం స్నేహం మీద ఎన్నో వింటూ ఉంటాం. సులభంగా లభించేది మోసం. కష్టంగా లభించేది గౌరవం. హృదయంతో లభించేది ప్రేమ. అదృష్టం కొద్దీ లభించేది స్నేహం. స్నేహాన్ని వర్ణించటానికి తెలుగు భాషలోని పదాలు సరిపోవేమో.. అంత మధురమైనది స్నేహం. నిజమైన స్నేహం కష్ట కాలంలో తెలుస్తుంది అంటారు. ఇది అక్షర సత్యం. స్నేహం అనే భావనలో చేసిన అల్లరి, చిలిపి పనులు ఆనందించే అనుభవలెన్నో. స్నేహం అనే మాధుర్యంలో ఒకరిపై ఒకరు చూపించే శ్రద్ధ, తనో పట్ల తాను అశ్రద్ధ వహిస్తే కోప్పడుతూ కురిపించే మమకారాలెన్నో. స్నేహం అనే బంధంలో పంచుకునే బాధలెన్నో. నిజమే ఎప్పుడు మనసు కలత చెందినా, ఏ మాత్రం ఇతరుల వల్ల మనసు గాయపడినా స్నేహితులకు చెప్పుకుని ఓదార్పు పొందిన సంఘటనలు మనకు నిత్య జీవితంలో ఎదురవుతూనే ఉంటాయి. స్నేహం విలువ ఇప్పటి తరం వారికి తెలియటం లేదనే అనాలి. స్వార్థంతో చేసేది నిజమైన స్నేహం కాదు. నమ్మకం, ధైర్యం, భరోసా, లాలన, ప్రేమ, అభిమానం ఇలా ఎన్నో అనుబంధాల కలయికే స్నేహం. మరిచే స్నేహం ఎప్పుడు చేకయకండి. అలాగే చేసిన స్నేహాన్ని మరువకండి. జీవితంలో నిజమైన స్నేహితుడిని వెతకడానికి ముందు మనం ఒక నిజమైన స్నేహితునిగా జీవించాలి. ఎలాంటి స్థితిలో అయినా నిన్ను అర్థం చేసుకునేవారు, నువ్వు ఏ స్థాయిలో వున్నా నీతో ఉండేవారు, నువ్వు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకునేవాడే అసలైన స్నేహితుడు.



- పాలపర్తి సంధ్యారాణి

నమ్మకమే స్నేహానికి పునాది

'మనిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్‌గా ఉందామా' అని అడిగింది ఆరవ తరగతిలో నా క్లాస్మేట్ శ్రావణి. 'అంటే ఏం చేయాలి' అనడిగితే 'మనిద్దరమే కలిసి ఉండాలి. సీక్రెట్స్ చెప్పుకోవాలి, ఫుడ్ షేర్ చేసుకోవాలి, కలిసి ఆడుకోవాలి, ఒకే టీమ్‌లో ఉండాలి, ముఖ్యంగా వేరే ఎవరితో మాట్లాడకూడదు' అని చెప్పింది. నేను రెండో రోజే ఆ పరీక్షలో విఫలమయ్యాను. ఒప్పందాలతో వచ్చిన బెస్ట్ ఫ్రెండ్‌ని కోల్పోయాను. పెద్దయ్యే కొద్దీ అర్థమైంది స్నేహితులు యాదృచ్ఛికంగా వచ్చి మనతో, మనలో పెనవేసుకుపోతారని. ఏండ్లుగా కలిసి పెరిగి జీవితకాలం ఉంటారనుకున్న స్నేహితులు చిన్న మనస్పర్థలకే విడిపోవడం చూశాను. కేవలం తెలిసిన వారిగా ఉంటారనుకున్నవాళ్ళు వెన్నంటే ఉండడమూ చూశాను. అలాంటి స్నేహితురాలే నిత్యా మణికృష్ణన్. మా కథలో పెద్ద త్యాగాలు లేవు. ఒకరి కోసం ఒకరు చేసుకున్న సహాయాలూ లేవు. ఒకరికి ఒకరు తోడుగా ఉండడం తప్ప. మనకి అన్నీ ఉన్నా సలహాలు సూచనలు మంచీ చెడులు చెప్పేవారు ఉండకపోవడమే పెద్ద లోటు. ఆ లోటును 18 ఏండ్లుగా నా జీవితంలో పూరిస్తూనే ఉంది నిత్య. మనల్ని బాధ్యతతో ప్రేమించేవారు, సంరక్షించే కుటుంబం దొరికినా దొరకపోయినా జీవితం ముందుకు నడుస్తుంది. నమ్మకంగా అన్నీ చెప్పుకోగలిగే ఒక్క ఫ్రెండ్ లేకపోవడం దురదృష్టమే. ఆ బాధ నిజమైనది. కుటుంబం లేకపోయినా ఉండగలగడం మంచి ఫ్రెండ్ లేకపోతే ఉండలేకపోవడం అతిశయోక్తిగా అనిపించినా నీకంటూ ఓ నమ్మకమైన మనిషి లేకపోవడం బాధాకరమే. నాకెప్పుడూ ప్రేమకు మించింది స్నేహం అనిపిస్తుంది. మీరు గొప్ప ప్రేమికులుగా మిగిలారంటే మీలో నమ్మకమైన స్నేహితులున్నారని అర్థం. ఈ సందర్భంగా నా ఫ్రెండ్ నిత్యకి హ్యాపీ ఫ్రెండ్షిప్ డే.



- మానస ఎండ్లూరి

మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

శ్రీదేవిని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌గా నియమించారు. రవాణా, ఆర్అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌ను, పురపాలక శాఖ డిప్యూటీ సెక్రెటరీగా ప్రియాంకను, విపత్తుల నిర్వహణ విభాగం సంయుక్త కార్యదర్శిగా ఎస్.హరీశ్‌ను బదిలీ చేశారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా పి.ఉదయ్ కుమార్‌కు, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా రిజ్వీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. హాకా ఎమ్‌డీగా చంద్రశేఖర్ రెడ్డినీ, మార్క్‌ఫెడ్ ఎండీగా శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. ఇటీవలే పలు జిల్లాల్లో కలెక్టర్ల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం పాలనాపరమైన ప్రక్షాళనలో భాగంగా పెద్దఎత్తున ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తోందని సమాచారం.

మూడునెలల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

లబ్ధిచేకూరనుందని పేర్కొన్నారు. అక్రమాలకు తావులేకుండా నిబంధనల ప్రకారమే భూముల క్రమబద్ధీకరణ చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ప్రభుత్వం మీద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారనీ, మధ్య దళారుల ప్రమేయం లేకుండా సాధారణ ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గత ప్రభుత్వం ఆగస్టు 31 నుంచి 2020 అక్టోబర్31వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించిందని మంత్రి తెలిపారు. ఆ సమయంలో 25.70 లక్షల దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో "హెచ్ఎండీఏ పరిధిలో 3.58 లక్షలు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1.06 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో పరిధిలో 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల్లో 6 లక్షలు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో 1.35 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గత నాలుగేండ్లుగా ఈ దరఖాస్తులు ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదు" అని మంత్రి పేర్కొన్నారు. వీటిని అత్యంత ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందుకోసం జిల్లాల్లో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసుకోవాలనీ, సిబ్బంది కొరత ఉంటే రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని సూచించారు

పరిశీలనకు మల్టీ డిసిప్లీనరీ బృందాలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లీనరీ బందాలను ఏర్పాటుచేయాలని కలెక్టర్లను పొంగులేటి ఆదేశించారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులపై జారీచేసిన నోటీసులకు సంబంధించిన సమస్యలను నివత్తి చేసేందుకు అన్ని జిల్లా కలెక్టరేట్లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు (హెల్ప్ డెస్కు) వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మున్సిపాల్టీలు మినహా మిగిలిన ప్రాంతాల దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో భాగస్వాములయ్యే అధికారులకు వెంటనే శిక్షణ అందించాలని పేర్కొన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఏడు జిల్లాల్లో అత్యంత విలువైన భూములున్నాయనీ, వీటిపై నిర్ణయం తీసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

నాలుగు దశల్లో పరిశీలన

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నాలుగు దశల్లో పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటేనే క్రమబద్ధీకరిస్తారు. ఆగస్టు మొదటి వారం నుంచి ఈ ప్రక్రియను ప్రారంభం కానుంది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి మార్గదర్శకాలను జారీచేశారు. ప్లాట్ల అప్లికేషన్లను మూడు దశల్లో, లే అవుట్ల దరఖాస్తులను నాలుగు దశల్లో పరిశీలించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అనంతరం వాటిలో అర్హమైన వాటికి నిర్ణీత ఫీజులు వసూలు చేసి ఆమోదిస్తారు. ఈ క్రమంలో వచ్చే అభ్యంతరాలను సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారు. ప్రభుత్వ భూములు, కోర్ట్ కేసులు, ఇతర వివాదాస్పద భూముల విషయంలో కింది స్థాయిలో పొరపాట్లు జరగకుండా కలెక్టర్లు నిత్యం మానిటరింగ్ చేయనున్నారు.

మాఫీ కాని చిక్కులు

(మొదటిపేజీ తరువాయి)



పథకం కోసం పంపించడంతో సంబంధిత ఖాతాదారులు అర్హత కోల్పోతున్నారు. ఖమ్మంలోని ఐడీబీఐ బ్యాంకు నుంచి ఈ తరహా సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమయ్యాయని తెలుస్తోంది. అన్ని బ్యాంకుల్లో ఏ రోజైతే రెన్యువల్ చేస్తారో ఆ తేదీనే లోన్ మంజూరు చేసినట్టుగా పేర్కొనగా.. ఐడీబీఐ మాత్రం దీనికి విరుద్ధంగా ఏ తేదీన తొలిసారి లోన్ మంజూరైందో దాన్ని పంపించడంతో ఈ బ్యాంకుకు చెందిన అనేక మంది రైతులు అర్హతున్నా.. మాఫీ స్కీమ్‌ను కోల్పోతున్నారు. రెన్యువల్ తేదీ ఆధారంగా ఫైల్స్‌ను పంపించకపోవడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమైనట్టుగా తెలుస్తోంది. చింతకాని మండలం నుంచి అత్యధిక రైతులు ఖమ్మంలోని ఈ ఐడీబీఐ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు. ఇప్పుడు వారందరిలో ఆందోళన నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా ఖాతాలు సుమారు మూడు లక్షల వరకు ఉన్నట్టు తెలుస్తోంది.

రూ.2 లక్షల కంటే ఎక్కువుంటే చెల్లిస్తేనే మాఫీనట..!

రూ.2 లక్షల కంటే ఎక్కువగా రుణం ఉంటే.. ఆ అదనపు మొత్తాన్ని చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని బ్యాంకర్లు రైతులను భయాందోళనకు గురిచేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఏమి చేయాలో అర్థం కాని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు బ్యాంకర్లు మాత్రం రూ.2 లక్షలు మాఫీ అయ్యాక, ఆపైన అదనంగా ఉన్న డబ్బులు చెల్లించి కొత్త లోన్ తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇలాంటి సమస్యలు చాలాచోట్ల ఉన్నాయి. గ్రీవెన్స్ డెస్కులు కేవలం స్టేటస్ చెప్పడం తప్ప కచ్చితమైన సమాధానాలు ఇవ్వలేకపోతున్నాయని బాధితులు అంటున్నారు.

హెల్త్ పాలసీల కోసం బ్యాంకుల ఒత్తిడి....

కొలనుపాకలోని ఓ ప్రధాన బ్యాంకు బ్రాంచ్‌లో రైతుల అకౌంట్స్‌లో వేసిన మొత్తంలో ఒక్కొక్కరి నుంచి 30,000 రూపాయలు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం కింద బ్రాంచ్ మేనేజర్ తీసుకున్నట్టు తెలిసింది. దాదాపు 20 మంది రైతుల నుంచి వసూలు చేసినట్టు సమాచారం. ఇది నిబంధనలకు విరుద్ధం. మరికొన్నిచోట్ల హెల్త్ పాలసీ తీసుకుంటే బాగుంటుందని బ్రాంచీ మేనేజర్‌లు రైతులకు చెబుతున్నప్పటికీ, ఒత్తిడి మాత్రం చేయడం లేదని తెలుస్తోంది. రుణమాఫీ డబ్బులను ఇతర వాటికి జమ చేసుకోకుండా చూడాలని ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించిన విషయం తెలిసిందే. సాంకేతిక కారణాలతో మొదటి విడత రుణమాఫీలో 17,877 ఖాతాలకు సంబంధించి 84.94 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో పడలేదని, వాటిని పరిష్కరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో ప్రకటించారు. మొదటి విడతలో సమస్యలు పరిష్కారం కాలేదని, రెండోవిడతలోనూ చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను పలుచోట్ల బ్యాంకర్లు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

ఫీజు కడితేనే సీటు!

(మొదటిపేజీ తరువాయి)



రూ.45 వేలు కడితేనే సీటు కేటాయిస్తామని ఆ కాలేజీ అధ్యాపకులు చెప్పారు. తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని వారు చెప్పారు. ట్యూషన్ ఫీజు కడితేనే సీటు ఇస్తామని అధ్యాపకులు స్పష్టం చేశారు. 'ఫీజు రీయింబర్స్ మెంట్‌కు దరఖాస్తు చేస్తే ఆ ఫీజు ప్రభుత్వం చెల్లిస్తే తీసుకోండి. అది విద్యార్థుల అకౌంట్‌లోకే వస్తుంది. కాలేజీకి మాత్రం ఇప్పుడే మొదటి సెమిస్టర్ ట్యూషన్ ఫీజు కట్టాలి' అంటూ హుకుం జారీ చేశారు. దీంతో ప్రభుత్వ వ్యవసాయ ఇంజినీరింగ్ కాలేజీ అధ్యాపకులు ఇలా వ్యవహరించడంపై ఆ విద్యార్థి, ఆమె తండ్రి ఆందోళనకు గురయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్నా, అలాట్‌మెంట్ ఆర్డర్‌లో సున్నా ఫీజు అని ఉన్నా కాలేజీ ఫీజు రూ.45 వేలు ఎలా కట్టాలంటూ ఆవేదన చెందారు. ఆమెతోపాటు మరో ఎస్సీ విద్యార్థి, ఇద్దరు ఎస్టీ విద్యార్థులు కూడా ఆ కాలేజీకి వెళ్లారు. వారికీ ఇదే అనుభవం ఎదురైంది. దీంతో ఏం చేయాలో తెలియక వారు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి ఈ ఒక్క కాలేజీలోనే లేదు. మెజార్టీ కాలేజీల్లో ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చాక తీసుకోవాలంటూ విద్యార్థులకు చెప్తున్నాయి. అయితే ఫీజు రీయింబర్స్ మెంట్‌కు అర్హత ఉన్న విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలను ప్రభుత్వ ప్రయివేటు కాలేజీలు బేఖాతరు చేస్తున్నాయి. నిబంధనలను పాటించకుండా విద్యార్థులను ఫీజు చెల్లించాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాయి. దీన్ని అరికట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తులు

అగ్రికల్చరల్ ఇంజినీరింగ్‌లో సీటు వచ్చిన ఆ విద్యార్థి శుక్రవారం ఇంజినీరింగ్ ప్రవేశాల క్యాంపు అధికారులను సంప్రదించారు. తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆ అధికారి స్పందించి వ్యవసాయ ఇంజినీరింగ్ కాలేజీకి ఫోన్ చేస్తే ఫీజు కట్టాల్సిందేనంటూ అధ్యాపకులు సమాధానమిచ్చారు. ప్రభుత్వ ఆదేశాలు అలా లేవని చెప్పినా వినిపించుకోవేలేదు. దీంతో వారు శనివారం ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రిని కలిసి సమస్యను వివరించారు. దీనిపై ఆయన స్పందించి ఈనెల 16,17 తేదీల్లో కాలేజీల్లో చేరేందుకు గడువుందనీ, అప్పటి వరకు ఆగాలని వారికి సూచించారు. ఈ అంశాన్ని వ్యవసాయ విశ్వ విద్యాలయం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. సీటు వచ్చిన విద్యార్థులు ఆందోళన చెందొద్దని కోరారు.

దోస్త్ ప్రత్యేక విడత

రిజిస్ట్రేషన్ గడువు 5 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ గడువును ఈనెల ఐదో తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెబ్‌ఆప్షన్ల నమోదు గడువును ఈనెల ఐదో తేదీ వరకు పొడిగించామని పేర్కొన్నారు. ఏడో తేదీన ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అదేనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలనీ, ఫీజు చెల్లించాలని కోరారు. ఆయా తేదీల్లోనే కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.



చివరి ఆయకట్టుకూ సాగు నీరందిస్తాం

నవతెలంగాణ-కూసుమంచి

ఈ వ్యవసాయ సీజన్ కాలానికి ఆయకట్టు పరిధిలో చివరి ఎకరాకు కూడా సాగునీరు అందిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి పాలేరు రిజర్వాయర్ నుంచి శనివారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎన్నెస్పీ అధికారులతో కలిసి గేటు ఎత్తి పాతకాల్వకు నీరు విడుదల చేశారు. అనంతరం ఎర్రగడ్డ వద్ద భక్త రామదాసు ఎత్తిపోతల పథకం నుంచి ఈ ప్రాజెక్టు పరిధిలోని మండలాలకు సాగునీరు విడుదల చేశారు. ఇక్కడ ప్రాంగణంలో మొక్క నాటాక.. మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చాక.. దేవతల దీవెనలు కూడా దక్కి.. మంచి వర్షాలు కురిసాయని, కృష్ణా పరివాహక పరిధిలో శ్రీశైలం నిండిందని, నాగార్జునసాగర్ నిండే దశకు చేరిందని అన్నారు. సాగర్ కాల్వ వెంట లోటుపాట్లు తెలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఎన్ఎస్‌పీ అధికారులను ఆదేశించారు. రైతులకు మేలు చేయాలని, వారిని రాజులను చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందుకే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఇంత తక్కువ కాలంలో సాగుదారుల సంక్షేమానికి కృషి చేసిన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో రూ.7లక్షల 16 వేల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక రోజుకు 16, 17 గంటలు కష్టపడుతూ ఆర్థిక వ్యవస్థను గాడిలోకి తెస్తున్నామని చెప్పారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ కలిసి.. రైతులను నిలువునా ముంచేలా ధరణిని ప్రవేశపెట్టారని, రైతులను గోస పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం జాతీయ స్థాయిలో సర్వే చేపట్టి అందరికీ ఆమోదయోగ్యంగా.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే సరికొత్త పథకాన్ని త్వరలోనే ప్రవేశపెడతామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి, చావా శివరామకృష్ణ, తిరుమలాయపాలెం జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, కూసుమంచి, తిరుమలాయపాలెం ఎంపీపీలు బాణోతు శ్రీనివాస్, బోడా మంగీలాల్, నాయకులు మట్టే గురవయ్య, జూకూరి గోపాలరావు పాల్గొన్నారు.

మా భూమి మాకిప్పించండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆక్రమణకు గురైన తమ భూమిని తమకిప్పించాలని గద్వాల జిల్లా నుంచి ఓ కుటుంబం హైదరాబాద్‌లోని అసెంబ్లీకి పాదయాత్రగా వచ్చింది. గద్వాల జిల్లా ఐజ మండలం, యాప దిన్నే శివారు గ్రామం గుడిదొడ్డికి చెందిన వడ్డె పరుశురాం, నవీన్, కృష్ణ, పద్మతో పాటు మానస, సాయిగణేశ్ అనే ఇద్దరు చిన్నారులతో కలిసి

తమ గోడు వెళ్లబోసుకునేందుకు ఆదివారం అసెంబ్లీ వద్దకు వచ్చారు. తమ భూమిని తమకిప్పించాలని ముఖ్యమంత్రిని కలిసేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. వారి వద్దనున్న ప్లే కార్డులను చించేసి శాసనసభ పరిసర ప్రాంతాల నుంచి పంపించారు. దాంతో వారు శనివారం మీడియాను కలిసి న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు.

నవచిత్రం

మ్యూజిక్ హైలెట్‌గా తండేల్



నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'తండేల్'. ఈ సినిమాకి దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నారు. శనివారం దేవిశ్రీ బర్త్ డే సందర్భంగా 'తండేల్' టీం ఆయనకు విషెస్ తెలియజేసింది.
హీరో నాగ చైతన్య, డైరెక్టర్ చందూ మొండేటి, నిర్మాత బన్నీవాసు, దేవిశ్రీని కలిసి బర్త్ డే విషెస్ అందించారు. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.
ఈ సినిమాలో మ్యూజిక్ ఒక మేజర్ హైలెట్‌గా ఉండబోతుంది. సినిమా కోసం చార్ట్ బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు దేవిశ్రీ. సాంగ్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సెన్సేషనల్‌గా ఉండబోతున్నాయి. త్వర్లోనే మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ కిక్ స్టార్ట్ చేస్తారు అని చిత్ర యూనిట్ తెలిపింది.



ప్రేక్షకులకు ధన్యవాదాలు

కృష్ణ వంశీ, మోక్ష లీడ్ రోల్స్‌లో నటించిన లవ్ ఎంటర్‌టైనర్ 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హైనివా క్రియేషన్స్ బ్యానర్ పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని శుక్రవారం గ్రాండ్‌గా విడుదల చేసింది. ఈ సినిమా అందరి ఆదరణతో విజయాన్ని అందుకుంది.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన థ్యాంక్స్ మీట్‌లో హీరో కృష్ణ వంశీ మాట్లాడుతూ,'ప్రేక్షక దేవుళ్ళు అని ఎందుకు అంటారో ఇప్పుడు తెలిసింది. ఇప్పటివరకూ ప్రేక్షకుడిగానే సినిమాలు చూశాను. ఇప్పుడు మా సినిమాకి ప్రేక్షకులు ఇస్తున్న ప్రేమ, ఆదరణ చూస్తుంటే మాటలు రావడం లేదు. వారందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మా నిర్మాతలు హైమావతి, శ్రీరామ్ జడపోలు, విక్రమ్, జగదీశ్ గారికి ధన్యవాదాలు' అని అన్నారు.
'సినిమాకి చాలా మంచి పాజిటివ్ టాక్ రావడం చాలా ఆనందంగా ఉంది. అందరూ కొత్తవాళ్ళం కలసి చేసిన ప్రయత్నం ఇది. అన్ని సెంటర్స్‌లో చాలా మంచి రెస్పాన్స్ ఉంది. ఏ సెంటర్స్‌లో మార్నింగ్ షోకి, ఈవినింగ్ షోకి కలెక్షన్స్ పెరిగాయి. ఈ సినిమా ఖచ్చితంగా పికప్ అవుతుంది' అని ప్రొడ్యూసర్ శ్రీరామ్ జడపోలు చెప్పారు.



రష్మిక మందన్న

బాధితులకు అండగా..

ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు కథానాయిక రష్మిక మందన్నా తనవంతు సాయం చేస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుంటారు. తాజాగా ఆమె మరోమారు తన మంచి మనసుని చాటుకున్నారు. కేరళ వయనాడ్‌లో ఇటీవల కొండచరియలు విరిగిపడి సృష్టించిన విషాదం పట్ల ఆమె దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. బాధితులను ఆదుకునేందుకు కేరళ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం 10 లక్షల రూపాయల విరాళం ప్రకటించింది.

నిర్మాణ రంగంలోకి ఎంట్రీ



ముత్యాల సుబ్బయ్య

సమాజాన్ని జాగృతం చేసే కథలు, చక్కటి కుటుంబ ఇతివృత్తంతో యాభైకి పైగా సినిమాలను తీసిన ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీరంగంలోకి అడుగుపెట్టి తీస్తున్న చిత్రమిది. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ చిత్రంలో రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకత్వం వహించనున్నారు.
హైదరాబాద్‌లోని అన్నపూర్ణా స్టూడియోలో ఆగష్టు 9న ఈ సినిమా షూటింగ్ ప్రారంభోత్సవం జరుపుకుంటుందని చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య వెల్లడించగా, దర్శకుడిగా ఎప్పటికీ గుర్తుంచుకునే అద్భుత చిత్రాలను అందించిన నాన్న సమర్పణలో ఈ చిత్రం ద్వారా నిర్మాతగా చిత్ర పరిశ్రమలోకి ప్రవేశిస్తుండటం ఆనందంగా ఉందని ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ తెలిపారు. ఇతర విషయాలను చిత్రం ప్రారంభం రోజున వివరిస్తామన్నారు.
దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) మాట్లాడుతూ, 'ఓ వైవిధ్య భరిత, ఫామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రతీ ఒక్కరూ చూసి తీరాల్సిన చిత్రంగా దీనిని మలచనున్నాం' అని చెప్పారు. ఈ చిత్రానికి మూల కథ: శరవణన్, కథా విస్తరణ: ముత్యాల సుబ్బయ్య.



తరుణ్ భాస్కర్

మరో భిన్న చిత్రంలో తరుణ్ భాస్కర్

యారో సినిమాస్, డోలాముఖి సబ్‌బర్బాన్ ఫిల్మ్ తమ లేటెస్ట్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశాయి. ఇది రెండు నిర్మాణ సంస్థలకు సెకండ్ ప్రొడక్షన్ వెంచర్. తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో చేస్తున్న ఈ సినిమాతో వంశీరెడ్డి దొండపాటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.
రైటర్, డైరెక్టర్ వేణు ఊడుగుల అడిషినల్ కంట్రిబ్యూషన్‌తో బూసం జగన్ మోహన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ గౌడ్ అనే పాత్రను అతని భార్య శ్రీలత నుంచి విడాకులు తీసుకున్నట్లు సూచించే స్టాంప్ పేపర్‌తో యూనిక్ స్టయిల్‌లో ఈ సినిమాని ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుంది. కొత్త టాలెంట్‌ని డిస్కవర్ చేయడానికి నటీనటుల కోసం టీమ్ ఓపెన్ కాస్టింగ్ కాల్‌ని కూడా అనౌన్స్ చేసింది.

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



కె.విజయ్‌భాస్కర్ దర్శకత్వంలో తాజాగా రూపొందిన మరో లవ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఉషా పరిణయం'. ఈ చిత్రంలో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ముఖ్యతారలు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అందరి ప్రశంసలు అందుకుంటున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సస్‌మీట్‌ను ఏర్పాటు చేసింది.
ఈ సందర్భంగా దర్శక, నిర్మాత విజయభాస్కర్ మాట్లాడుతూ, 'చాలా రోజుల తరువాత ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను చూశామని ప్రేక్షకులు అంటుంటే ఆనందంగా ఉంది. 'నువ్వు నాకు నచ్చావ్' తరహాలో వినోదంతో పాటు 'నువ్వేకావాలి' లాంటి టీనేజ్ లవ్‌స్టోరీ ఈ చిత్రంలో ఉందని అందరూ అంటున్నారు' అని అన్నారు.



కలెక్షన్లు.. థియేటర్లు పెరిగాయ్

రాజ్ తరుణ్ హీరోగా, ఎఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తిరగబడరసామీ'. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి సూపర్బ్ రెస్పాన్స్‌తో విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో టీం సక్సెస్ మీట్ నిర్వహించింది.
డైరెక్టర్ ఎ ఎస్ రవికుమార్ చౌదరి మాట్లాడుతూ,'తెలుగు ప్రేక్షకులకు హ్యాట్సాప్. నిన్నటి కంటే ఈ రోజు కలెక్షన్స్, థియేటర్స్ పెరిగాయి. మంచి సినిమాని ఏదీ అడ్డుకోలేదని నిరూపించారు ఆడియెన్స్' అని అన్నారు.
'మా సినిమా సక్సెస్ మీట్ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. సినిమా 200 థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ రోజు మరో 28 థియేటర్స్ పెరిగాయి. సినిమా పై మంచి రిపోర్ట్, రిజల్ట్ ఉంది. సినిమాని సపోర్ట్ చేసున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు' అని నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

కీలక పాత్రధారిగా అనుపమ్ ఎంట్రీ

'ది కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ 2, టైగర్ నాగేశ్వరరావు' వంటి ప్రశంసలు పొందిన చిత్రాలతో సహా, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ నిర్మించిన ప్రముఖ ప్రాజెక్ట్‌లలో బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కొలాబిరేట్ అయ్యారు. ఈ సక్సెస్ ఫుల్ కొలాబిరేషన్‌ని కొనసాగిస్తూ అనుపమ్ ఖేర్ 'ది ఇండియా హౌస్'లో ముఖ్యమైన పాత్రను పోషించబోతున్నారు.
నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా, రామ్ వంశీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కి హీరో రామ్ చరణ్, విక్రమ్ రెడ్డి వి మెగా పిక్చర్స్ ప్రొడక్షన్ పార్ట్నర్స్. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే హంపి హిస్టారికల్ బ్యాక్ డ్రాప్‌లో ప్రారంభమైంది. ఈ షూటింగ్‌లో తాజాగా అనుపమ్ ఖేర్ జాయిన్ అయ్యారు. సాయి మంజ్రేకర్ కథానాయిక.



అనుపమ్ ఖేర్, అభిషేక్ అగర్వాల్



అశ్విన్‌బాబు, మహేశ్వర రెడ్డి

శివం భజేకు ప్రశంసలు

గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద అప్సర్ దర్శకత్వంలో అశ్విన్ బాబు హీరోగా, దిగంగనా సూర్యవంశీ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శివం భజే'. ఈ చిత్రం శుక్రవారం విడుదలై మంచి రెస్పాన్స్‌ను దక్కించుకుంది. ఈ చిత్రంపై మీడియా, ఆడియెన్స్ ప్రశంసలు కురిపించింది.
ఈ నేపథ్యంలో మేకర్స్ నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో హీరో అశ్విన్ బాబు మాట్లాడుతూ, 'సినిమాను చూసిన ప్రతీ ఒక్కరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇంటర్వెల్, క్లైమాక్స్ సీన్‌లకు గూస్ బంప్స్ వస్తున్నాయని చెబుతున్నారు. నేను ఇంకెన్ని చిత్రాలు చేసినా నా కెరీర్‌లో ది బెస్ట్ చిత్రంగా నిలుస్తుంది' అని అన్నారు. 'టీమ్ అందించిన సహకారంతోనే సినిమా ఇంత బాగా వచ్చింది. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు థ్యాంక్స్' అని డైరెక్టర్ అప్సర్ చెప్పారు. నిర్మాత మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ, 'ఈ సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్. మా చిత్రాన్ని ఆడియెన్స్‌కు చేరువ చేసిన మీడియాకు, ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అభినందిస్తున్నారు' అని తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధిస్తారని ఆశించిన షట్లర్లు నిరాశపరిచారు. బాక్సింగ్‌లో మెడల్ పంచ్ విసురుతారని అనుకున్న బాక్సర్లు రింగ్‌లో తేలిపోయారు. విలువిద్యలోనూ ఆఖరు వరకు ఊరించి ఉసూరుమనిపించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలతో సత్తా చాటిన యువ షూటర్ మను బాకర్ మూడోదీ తీసుకొస్తుందనే ధీమా కోట్లాది భారతీయుల్లో కనిపించింది. మహిళల 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగం ఫైనల్లో ఆఖరు వరకు పతకం కోసం పోటీపడిన మను బాకర్ నాల్గో స్థానంలో నిలిచి పతకం చేజార్చుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో నాల్గో స్థానంలో నిలిచి భారత్ మెడల్ కోల్పోవటం ఇది మూడోసారి!.

గురి కుదరలేదు!



- మను చేజారిన హ్యాట్రిక్ కాంస్యం
- నాల్గో స్థానంలో నిలిచిన మను బాకర్
- 25మీ పిస్టల్ ఫైనల్లో నిరాశ

పారిస్ 2024 ఒలింపిక్స్



నవతెలంగాణ-పారిస్

భారత్‌కు రెండు కాంస్య పతకాలు అందించిన గన్.. మూడో ప్రయత్నంలో తడబడింది. అర్హత రౌండ్‌లో అదరగొట్టిన పిస్టల్.. ఫైనల్లో అంచనాలను అందుకోలేదు. వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో మెడల్స్‌తో కెరీర్ భీకర ఫామ్, ఆల్‌టైమ్ ఆత్మవిశ్వాసంతో కనిపించిన మను బాకర్ ఆఖరు మెడల్ రేసులో మెడల్ లైన్‌కు ఆవల ఆగిపోయింది. శనివారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగం ఫైనల్లో మను బాకర్ నాల్గో స్థానానికి పరిమితమైంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇప్పటివరకు భారత్ మూడు పతక ఈవెంట్లలో నాల్గో స్థానంలో నిలిచి మెడల్‌కు దూరమైంది. షూటర్ అర్జున్ బబుత.. ఆర్చర్లు ధీరజ్ బొమ్మదేవర, అంకితలు సైతం తమ పతక ఈవెంట్లలో నాల్గో స్థానంలో నిలిచి కాంస్య పతకం చేజార్చుకున్నారు. రెండు ఒలింపిక్ పతకాల విజేత మను బాకర్ సైతం ఇప్పుడు ఈ జాబితాలో చేరింది. ఒకే ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ మెడల్స్ సాధించి ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పాలని ఆశించిన మను బాకర్.. ఆఖరు అడుగులో గురి తప్పింది. ఒలింపిక్స్ పోటీల్లో శనివారం భారత్‌కు మెడల్స్ ఏమీ దక్కలేదు. మూడు కాంస్య పతకాలే ఇప్పటి వరకు భారత్ ఖాతాలో పడ్డాయి.

నాల్గో స్థానంతో సరి!

మహిళల 25 మీటర్ల పిస్టల్ అర్హత రౌండ్‌లో మను బాకర్ టాప్ లేపింది. ర్యాపిడ్, ప్రిసిజన్ రౌండ్లలో రెండో స్థానంలో నిలిచింది. దీంతో సహజంగానే ఫైనల్లో మను బాకర్‌పై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. శనివారం జరిగిన ఫైనల్లో టాప్-8 షూటర్లు పోటీపడ్డారు. ఆఖరు వరకు మెడల్ రేసులో నిలిచిన మను బాకర్.. కాంస్య పతకాన్ని హంగరీ అమ్మాయి వెరోనికాకు కోల్పోయింది. వెరోనికా అర్హత రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచినా.. ఫైనల్లో ఆమె సైతం తడబాటుకు లోనైంది. కాంస్య పతక పోటీలో వెరోనిక మేజర్ పైచేయి సాధించింది. 31 పాయింట్లతో హంగరీ అమ్మాయి కాంస్య పతకం సొంతం చేసుకుంది. 28 పాయింట్లతో మను బాకర్ నాల్గో స్థానంలో నిలిచింది. దక్షిణ కొరియా అమ్మాయి యాంగ్ జిన్ (37) స్వర్ణం సాధించగా, ఫ్రాన్స్ షూటర్ కామిలె (37) సిల్వర్ మెడల్ దక్కించుకుంది.


హాకీ ఇండియాకు బ్రిటన్ సవాల్

హాకీలో టీమ్ ఇండియా కఠిన సవాల్‌కు సిద్ధమైంది. 2020 టోక్యో ఒలింపిక్స్ తరహాలో పారిస్‌లోనూ క్వార్టర్‌ఫైనల్లో గ్రేట్ బ్రిటన్‌తో తలపడనుంది. పూల్-బిలో రెండో స్థానంలో నిలిచిన భారత్.. పూల్-ఏలో మూడో స్థానంలో నిలిచిన గ్రేట్ బ్రిటన్‌తో నేడు క్వార్టర్‌ఫైనల్లో ఆడనుంది. బెల్జియం, స్పెయిన్.. నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా.. జర్మనీ, అర్జెంటీనా మధ్య క్వార్టర్‌ఫైనల్ మ్యాచులు సైతం నేడు జరుగనున్నాయి. మూడేండ్ల క్రితం టోక్యోలో జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారత్ 3-1తో విజయం సాధించింది. పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధతలో టీమ్ ఇండియా మరింత పటిష్టంగా మారింది. ఆరంభంలో ఫార్వర్డ్‌లు కాస్త నిరాశపరిచినా.. గ్రూప్ దశలో మ్యాచులు సాగుతున్న కొద్ది మెరుగయ్యారు. అభిషేక్, హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌దీప్ సింగ్‌లు భారత్‌కు కీలకంగా మారారు. ఫార్వర్డ్‌లు గోల్ అవకాశాలు సృష్టించటం, ప్రత్యర్థిపై సమర్థవంతంగా దాడి చేయటంలో ఆకట్టుకుంటుంది. డిఫెన్స్‌లో గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ గోడ కడుతున్నాడు. అతడిని దాటుకుని వెళ్లటం ప్రత్యర్థులకు గగనమవుతుంది. కెప్టెన్



హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్స్ వేటలో అదరగొడుతున్నాడు. ఆడిన ప్రతి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ గోల్ నమోదు చేశాడు. నేడు క్వార్టర్‌ఫైనల్లోనూ హర్మన్‌ప్రీత్, అభిషేక్ ప్రదర్శన ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలువనుంది. భారత్, గ్రేట్ బ్రిటన్ హాకీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ నేడు మధ్యాహ్నం 1.30 గంటలకు ఆరంభం కానుంది.

లక్ష్యం చేరుకుంటాడా?



బ్యాడ్మింటన్‌లో కచ్చితంగా పతకం తీసుకొస్తారని ఆశించిన పి.వి సింధు సహా సాత్విక్, చిరాగ్ జోడీ నిరాశపరిచారు. పురుషుల సింగిల్స్‌లో యువ కెరటం లక్ష్యసేన్ ఒక్కడే ఇప్పుడు బ్యాడ్మింటన్‌లో భారత పతక ఆశల భారాన్ని మోస్తున్నాడు. ఒలింపిక్స్‌లో మెన్స్ సింగిల్స్ సెమీఫైనల్ ఆడుతున్న తొలి భారత పురుష షట్లర్‌గా రికార్డు నెలకొల్పిన లక్ష్యసేన్.. నేడు కెరీర్‌లో బిగ్గెస్ట్ మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాడు. ఒలింపిక్స్ డిఫెండింగ్ గోల్డ్ మెడలిస్ట్, అగ్రశ్రేణి షట్లర్ విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్)తో లక్ష్యసేన్ నేడు సెమీఫైనల్లో తలపడనున్నాడు. సెమీఫైనల్‌కు చేరుకునే క్రమంలో తనకంటే మెరుగైన ర్యాంకర్లపై విజయాలు సాధించిన లక్ష్యసేన్ నేడు సెమీస్‌లోనూ అదే ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతున్నాడు. విక్టర్ అక్సెల్సెన్‌తో లక్ష్యసేన్ ముఖాముఖి రికార్డు 1-7. ఇటీవల సింగపూర్ ఓపెన్‌లో విక్టర్‌తో మూడు గేముల ఉత్కంఠ మ్యాచ్‌లో పోరాడి ఓడాడు. గతంలో విక్టర్‌ను ఓడించిన స్ఫూర్తితో లక్ష్యసేన్ ఉత్తమ ప్రదర్శన చేయగలిగితే భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర లిఖించే అవకాశం దక్కనుంది.

ఆటలు

ఈసారి మెరుస్తారా?

- భారత్, శ్రీలంక రెండో వన్డే నేడు
- విజయమే లక్ష్యంగా రోహిత్ సేన
- మధ్యాహ్నం 2.30 నుంచి సోనీస్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-కొలంబో

ఆధునిక క్రికెట్‌లో వన్డే ఫార్మాట్‌కు పెద్దగా ప్రాధాన్యత లేకుండా పోయింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఉండటంతో అన్ని జట్లు ఇప్పుడు ఈ ఫార్మాట్‌పై ఫోకస్ పెట్టాయి. అందులో భాగంగానే టీమ్ ఇండియా సైతం శ్రీలంకతో వన్డే సిరీస్‌లో తలపడుతుంది. కొలంబోలో జరిగిన తొలి వన్డేలో టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్‌కు గట్టి షాక్ తగిలింది. అలవోకగా నెగ్గాల్సిన మ్యాచ్‌ను కాస్త టై దాకా తీసుకు రావటంపై కచ్చితంగా డ్రెస్సింగ్‌రూమ్‌లో చర్చకు దారితీసి ఉంటుంది. కొత్త కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మలు ఈ విషయంలో అసంతృప్తిగానే ఉన్నారు!. ప్రపంచ క్రికెట్‌లో అగ్రజట్టుగా వెలుగొందుతున్న టీమ్ ఇండియాను పసలేని శ్రీలంక జట్టు నిలువరించటం ఏమిటనే ప్రశ్న సగటు అభిమానులను కలిచి వేసింది. కానీ, అందుకు ప్రధాన కారణం పిచ్‌లు స్పిన్‌కు సహకరించటం. నాణ్యమైన స్పిన్నర్లు, స్పిన్ అనుకూల పిచ్‌లతో టీమ్ ఇండియాతో సమవుజ్జీగా శ్రీలంక పోటీపడుతోంది. అందులో భాగంగానే నేడు భారత్, శ్రీలంక రెండో వన్డే జరుగనుంది. స్పిన్‌కు సహకరించే పిచ్‌పై మ్యాచ్ కావటంతో రెండో వన్డేపై అభిమానుల్లో ఆసక్తి కనిపిస్తుంది.

ఆ ఇద్దరు మెరిస్తే..! : టాప్ ఆర్డర్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ అర్ధ సెంచరీతో కదం తొక్కినా.. శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి అంచనాలను అందుకోలేదు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ నుంచీ విరాట్ కోహ్లి పరుగుల వేటలో వెనుకంజ వేస్తున్నాడు. శ్రీలంకతో తొలి వన్డేలోనూ అదే కనిపించింది. శుభ్‌మన్ గిల్ జింబాబ్వే పర్యటనలో మెరిసినా.. ఆ దూకుడు ఇక్కడ చూపించలేకపోయాడు. టాప్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ



శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి దంచికొడితే శ్రీలంక బౌలర్లకు కష్టాలు తప్పవు. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ మంచి ఆరంభాలను దక్కించుకున్నా.. ఆఖరు వరకు నిలబడాల్సిన అవసరం ఉంది. శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్‌లు గతంలో గంభీర్ ఐపీఎల్ ఫ్రాంచైజీలకు మెంటార్‌గా పనిచేసిన జట్లకు కెప్టెన్లు. ఈ ఇద్దరు మిడిల్ ఆర్డర్ బ్యాటర్లకు గంభీర్ మద్దతు ఉంది. శ్రేయస్ అయ్యర్ సమయోచితంగా పరుగుల వేటలో వేగం పెంచగలడు. కానీ కెఎల్ రాహుల్ స్ట్రయిక్‌రేట్ విషయంలో నిలకడగా విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఆధునిక క్రికెట్‌లో మార్పునకు అనుగుణంగా రాహుల్ వేగంగా పరుగులు చేయాల్సిన అవసరం ఉంది. లేదంటే, గంభీర్ ఎంతోకాలం తుది జట్టులో నిలిచేలా చూడలేదు. ఆల్‌రౌండర్‌గా శివం దూబె ఆకట్టుకున్నాడు. తొలి వన్డేలో లాంఛనం ముగిస్తే.. దూబెకు మరింత బాగుండేది. స్పిన్ ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ మరింత కీలక పాత్ర పోషించాలి. వాషింగ్టన్ సుందర్ నుంచి జట్టు మేనేజ్‌మెంట్ బ్యాట్‌తో, బంతితో ఉత్తమ ప్రదర్శన ఆశిస్తోంది. శ్రీలంకతో సిరీస్ కావటంతో సహజంగానే మహ్మద్ సిరాజ్ భారత్‌కు కీలక పేసర్. అర్షదీప్ సింగ్‌తో కలిసి సిరాజ్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శివం దూబె, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్.

శ్రీలంక : పతుం నిశాంక, అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), సదీర సమరవిక్రమ, చరిత్ అసలంక (కెప్టెన్), జానిత్ లియనాగె, డ్యునిత్ వెల్లలాగె, వానిందు హసరంగ, అఖిల ధనంజయ, మహ్మద్ షిరాజ్, అసిత ఫెర్నాండో.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

భాషా పండితుల కల సాకారమైన వేళ...



జి.తిరుమల కాంతికృష్ణ,
9490003295

భాషింపబడునది భాష. భాష ఒక ప్రాంత అస్తిత్వానికి, చరిత్రకు, నాగరికతకు పునాదులువేసి, ఆ ప్రాంతాన్ని జాతిని తలెత్తుకునేలా చేస్తుంది. విద్యార్థిదశలో భాషాబోధన అందుకే కీలక పాత్ర వహిస్తుంది. అలాంటి భాషా బోధకులు గత నాలుగు దశాబ్దాలుగా అనుభవిస్తున్న వెతలను దూరం చేసి, వారిలోనున్న ఆత్మన్యూనతా భావాన్ని తొలగించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన 2 , 3ఉత్తర్వుల ప్రకారం భాషా పండితులకే పదోన్నతులు కల్పించడం, భాషాపండితుల్లో ఉత్సాహాన్ని నింపాయి. భాషాపండితుల ఆత్మఘోష ఈనాటిది కాదు. ఒకప్పుడు ఎంతో గౌరవాన్ని పొందిన పండితులను 1982లో జరిగిన రీగ్రూపింగ్స్ స్కేళ్ల సందర్భంగా స్థాయిని తగ్గించి వారికి తీరని అన్యాయాన్ని చేశారు. అప్పటినుండి నిన్నటి పదోన్నతులందుకునే వరకు మేధో దోపిడీకి గురవుతూనే గ్రేడ్.2 భాషాపండితులు విద్యార్థులకు ఉత్తమవిద్యను అందిస్తూనే ఉన్నారు. నూతన విద్యావిధానం ప్రకారం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌లతోనే బోధన చేయించాలి. దానికి అనుగుణంగా ఉన్నత పాఠశాలల్లోని అన్ని పోస్టులను ఉన్నతీకరించవలసి ఉండగా భాషాపండితుల పోస్టులను అలాగే ఉంచి ఇతర విషయ పోస్టులను ఉన్నతీకరణ చేసి దాదాపు 50 వేల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్ కల్పించిన నాటి ప్రభుత్వం పండితులకు మొండిచేయి చూపింది. గ్రేడ్2 పండితులకు గ్రేడ్ 1 విద్యార్హతలు ఉన్నందున గ్రేడ్ 1గా గుర్తించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉమ్మడి రాష్ట్రంలో నాటి ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి పండితులకు తీవ్ర నష్టాన్ని చేసింది. ఆ తరువాత 2009లో వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు 11,12 లు క్రాస్ ప్రమోషన్‌లకు అవకాశం కల్పిస్తూ భాషాపండితుల పదోన్నతుల ఆశలను అధ:పాతాళానికి తొక్కేశాయి.

భాషాపండితులకు న్యాయం చేయాలని, గ్రేడ్2 పోస్టులను ఉన్నతీకరణ చేసి భాషాపండితుల కే అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ భాషాపండితులకు హామీచిచ్చారు. తాను ఇచ్చిన హామీ ప్రకారం 16ఫిబ్రవరి2019 న జి.ఓ 15 ను విడుదల చేసి రాష్ట్రంలో 8000 పైగా భాషాపండితుల పోస్ట్ లను అప్‌గ్రేడ్ చేశారు. అయితే కొంతమంది సోదర ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించడం వలన సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. కోర్టు స్టే మంజూరు చేస్తూ 11,12 జిఓలను సవరిస్తూ, 15 జిఓను అమలు చేయవచ్చంటూ ప్రభుత్వానికి సూచించింది. సమస్యను మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా 5 ఫిబ్రవరిన కేవలం భాషాపండితులకే స్కూల్ అసిస్టెంట్ అవకాశం కల్పించే విధంగా 11,12 జీఓల సవరించి జీఓలు 2,3 విడుదల చేశారు. ఆ జీఓ లను కూడా సవాలు చేస్తూ కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా పండితులకు చుక్కెదురైంది.

> న్యాయంగా భాషాపండితులకు సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం 2005లోనే పదోన్నతులు అందాలి. ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన మేధో దోపిడీకి గరై తీవ్ర నష్టాన్ని చవిచూశారు. పదోన్నతులు అందించిన ఈ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు నాటినుండి నోషనల్ ఇంక్రిమెంట్ ఇస్తే వారికి జరిగిన అన్యాయాన్ని కొంతమేరకు తగ్గించి న్యాయం చేసినట్లు అవుతుంది. భాషాపండితులకు పదోన్నతులు రావడంవల్ల రాష్ట్ర వ్యాప్తంగా పండితుల మనోభావాలు గౌరవించబడడమే కాక విద్యార్థులకు సరైననాణ్యమైన విద్యను అందించే అవకాశం కలిగింది. ఉన్నత తరగతుల విద్యార్థులు భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించి భవిష్యత్ సాహితీవారసులుగా ఎదిగే గొప్ప బోధనను అందించే అవకాశాన్ని ప్రభుత్వం వారికి కల్పించి నట్లయింది.



ఆ తరువాత పండితులకు డివిజన్ బెంచ్ ప్రభుత్వ నిర్ణయం సరైనదేనంటూ తీర్పునీయడం ఉపశమనం కలిగించింది.

అయితే అంత సజావుగా సాగుతున్న తరుణంలో, పదోన్నతులు లభిస్తాయని ఆశించిన సమయంలో ప్రభుత్వాలు మారాయి. కొత్తగా ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆగిపోయిన పదోన్నతులు బదిలీల షెడ్యూల్ కొనసాగించాలని నిర్ణయించిన సందర్భంలో ఎస్జీటీలు మళ్ళీ హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్ వేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఆ వాదనను కొట్టివేసి హైకోర్టు తీర్పును సమర్థించడంతో పదోన్నతులు పొందడానికి భాషాపండితులకు ఉన్న అడ్డంకులు తొలగినట్లయింది. న్యాయంగా భాషాపండితులకు సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం 2005లోనే పదోన్నతులు అందాలి. ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన మేధో దోపిడీకి గరై తీవ్ర నష్టాన్ని చవిచూశారు. పదోన్నతులు అందించిన ఈ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు నాటినుండి నోషనల్ ఇంక్రిమెంట్ ఇస్తే వారికి జరిగిన అన్యాయాన్ని కొంతమేరకు తగ్గించి న్యాయం చేసినట్లు అవుతుంది. భాషాపండితులకు పదోన్నతులు రావడంవల్ల రాష్ట్ర వ్యాప్తంగా పండితుల మనోభావాలు గౌరవించబడడమే కాక విద్యార్థులకు సరైననాణ్యమైన విద్యను అందించే అవకాశం కలిగింది. ఉన్నత తరగతుల విద్యార్థులు భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించి భవిష్యత్ సాహితీవారసులుగా ఎదిగే గొప్ప బోధనను అందించే అవకాశాన్ని ప్రభుత్వం వారికి కల్పించినట్లయింది.

పదోన్నతి పొందిన భాషాపండితులంతా సంతోషంగా ఉంటే, అడేక్వసి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఆరువందల మంది పండితులు పదోన్నతులు రాక నిరాశానిస్పృహతో ఉన్నారు. పండిత వ్యవస్థ రద్దువవుతుందని అందరికి స్కూల్ అసిస్టెంట్స్‌గా అవకాశం కల్పిస్తారని భావించిన వారు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తిచేసుకున్నారు. చివరిదశలో పదోన్నతి అందకపోవడంతో ఎలాగైనా తమకు కూడా న్యాయం చేయాలనీ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నూతనంగా పదోన్నతులు అందుకున్న సంతోషంతో మరింత కర్తవ్యనిష్టతో భాషాబోధన చేయాల్సిన బాధ్యత కొత్త స్కూల్ అసిస్టెంట్(భాషలు) లపై ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్ది వారిని ఉన్నతంగా ఎదిగేట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ భారాన్ని ఉత్సాహంతో మోయడానికి సిద్ధంగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ భాష పండితులందరికీ అభినందనలు.



> స్నేహం అనేది కొత్తగా పరిచయమైన ఇద్దరు వ్యక్తుల మధ్య, విద్యార్థుల మధ్య లేదా సహోద్యోగుల మధ్య మాత్రమే ఏర్పడే బంధమే కాదు. భార్య భర్తలు, కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య కూడా మంచి స్నేహం ఏర్పడుతుంది. స్నేహం అనేది ఉన్నప్పుడు కుటుంబ సభ్యుల మధ్య పొరపచ్చాలు తగ్గిఒకరినొకరు అర్థం చేసుకుని మసులుకునే అవకాశాలు మెండుగా ఉంటాయి. కుటుంబ బంధాల మధ్య స్నేహబంధం ఉంటే ఆ కుటుంబం మరింత పటిష్టంగా ఉంటుంది.

స్నేహం..ఓ మధుర కావ్యం...



ననుబోలు రాజశేఖర్
8330969808

స్నేహం... ఓ మధురం స్నేహం... ఓ ధైర్యం
స్నేహం... ఓ త్యాగం స్నేహం... ఓ సంబరం

స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం...స్నేహాని కన్న మిన్న లోకాన లేదురా...కడదాక నీడలాగ నిను వీడిపోదురా...అంటూ కవులు రాసిన కవితాసుధ స్నేహానికి ఉన్న విశిష్టతను ఎన్ని విధాలుగా కొనియాడినా కూడా..ఆ స్నేహబంధంలోని మధురానుభూతి వర్ణింప శక్యం కానిది. కుటుంబాలను బంధాలు నిర్ణయిస్తే స్నేహబంధాన్ని మాత్రం మనిషే నిర్ణయించుకుంటాడు. అదే స్నేహంలో ఉన్న గొప్పతనం. స్నేహానికి ఉన్నగొప్పతనాన్ని ఇతివృత్తంగా తీసుకుని నిర్మించిన అనేక చలన చిత్రాలు ఘనవిజయాలను సాధించాయి. దీనికి ప్రధాన కారణం సమాజంలో స్నేహబంధంపై ఉన్న ఉన్నతమైన భావనే. కృష్ణ-కుచేలులు, కర్ణ-దుర్యోధనులు, అన్నదమ్ములైనా స్నేహితులుగా కడదాకా జీవితాన్ని సాగించిన రామలక్ష్మణులు మన పురాణ ఇతిహాస స్నేహితులు.

ఎల్లలు లేనిదే...స్నేహం

స్నేహం అనేది ఇలా ఉండాలి, అలా ఉండకూడదు అనే నిర్దిష్టమైన నియమ నిబంధనలు, ప్రణాళికలు, అంచనాలు ఏమి స్నేహితుల మధ్య ఉండవు. స్నేహానికి వయసుతో, కులమతాలతో, స్థితిగతులతో, లింగభేదంతో, ఎల్లలతో సంబంధం ఉండదు. స్నేహం ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క బంధం లాగా మారి ప్రవర్తించగలదు. ఒకసారిగురువులా మారి మంచిని బోధించి దారిని చూపిస్తుంది. మరొకసారి తల్లిదండ్రుల్లాగా మారి మందలించిబాగోగుల్ని చూస్తుంది. కష్ట సమయంలో కలత చెందిన మనసుకి ప్రశాంతతను కలిగించే దివ్య ఔషధంగా మారుతుంది. చివరికి ఎంత త్యాగానికైనా సిద్ధపడుతుంది ఈ స్నేహం. కుటుంబ బంధాల్లో కూడా స్నేహబంధం ఉంటుంది. స్నేహం అనేది కొత్తగా పరిచయమైన ఇద్దరు వ్యక్తుల మధ్య, విద్యార్థుల మధ్య లేదా సహోద్యోగుల మధ్య మాత్రమే ఏర్పడే బంధమే కాదు. భార్య భర్తలు, కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య కూడా మంచి స్నేహం ఏర్పడుతుంది. స్నేహం అనేది ఉన్నప్పుడు కుటుంబ సభ్యుల మధ్య పొరపచ్చాలు తగ్గిఒకరినొకరు అర్థం చేసుకుని మసులుకునే అవకాశాలు మెండుగా ఉంటాయి. కుటుంబ బంధాల మధ్య స్నేహబంధం ఉంటే ఆ కుటుంబం మరింత పటిష్టంగా ఉంటుంది.

స్నేహితుల దినోత్సవం-చరిత్ర

1930లో యునైటెడ్ స్టేట్స్‌కి చెందిన హల్ మార్క్ గ్రీటింగ్ కార్డుల వ్యవస్థాపకుడు జాయిస్ హాల్ మొదటిసారిగా ఫ్రెండ్‌షిప్ డే భావనను ప్రతిపాదించారు. అయితే, దీని వెనుక వ్యాపార దృక్పథంఉండటంతో ఈ ప్రతిపాదన అంతగా ప్రాచుర్యం చెందలేదు. 1935వ సంవత్సరం ఆగస్ట్ మొదటి శనివారం రోజునఅమెరికా ప్రభుత్వం చేతిలో హతమైన తన స్నేహితుడిని మర్చిపోలేని మరో స్నేహితుడు ఆ తరువాత రోజైన ఆదివారంనాడు ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. దీనికి చలించిపోయిన అమెరికా ప్రభుత్వం ఆగస్ట్ మొదటి ఆదివారాన్ని"ఇంటర్నేషనల్ ఫ్రెండ్షిప్ డే" గా ప్రకటించిందనేది కొందరి వాదన. 1958లో, పరాగ్వే మనస్తత్వవేత్త, విద్యావేత్త అయిన డాక్టర్ ఆర్టెమియో బ్రాచో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ఆలోచనను ప్రతిపాదించిన తర్వాత ఫ్రెండ్‌షిప్ డేని జరుపుకునే సాంప్రదాయం గణనీయంగా పెరిగిందనేది మరికొందరి వాదన. ఐక్యరాజ్యసమితి ఏప్రిల్ 27, 2011న అంతర్జాతీయస్నేహితుల దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించింది. యుఎస్ జనరల్ అసెంబ్లీ జూలై 30ని అంతర్జాతీయస్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. ప్రపంచంలో ఈ స్నేహితుల దినోత్సవాన్ని వివిధ దేశాలు వివిధ తేదీల్లో జరుపుకుంటున్నాయి. భారతదేశం, అమెరికా ఆగస్టు నెలలో వచ్చే మొదటి ఆదివారం నాడుఈ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటాయి.

స్నేహమంటేనే స్వచ్ఛమైనది..

రక్తసంబంధం కాకపోయినా...రక్తం చిందించడానికైనా... వెనుకాడనిదే... ఈ స్నేహం. స్నేహంలో నిజమైన స్నేహం, అబద్ధమైన స్నేహం అనే రెండు రకాల స్నేహాలు ఉండవు. స్నేహమంటేనే... నిజమైనది, స్వచ్ఛమైనది, కపటం లేనిది. కొందరి జీవితాలలో బాల్యంతో మొదలైన స్నేహం జీవితపు చివరి అంచుల వరకు కొనసాగుతూనే ఉంటుంది. మరికొందరి జీవితాలలో వృద్ధాప్యంలో కొత్త స్నేహాలు చిగురించి, భరోసాగా నిలుస్తాయి. ప్రతీ రోజుమాట్లాడుకోకున్నా అవసరమైనప్పుడు మనకు ధైర్యం చెప్పి ఓదార్చే నేస్తం ఉన్నాడనే నమ్మకమైన ఆలోచన మనకు కొండంత ధైర్యాన్ని, ఉపశమనాన్ని ఇస్తుంది. అందుకే స్నేహితుడు కంటికి దూరమైనా మనసుకు దగ్గరగా ఉంటాడు అంటారు. కష్టంలో, సుఖంలో, బాధలో, సంతోషంలో నేనున్నానని నిలబడే స్నేహితుడు దొరకటం ఒక గొప్ప అదృష్టం. ఎంతో విశిష్టమైన స్నేహ బంధానికి గుర్తుగా జరుపుకునే స్నేహితుల దినోత్సవం సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.

(ఆగష్టు 04 అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం)

ఈ క్రింది వాటిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవహించే నది ఏది?

1. జతపర్చుము.

1. గోదావరి నది	ఎ. పశ్చిమ కనుమలలోని నాసిక్ త్రయంబకం
2. కృష్ణానది	బి. సాత్పూరా పర్వతాలు
3. మంజీర నది	సి. పశ్చిమ కనుమలలోని మహబలేశ్వరం
4. ప్రాణహితనది	డి. బాలాఘాట్ పర్వతాలు

1. 1-ఎ,2-సి,3-డి,4-బి 2. 1-ఎ,2-సి,3-బి,4-డి
3. 1-సి,2-ఎ,3-డి,4-బి 4. 1-ఎ,2-బి,3-సి,4-డి

2. ఈ క్రింది వాటిలో గోదావరి నదికి ఉపనది కానిది ఏది?
1. కోయనా 2. శబరి 3. పూర్ణ 4. ప్రవరా

3. ఏ నదిని పురాణాలలో తెలివాహనది పేర్కొన్నారు.
1.మంజీర 2.కృష్ణ
3.గోదావరి 4.తుంగభద్ర

4. జతపర్చుము.

1.తుంగభద్రనది	ఎ. అజీవనది (నాన్- పెరినియాల్)
2.దిండినది	బి.ముచుకుందనది
3.మూసీనది	సి.మీనాంబరం
4.మంజీరనది	డి. రామాయణంలో పంపానది

1.1-డి,2-సి,3-ఎ,4-బి 2.1-సి,2-డి,3-బి,4-ఎ
3.1-డి,2-సి,3-బి,4-ఎ 4.1-సి,2-డి,3-ఎ,4-బి

5. తెలంగాణలో కృష్ణానది యొక్క పరివాహక ప్రాంతాలు ఏవి?
1. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, నల్గొండ, సూర్యాపేట
2. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నిర్మల్, జగిత్యాల, నల్గొండ, సూర్యాపేట
3.మహబూబ్‌నగర్, కొమురం-భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, నల్గొండ, నాగర్‌కర్నూల్
4. నల్గొండ, సూర్యాపేట, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, మహబూబ్‌నగర్

6. ఈ క్రింది వాటిలో సరికానిది ?
1. మహబూబ్‌నగర్- భీమ, డిండి, తుంగభద్ర
2. వరంగల్ - పాలేరు, మున్నేరు
3. నిజామాబాద్ - మంజీర, పూరాంగీ
4. రంగారెడ్డి - వైరా, కిన్నెరసాని, శబరి, సీలేరు

7. ఈ క్రింది వాటిలో సరికానిది ?
1. కృష్ణానది-ప్రియదర్శిని జూరాల, నాగార్జున సాగర్
2. మంజీరనది- నిజాం సాగర్ ప్రాజెక్టు, సింగూర్ ప్రాజెక్టు
3. గోదావరి నది-శ్రీరాంసాగర్ ప్రాజెక్టు
4. తుంగభద్ర నది-ఉస్మాన్‌సాగర్ ప్రాజెక్టు

8. ఈ క్రింది వాటిలో కృష్ణనది ఉపనది ఏది?
1. కోయనా 2. కాగ్నా 3. హాలియా 4. పైవన్నీ

9. జతపర్చుము.

1. మానేరు నది	ఎ. సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల కొండలు
2. మున్నేరు నది	బి. వరంగల్ రూరల్, మహబూబ్‌నగర్, సరి హద్దులో పాకాల చెరువు
3. కాగ్నానది	సి. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండలు
4. కడెం నది	డి. ఆదిలాబాద్ జిల్లాలోని బోతాయి గ్రామం

1. 1-ఎ,2-బి,3-సి,4-డి 2 1-ఎ,2-బి,3-డి,4-సి
3. 1-బి,2-ఎ,3-సి,4-డి. 4. 1-ఎ,2-సి,3-డి,4-బి

10. తెలంగాణ రాష్ట్రంలో నదులు ప్రవహించే దిశ?
1. భారతదేశంలో వాయువ్యాన ఎత్తుగా ఉండి ఆగ్నేయ దిశగా వాలి ఉంటుంది. కాబట్టి రాష్ట్రంలో ప్రవహించే నదుల దిశ వాయువ్యం నుండి ఆగ్నేయం వైపు ఉంటుంది.
2. రాష్ట్రంలో ప్రవహించే నదుల దిశ ఆగ్నేయ నుండి పడమరకు
3. రాష్ట్రంలో ప్రవహించే నదుల దిశ నైరుతి నుండి ఆగ్నేయం
4. రాష్ట్రంలో ప్రవహించే నదుల దిశ నైరుతి నుండి ఈశాన్యం

11. గోదావరి నదికి సంబంధించి ఈ క్రింది వాటిలో సరైనది ఏది?
1. దక్షిణ భారతదేశంలోని నదులన్నిటిలోకి పెద్దది.
2. గోదావరి నదికి గల ఇతర పేర్లు దక్షిణ గంగా, వృద్ధ గంగా, ఇండియన్ రైన్
3. గోదావరి నది మొత్తం పొడవు 1465 కి.మీ. దీని పరివాహక ప్రాంతం తెలంగాణలో 7 జిల్లాలలో ఉంది.
4. పైవన్నీ

12. ఈ క్రింది వాటిలో సరైనది ఏది?
1. కృష్ణనది యొక్క అదిపెద్ద ఉపనది తుంగభద్ర, గోదావరినదికి అతిపెద్ద ఉపనది ప్రాణహితనది
2. కృష్ణనది యొక్క ఉపనదులలో పొడవైన నది-భీమానది
3. గోదావరి నది యొక్క ఉపనదులలో పొడవైనది
4. పైవన్నీ

13. కృష్ణనదికి సంబంధించి ఈ క్రిందివాటిలో సరైనది ఏది?
1. కృష్ణానది యొక్క మొత్తం పొడవు 1440 కి.మీ.
2. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కృష్ణానది యొక్క పొడవు 720 కి.మీ.
3. కృష్ణానది యొక్క పరివాహక ప్రాంతం తెలంగాణలో 6 జిల్లాలో కలదు.
4. పైవన్నీ.

14. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంవద్ద ఏర్పడే త్రివేణిసంఘమం నదులలో లేనిది ఏది?
1. గోదావరి 2. ప్రాణహిత
3. సరస్వతి 4. పెన్‌గంగా

15. నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద ఏర్పడే త్రివేణి సంఘమంలో లేని నది ఏది?
1. మంజీర 2. హరిద్ర
3. గోదావరి 4. పూర్ణ

16. 'దక్షిణ గంగా' అని ఏ నదిని పిలుస్తారు?
1. కృష్ణ 2. పెన్నా
3. గోదావరి 4. ప్రాణహిత

17. మహారాష్ట్రలో 'మంజ్రా' అని ఏ నదిని పిలుస్తారు?
1. మానేరు 2. ఇంద్రావతి
3. ప్రాణహిత 4. మంజీరా

18. క్రింది వాటిలో ఏ ఆనకట్టను రాజన్న-సిరిసిల్ల జిల్లాలో నర్మల గ్రామ సమీపంలో నిజాం కాలంలో నిర్మించారు?
1. దిగువ మానేరు ఆనకట్ట 2. ఎగువ మానేరు అనకట్ట
3. నిజాం సాగర్ ఆనకట్ట 4. మధ్య మానేరు ఆనకట్ట

19. క్రింది వాటిలో ఏ నది సింకరం వద్ద తూర్పు కనుమలలో పుట్టి కోలబ్ నదిగా మారుతుంది?
1. ప్రాణహిత 2. కృష్ణా 3. శబరి 4. గోదావరి

20. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఏ నదిపై కాళేశ్వరం సమీపంలో మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది?
1. దిండి 2. ప్రాణహిత
3. పాలేరు 4. మున్నేరు

21. ఈ క్రింది వాటిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవహించే నది ఏది?
1. దిండి 2. మంజీరా
3. ప్రాణహిత 4. పాలేరు

22. ముచికుంద నది అని ఏ నదిని పిలిచేవారు?
1. ఇంద్రావతి 2. పాలేరు
3. మున్నేరు 4. మూసీ

23. కృష్ణానది సముద్ర మట్టానికి ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
1. 1,441 మీటర్లు 2. 1,526 మీటర్లు
3. 945 మీటర్లు 4. 1,337 మీటర్లు

24. గోదావరి నది సముద్ర మట్టానికి ఎంత ఎత్తులో ఉంది?
1. 884 మీటర్లు 2. 707 మీటర్లు
3. 1,067 మీటర్లు 4. 945 మీటర్లు

సమాధానాలు

1. 1	2. 1	3. 3	4. 3	5. 1
6. 4	7. 4	8. 4	9. 1	10. 1
11. 4	12. 4	13. 4	14. 4	15. 4
16. 3	17. 4	18. 2	19. 3	20. 2
21. 1	22. 4	23. 4	24. 3	

2023 నాటికి ప్రపంచంలో అతిపెద్ద పవన శక్తిని ఉత్పత్తి చేసే దేశం ఏది?



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

1. 2019లో వాతావరణ అత్యవసర పరిస్థితిని ప్రకటించిన మొదటి దేశం ఏది?
ఎ) జర్మనీ బి) స్వీడన్
సి) యుకె డి) ఫ్రాన్స్

2. 2021లో ప్రెసిడెంట్ జో బిడెన్ హయాంలో USA తిరిగి ఏ పర్యావరణ ఒప్పందంలో చేరింది?
ఎ) క్యోటో ప్రోటోకాల్ బి) పారిస్ ఒప్పందం
సి) మాంట్రియల్ ప్రోటోకాల్ డి) రియో డిక్లరేషన్

3. పారిస్ ఒప్పందం యొక్క ప్రాథమిక లక్ష్యం ఏమిటి?
ఎ) ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం
బి) గ్లోబల్ వార్మింగ్‌ను 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పరిమితం చేయడం
సి) అంతరించిపోతున్న జాతులను రక్షించడం
డి) నీటి కాలుష్యాన్ని తగ్గించడానికి

4. 2020లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 2060 నాటికి కార్బన్ న్యూట్రల్ అవుతుందని ఏ దేశం ప్రతిజ్ఞ చేసింది?
ఎ) భారతదేశం బి) చైనా
సి) బ్రెజిల్ డి) రష్యా

5. 2023 నాటికి వాయు కాలుష్యం కారణంగా అత్యధిక మరణాలు సంభవించిన ఆసియా దేశం ఏది?
ఎ) భారతదేశం బి) చైనా
సి) పాకిస్తాన్ డి) బంగ్లాదేశ్

6. ఈ కింది వాటిలో ఏ దేశం 2030 నుండి కొత్త పెట్రోల్ మరియు డీజిల్ కార్ల అమ్మకాలను నిషేధిస్తున్నామని ప్రకటించింది?
ఎ) యుఎస్ఎ బి) జర్మనీ
సి) యుకె డి) జపాన్

7. ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏ దేశం ప్రారంభించింది?
ఎ) చైనా బి) భారతదేశం
సి) యుఎస్ఎ డి) జపాన్

8. ఈ కింది వాటిలో ఏ అంతర్జాతీయ పర్యావరణ సంస్థ 'ఎర్త్ అవర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది?
ఎ) గ్రీన్ పీస్
బి) వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (WWF)
సి) భూమి యొక్క స్నేహితులు
డి) సియెర్రా క్లబ్

9. ఈ కింది వాటిలో ఏ దేశం తన వాతావరణ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 2030 నాటికి 2 బిలియన్ చెట్లను నాటడానికి కట్టుబడి ఉంది?
ఎ) కెనడా బి) ఆస్ట్రేలియా
సి) బ్రెజిల్ డి) రష్యా

10. 2025 నాటికి అన్ని శిలాజ ఇంధనంతో నడిచే వాహనాలపై నిషేధాన్ని ప్రకటించిన మొదటి నగరం ఏది?
ఎ) పారిస్ బి) ఓస్లో
సి) టోక్యో డి) న్యూయార్క్

11. 2023 నాటికి ప్రపంచంలో అతిపెద్ద పవన శక్తిని ఉత్పత్తి చేసే దేశం ఏది?
ఎ) USA బి) జర్మనీ
సి) చైనా డి) భారతదేశం

12. 2023 ఐక్యరాజ్యసమితి జీవవైవిధ్య సదస్సు (COP15)ని ఏ నగరం నిర్వహించింది?
ఎ) మాంట్రియల్ బి) బీజింగ్
సి) పారిస్ డి) నైరోబీ

13. 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్' ఉద్యమాన్ని ప్రారంభించిన పర్యావరణ కార్యకర్త ఎవరు?
ఎ) లియోనార్డో డికాప్రియో బి) గ్రేటా థన్‌బెర్గ్
సి) అల్ గోర్ డి) వంగారి మాతై

14. 2020లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై దేశవ్యాప్తంగా నిషేధాన్ని ఏ దేశం అమలు చేసింది?
ఎ) భారతదేశం బి) ఆస్ట్రేలియా
సి) కెనడా డి) న్యూజిలాండ్

15. స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో 'గ్రీన్ బెల్ట్ మరియు రోడ్ ఇనిషియేటివ్'కు ప్రసిద్ధి చెందిన దేశం ఏది?
ఎ) యుఎస్ఎ బి) చైనా
సి) భారతదేశం డి) జపాన్

16. వార్షిక 'స్టేట్ ఆఫ్ ది వరల్డ్స్ ఫారెస్ట్' నివేదికను ఏ సంస్థ ప్రచురిస్తుంది?
ఎ) ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP)
బి) వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (WWF)
సి) ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (FAO)
డి) గ్రీన్‌పీస్

17. 1990లో తొలిసారిగా కార్బన్ పన్నును ప్రవేశపెట్టిన యూరోపియన్ దేశం ఏది?
ఎ) జర్మనీ బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) యుకె

18. ప్రపంచంలోనే అతిపెద్ద పగడపు దిబ్బ వ్యవస్థ ఉన్న దేశం ఏది?
ఎ) ఇండోనేషియా బి) ఆస్ట్రేలియా
సి) ఫిలిప్పీన్స్ డి) బ్రెజిల్

19. హైడ్రోఫ్లోరోకార్బన్‌ల (హెచ్ఎఫ్‌సి) వినియోగాన్ని దశలవారీగా నిలిపివేయాలని ఏ అంతర్జాతీయ ఒప్పందం లక్ష్యంగా పెట్టుకుంది ?
ఎ) పారిస్ ఒప్పందం బి) మాంట్రియల్ ప్రోటోకాల్
సి) క్యోటో ప్రోటోకాల్ డి) కిగాలీ ఒప్పందం

20. 2030 నాటికి 1 బిలియన్ చెట్లను నాటేందుకు ప్రణాళికను ప్రకటించిన ఆఫ్రికన్ దేశం ఏది?
ఎ) కెన్యా బి) నైజీరియా
సి) ఇథియోపియా డి) దక్షిణాఫ్రికా

21. 2020లో కొత్త చమురు మరియు గ్యాస్ అన్వేషణ లైసెన్స్‌లపై నిషేధాన్ని ప్రకటించిన యూరోపియన్ దేశం ఏది?
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) యుకె డి) ఫ్రాన్స్

22. 'వన్ ట్రిలియన్ ట్రీస్' కార్యక్రమాన్ని ప్రారంభించిన దేశం ఏది?
ఎ) జర్మనీ బి) యుఎస్ఎ
సి) చైనా డి) బ్రెజిల్

23. 2050 నాటికి కార్బన్ న్యూట్రాలిటీని సాధిస్తామని ఏ ఆసియా దేశం ప్రతిజ్ఞ చేసింది?
ఎ) భారతదేశం బి) దక్షిణ కొరియా
సి) జపాన్ డి) ఇండోనేషియా

24. ఎడారీకరణను ఎదుర్కోవడానికి 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టుకు పేరుగాంచిన దేశం ఏది?
ఎ) ఈజిప్ట్ బి) నైజీరియా
సి) సెనెగల్ డి) ఇథియోపియా

25. ప్రపంచంలో అత్యధికంగా జలవిద్యుత్ ఉత్పత్తి చేసే దేశం ఏది?
ఎ) యుఎస్ఎ బి) బ్రెజిల్
బి) కెనడా డి) చైనా

సమాధానాలు

1. సి	2. బి	3. బి	4. బి	5. ఎ
6. సి	7. ఏ	8. బి	9. ఎ	10. బి
11.సి	12.ఎ	13.బి	14.ఎ	15. బి
16.సి	17.బి	18.బి	19.డి	20. సి
21.బి	22.బి	23.సి	24.సి	25. డి